PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 175 | విజయవాడ, సోమవారం 27 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 27 January 2025 | Rs

**జ్యోతి యర్రాజికి స్వర్ణం**

- 60మీ. హర్డిల్స్‌లో జాతీయ రికార్డు బ్రేక్

8

పతాకావిష్కరణ అనంతరం సెల్యూట్ చేస్తున్న గవర్నర్ నజీర్

# ఘనంగా గణతంత్ర పరేడ్

## జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము • ఆకట్టుకున్న ఎపి శకటం

ఎపి శకటం

రాష్ట్రపతికి అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

సైనిక విన్యాసాలు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

భారత దేశ 76వ గణతంత్ర దినోత్సవ పరేడ్ రాజ్‌పథ్‌లో (కర్తవ్య పథ్)లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. 21 తుపాకీల వందనంతో జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ వేడుకలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాని మోడీ జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించి, అమరవీరులకు నివాళులర్పించారు. ఆయనతో పాటు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సైనిక అధికారులు పాల్గొన్నారు.. ఢిల్లీలోని విధి మార్గంలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో దేశం తన శక్తిని, సాంస్కృతిక వారసత్వాన్ని చాటే ప్రయత్నం చేసింది.

**ప్రధాన ఆకర్షణ**

ఇండోనేషియాకు చెందిన 352 మంది సభ్యుల కవాతు, బ్యాండ్ బృందం కూడా పరేడ్‌లో పాల్గొంది. శకటాల ఇతివృత్తం 'స్వర్ణ భారతదేశం: వారసత్వం, అభివృద్ధి'. ఈ పరేడ్‌లో మొత్తం 31 శకటాలు, 18 మార్చింగ్ కంటింజెంట్లు, 15 బ్యాండ్లు పాల్గొన్నాయి. ఇవి కాకుండా అదనంగా దాదాపు 5 వేల మంది కళాకారులు 45 నృత్యరీతులతో కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఇండోనేషియాకు చెందిన 152 మంది సాయుధ దళాల సభ్యులు ఈ ప్రత్యేక కవాతులో పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న ఏటికొప్పాక బొమ్మల శకటం**

ఈ పరేడ్‌లో ప్రదర్శించిన వివిధ రాష్ట్రాల శకటాలు పాల్గొన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఏటికొప్పాక బొమ్మల శకటం మాత్రం ఈ పరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాధారణ కర్రతో తయారు చేసే ఈ ఏటికొప్పాక బొమ్మలతో కూడిన శకటం అందరినీ ఆకట్టుకుంది. ఇక టి-90 భీష్మ ట్యాంక్, బ్రహ్మోస్ క్షిపణి వంటి అత్యాధునిక సైనిక హార్డ్‌వేర్‌లతో పాటు స్వదేశీ తయారీ యుద్ధ ట్యాంకులు, విమానాలను సైతం ఈ పరేడ్‌లో ప్రదర్శించారు. అలాగే ఈ వేడుకల సందర్భంగా ఎంఐ 17 వి 5 హెలికాప్టర్లను ప్రదర్శించారు. 129 హెలికాప్టర్ యూనిట్‌కు చెందిన ఈ హెలికాప్టర్లు కర్తవ్యపథ్ మీదుగా జెండాలతో విహరించి, అందరిని ఆకట్టుకున్నాయి. సిఆర్‌పిఎఫ్‌కు చెందిన 148 మంది మహిళా జవాన్లు నిర్వహించిన కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రిపబ్లిక్ డే వేడుకలను వీక్షించేందుకు దాదాపు 10 వేల మంది ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. యాంటీ డ్రోన్ వ్యవస్థలు, ఆర్మీ హెలికాప్టర్లు, భద్రతా సిబ్బంది ఈ పరేడ్‌ను డేగ కన్నుతో గస్తీని నిర్వహించాయి.

# స్వర్ణాంధ్ర కోసం 10 సూత్రాలు

## ఆరోగ్య, ఐశ్వర్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

## 2026 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి

## గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రాన్ని ఆరోగ్య, ఐశ్వర్య, ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ తెలిపారు. ఇందుకోసం స్వర్ణాంధ్ర విజన్ 2047 రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 15 శాతం ఆర్థిక వృద్ధిని సాధించాలని, ప్రస్తుత తలసరి ఆదాయం రూ.2.68 లక్షలను 2047 నాటికి రూ.53.34 లక్షలకు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర కోసం మరో పది సూత్రాలను రూపొందించుకుని అమలు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన.. జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ.. పేదరికం లేని సమాజాన్ని రూపొందించడం, ప్రతి కుటుంబం గౌరవంగా జీవించడం ప్రభుత్వ విజన్ అని పేర్కొన్నారు. యువత ఉద్యోగాలను అభ్యర్థించే స్థితి నుంచి కల్పించే స్థితికి చేరుకుంటారని చెప్పారు. ఏడు నెలలకు ముందున్న పాలనలో రాష్ట్రం ఆర్థికంగా, పరిపాలనా పరంగా అతలాకుతలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ఆర్థికసాయం అందించేందుకు నిధులిచ్చి ఆదుకుందని తెలిపారు. ప్రభుత్వ పాలసీల లక్ష్యం సంపద సృష్టి అని, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత సాధిస్తామని అన్నారు. రూ.3 వేలు ఉన్న పెన్షన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచామని, అందరికీ ఇళ్లు, దీపం 2.0, ఇతర పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పేదరిక నిర్మూలనకు పి4 విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో అగ్రభాగాన ఉన్న 10 శాతం మంది ధనవంతులు అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకునేలా ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఉపాధి కల్పనలో భాగంగా పారిశ్రామికాభివృద్ధి పాలసీ 4.0 తీసుకొచ్చామన్నారు. తగ్గిపోతున్న శ్రామిక శక్తి, మార్పులకు లోనవుతున్న కుటుంబ వ్యవస్థలను దృష్టిలో వుంచుకుని, జనాభా నిర్వహణకు ఒక విధానాన్ని తీసుకొస్తున్నట్లు చెప్పారు. సాగునీటికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, పోలవరం ప్రాజెక్టును 2026 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. గోదావరి – పెన్నా అనుసంధానం ఒక గేమ్ ఛేంజర్‌గా పేర్కొన్నారు.

గోదావరి వరద నీటిని బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలించడానికి ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందించిందన్నారు. వ్యవసాయంలో ఎఐ టెక్నాలజీని వినియోగించుకుం టామని, అరటి, మామిడి, మిర్చి, కాఫీ, ఆయిల్ సీడ్స్‌కు ప్రత్యేక హబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తీర ప్రాంతాన్ని ఆధారంగా చేసుకుని గ్లోబల్ లాజిస్టిక్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తామన్నారు. ఎపి క్లీన్ ఎనర్జీ పాలసీలో 160 గిగావాట్ల సామర్థ్యం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ రంగంలో 7.5 లక్షల ఉద్యోగాలకు అవకాశం ఉందన్నారు. 5 వేల ఇవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 17,040 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వ్యవసాయ, గృహ నిర్మాణశాఖ మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారథి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, డిజిపి ద్వారకా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాల పునర్ వ్యవస్థీకరణ

- 3 కేటగిరీలుగా సిబ్బంది వర్గీకరణ
- ఉత్తర్వులు జారీ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

సచివాలయాలను పునర్ వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది. జనాభా ఆధారంగా మూడు కేటగిరీలుగా సచివాలయాలను విభజించింది. సచివాలయ ఉద్యోగులను మూడు కేటగిరీలుగా విభజించి జనాభాను బట్టి ఆయా సచివాలయాలకు ఉద్యోగుల సంఖ్యను నిర్ణయించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ ప్రభుత్వానికి సమర్పించిన సూచనల ప్రతిపాదనల ప్రకారం, స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనకు అనుకూలంగా 2,500 వరకూ జనాభా ఉన్న సచివాలయాలను 'కేటగిరి ఎ'గా, జనాభా 2501 నుంచి 3,500 వరకూ ఉన్న సచివాలయాలను 'కేటగిరి బి'గా, 3,500 ఆపైన జనాభా కలిగిన సచివాలయాలను 'కేటగిరి సి'గా విభజించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 11,162 గ్రామ సచివాలయాలు, పట్టణాల్లో 3,482 వార్డు సచివాలయాలు చొప్పున మొత్తం 15,004 సచివాలయాలు ఉన్నాయి. గిరిజన ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తగిన చర్యలు తీసుకోవడానికి వెసులుబాటు కల్పించారు. సిబ్బందిని మల్టీ పర్పస్, టెక్నికల్, యాస్పిరేషనల్‌గా వర్గీకరించారు. ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు కనీసం ఒక్కో సచివాలయానికి ఆరుగురు సిబ్బంది ఉండాలని, 'కేటగిరి ఎ'లో ఒక్కో సచివాలయానికి కనీసం ఏడుగురు సిబ్బందిని, 'కేటగిరి బి'లో ఒక్కో సచివాలయానికి కనీసం ఎనిమిది మందిని, 'కేటగిరి సి' జనాభాను, ప్రాంత స్వభావాన్ని బట్టి సిబ్బందిని కేటాయిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యాస్పిరేషనల్ సిబ్బంది పాలనలో ఐఓటి, ఎఐ, డ్రోన్, ఇతర డీప్ టెక్నాలజీ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సచివాలయానికి కనీసం ఒకరైనా ఇటువంటి వారు ఉండాలని పేర్కొన్నారు. రేషనలైజేషన్‌లో మిగిలిన సిబ్బందిని గ్రామ, వార్డు సచివాలయాల ఫీల్డ్ ఆఫీసుల్లో, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించుకుంటుందన్నారు. పది కిలోమీటర్ల దూరం ఉన్న ఆవాసాలను గ్రామ పంచాయతీలకు సమస్య లేకుండా సమీపంలో ఉన్న సచివాలయాల్లో అనుసంధానించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, వార్డు పరిపాలనా కార్యదర్శి ఆయా గ్రామ, వార్డు సచివాలయాలకు అధిపతిగా ఉంటారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

మహాసభలో ప్రసంగిస్తున్న ప్రకాశ్ కరత్

# హిందుత్వ, కార్పొరేట్లపైనే బిజెపి మనుగడ

- కాషాయ కుయుక్తులను ఐక్యంగా తిప్పికొట్టాలి
- సిపిఎం స్వతంత్ర బలాన్ని పెంచుకోవాలి
- వామపక్షాల ఐక్యతకు కృషి
- సిపిఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలో ప్రకాశ్ కరత్

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

హిందుత్వ సిద్ధాంతం, కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడడమనే రెండు స్తంభాలపై ఆధారపడి బిజెపి మనుగడ సాగిస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ పేర్కొన్నారు. విశాల ప్రజా ఉద్యమాల ద్వారా వాటిని ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. వాటితోపాటు సరళీకరణ ఆర్థిక విధానాలు, సామాజిక అణచివేత, కులవివక్షపై పోరాడాలని దిశా నిర్దేశం చేశారు. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడంతోపాటు వామపక్షాల ఐక్యత కోసం కృషి చేయాలని సూచించారు. సంగారెడ్డి పట్టణం (సీతారాం ఏచూరి నగర్, మల్లు స్వరాజ్యం ప్రాంగణం)లో కొనసాగుతున్న సిపిఎం నాలుగో రాష్ట్ర మహాసభ ఆదివారం నాటికి రెండో రోజుకు చేరింది. జి.నాగయ్య, పోతినేని సుదర్శన్, టి.జ్యోతి, జాన్‌వెస్లీ, ఎండి అబ్బాస్ అధ్యక్షవర్గంగా నిర్వహించిన ప్రతి నిధుల సభలో ప్రకాశ్ కరత్ ప్రారంభోపన్యాసం చేశారు. గత మూడేళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో పలు మార్పులు సంభవించాయని తెలిపారు. రష్యా, ఉక్రెయిన్ ఘర్షణ, పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రస్తావించారు. ఇతర దేశాలు, ప్రజలందరూ శాంతిని కోరుకుంటున్న ప్రస్తుత తరుణంలో అమెరికా మాత్రం ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో భారత ప్రభుత్వం కూడా ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వడం మిగతా 7లో

## ఉభయ గోదావరి పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డివి రాఘవులు

**ప్రజాశక్తి - భీమవరం**

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు బరిలో ఉంటారని ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రజాసంఘాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాఘవులు పేరును గోపీమూర్తి ప్రకటించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన రాఘవులు యుటిఎఫ్‌లో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ వివిధ బాధ్యతల్లో పని చేశారు. ఫ్యాప్టో ఛైర్మన్‌గా, జెఎసి కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు.

# రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

- రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాజ్యాంగాన్ని రక్షించుకుందామని ప్రమాణం చేస్తున్న నేతలు

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన విజయవాడలోని రైల్వే స్టేషన్ నుంచి అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వరకు ఆదివారం బైకు ర్యాలీ జరిగింది. అనంతరం వడ్డే మాట్లాడుతూ.. రైతులు ఏడాది పాటు ఉద్యమం చేసినా కేంద్ర ప్రభుత్వం... వారి డిమాండ్లను నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో 146 మంది ఎంపిలను సస్పెండ్ చేసి అనేక కీలక బిల్లులను అప్రజాస్వామికంగా మోడీ ప్రభుత్వం ఆమోదించుకుందన్నారు. నూతన మార్కెట్ విధానం, సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం, కార్పొరేట్లకు అనుకూలంగా తెచ్చిందన్నారు. ఈ చట్టాల వల్ల సహకార సంఘాలు.. కార్పొరేట్ కంపెనీల పరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన భూములను మైనింగ్ పేరుతో అదాని, అంబానీలకు కట్టబెడుతు న్నారని విమర్శించారు. అడ్డుకుంటున్న ఆదివాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. అటవీ భూముల్లో మైనింగ్ చేపట్టడం వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ.. రాజ్యాంగం లోని మౌలిక సూత్రాలు, ప్రమాణాలకు అత్యంత ప్రమాదం నెలకొందన్నారు. దేశ సంపదను అందరికీ పంచాలని రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లో ఉన్నా, ప్రధాని నరేంద్ర మోడీ కేవలం అదాని, అంబానీలకు మాత్రమే కట్టబెడు తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే వ్యవసాయ రంగాన్ని వీరి చేతుల్లో పెట్టేందుకు చట్టాలు తీసుకొచ్చారని చెప్పారు. దీనివల్ల రైతులకు రుణాల మాఫీ లేదని, గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పించడం లేదన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమలుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని దినాలు, గంటలు పెంచి కార్మికుల శ్రమను, ధనాన్ని దోచుకునే పన్నాగాలు పన్నుతున్నారని విమర్శించారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పెద్దయెత్తున ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలను వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో రూపొందించారని తెలిపారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి, రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, ఎఐటియుసి నాయకులు వెంకటసుబ్బయ్య, ఇఫ్టూ కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘాల నాయకులు పి జమలయ్య, వెంకటరెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## ఆటోను ఢీకొన్న లారీ

- ఒకే కుటుంబంలో నలుగురు మృతి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

వలస కార్మికులు వెళుతున్న ఆటోను ఇనుప స్తంభాల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి ఢీ కొట్టడంతో నలుగురు మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా మామునూరు ప్రధాన రహదారిపై ఆదివారం జరిగింది. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ జిల్లా లలితానగర్‌లోని పోలార్‌రోడ్డు నుంచి పొట్టపోసుకోవడానికి వచ్చిన సంతోష్ చౌహాన్ కుటుంబం.. వరంగల్ గవిచర్ల క్రాస్ రోడ్డు వద్ద ఉంటూ పల్లెలు తిరుగుతూ అక్కడే కొద్ది రోజులుంటూ కత్తులు, గొడ్డళ్లు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం మామునూరు నుంచి ఆటోలో గవిచర్ల క్రాస్ రోడ్డుకు బయలుదేరారు. ఈ క్రమంలో ఖిల్లా వరంగల్ మండలం మామునూరు వైపుగా ఇనుక స్తంబాల లోడుతో వస్తున్న లారీ అదుపుతప్పి వీరు ప్రయాణిస్తున్న ఆటోను వెనుకనుంచి ఢీ కొట్టి బోల్తా పడింది. ఇనుప విద్యుత్ స్తంబాలు ఆటోలో ప్రయాణిస్తున్న వారికి దిగి సంతోష్ (50), ఆయన కుమార్తె పూజ (17), చిన్న కుమారుడు కన్నా (7) అక్కడికక్కడే మృతి చెందారు. సంతోష్ భార్య సమత్ (45), పెద్ద కుమారుడు ముఖేష్ తీవ్రంగా గాయపడటంతో ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సమత్ మృతి చెందారు.

# రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఒంటరి చేయాలి

- రాజ్యాంగ పీఠిక పఠనంలో డిఎస్ఎంఎం నాయకులు వి శ్రీనివాసరావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

భారత దేశ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలనుకునే శక్తులను ఒంటరి చేసేందుకు పోరాటం చేయాలని దళిత్ శోషన్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు వి.శ్రీనివాస రావు కోరారు. దీనికోసం అన్ని వర్గాల ప్రజలను కలుపుకోవాలని అన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యాన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబే ద్కర్ విగ్రహం వద్ద ఆదివారం రాజ్యాంగ పీఠిక పఠనం జరిగింది. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం అందరి చేత రాజ్యాంగ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం జరుపు కోవడం పౌరులందరి హక్కు అని అన్నారు. దేశంలో మిగతా 7లో

# ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

పరేడ్‌లో మొదటి బహుమతి పొందిన నైపుణ్యాభివృద్ధి, విద్య, వైద్య, ఆరోగ్యశాఖలు (నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి) శకటాలు

బహుమతులను అందజేస్తున్న గవర్నర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గణతంత్ర దినోత్సవ వేడుకలలో వివిధ శాఖల శకటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. స్వర్ణాంధ్ర-2047, ప్రగతికి సోపానం పది సూత్రాలు ఆధారంగా మొత్తం 18 శాఖలు శకటాలను రూపొందించాయి. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో వీటి ప్రదర్శన పూర్తయిన అనంతరం విజయవాడలోని పలు ప్రధాన రహదారులైన బందరు రోడ్డు, రింగ్ రోడ్డు, ఏలూరు రోడ్డులలో శకటాల ప్రదర్శన నిర్వహించారు. సెర్ప్, గృహ నిర్మాణం, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, జలవనరులు, అటవీ, వ్యవసాయం, మత్స్య, సిఆర్‌డిఎ, పంచాయతీరాజ్, ఇంధన, ఉద్యాన, స్వచ్ఛాంధ్ర, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖలు శకటాలను రూపొందించాయి. ప్రదర్శనలో మొదటి బహుమతి పొందిన శకటం నైపుణ్యాభివృద్ధి, విద్య, వైద్య, ఆరోగ్యశాఖలు (నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి), రెండో బహుమతి ఉద్యానశాఖ (నాణ్యమైన ఉత్పత్తులు బ్రాండింగ్), మూడో బహుమతి సిఆర్‌డిఎ, ఎంఎయుడి, పిఆర్ అండ్ ఆర్‌డి శాఖల (గ్లోబల్ - బెస్ట్ లాజిస్టిక్స్) శకటాలు సాధించాయి. గవర్నర్ నుంచి ఆ శాఖల ఉన్నతాధికారులు బహుమతులు అందుకున్నారు.

**పెరేడ్‌లో బహుమతులు పొందినవారు వీరే..**

గణతంత్ర వేడుకల్లో నిర్వహించిన సాయుధ దళాల పెరేడ్‌లో రిజర్వ్ కేటగిరిలో మొదటి బహుమతిని సిఆర్‌పిఎఫ్ బెటాలియన్, రెండో బహుమతిని తమిళనాడు స్పెషల్ పోలీసు బెటాలియన్, నాన్ రిజర్వ్ కేటగిరిలో మొదటి బహుమతి సాంఘిక సంక్షేమ పాఠశాల బాలురు బెటాలియన్, రెండో బహుమతి ఎన్‌సిసి బాలురు బెటాలియన్ కైవసం చేసుకున్నాయి.

## రిపబ్లిక్ డే రోజున హాస్టల్ విద్యార్థుల పస్తులు

- మద్యం మత్తులో పట్టించుకోని వార్డెన్
- చెన్నేకొత్తపల్లి బిసి హాస్టల్‌లో ఘటన
- కలెక్టర్ ఆగ్రహం, వార్డెన్ సస్పెన్షన్

హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి / అమరావతి బ్యూరో

అధికారుల నిర్లక్ష్యంతో గణతంత్ర దినోత్సవం రోజున బిసి హాస్టల్ విద్యార్థులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలోని బిసి హాస్టల్‌లో ఆదివారం చోటుచేసుకుంది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నేకొత్తపల్లిలోని బిసి హాస్టల్‌లో 120 మంది విద్యార్థులు ఉన్నారు. ఆదివారం గణతంత్ర దినో త్సవం కావడంతో విద్యార్థులు ఉదయాన్నే పాఠశాలకు వెళ్లారు. వేడుకలు ముగిసిన తరువాత మధ్యాహ్నం 11 గంటలకు విద్యార్థులు హాస్టల్‌కు చేరుకున్నారు. హాస్టల్లో భోజనం వండకపోవడంతో విద్యార్థులు ఆకలితో అలమటించారు. తల్లిదండ్రులు ఇచ్చిన చిల్లర డబ్బులు దాచుకున్న కొంతమంది విద్యార్థులు బయటకు వెళ్లి చిరుతిళ్లు తిన్నారు. మిగిలిన వారు అలాగే ఏమి తినకుండానే ఉండిపోయారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. స్థానిక విలేకరులు సమస్యను ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో, హాస్టల్‌ను ఆర్‌డిఒ సందర్శించి అక్కడి పరిస్థితి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ నారాయణను ప్రశ్నిస్తే ఆయన సరైన సమాధానంలేదు. పైగా వార్డెన్ మద్యం మత్తులో ఉండడంతో ఆర్‌డిఒ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇక్కడి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. హాస్టల్ విద్యార్థులు పస్తులతో ఉండడం, వార్డన్ మద్యం తాగి ఉండడం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇది కాస్తా సిఎం దృష్టికి వెళ్లింది. దీంతో వార్డెన్ నారా యణను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

**సికె పల్లి ఘటనపై సిఎం ఆగ్రహం**

వసతి గృహంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందని విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిర్లక్ష్యం వహించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను సిఎం ఆదేశించారు.

**వార్డెన్‌ను సస్పెండ్ చేయండి : మంత్రి**

వసతి గృహంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందని ఘటనపై బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత ఆరా తీశారు. విద్యార్థులకు వెంటనే భోజనం ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో బిసి సంక్షేమశాఖ అధికారులు భోజనం ఏర్పాటు చేశారు. వసతి గృహం హెచ్‌డబ్ల్యుఒ నారాయణ స్వామిని తక్షణమే విధు ల్లోంచి తొలగించాలని ఫోన్‌లో కలెక్టర్‌ను ఆదేశించారు.

## ధర్మవరంలో ఉద్రిక్తత

- టిడిపి, బిజెపి నాయకుల మధ్య ఘర్షణ
- పోలీసుల మోహరింపు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఓ వైసిపి నేత బిజెపిలో చేరే విషయంలో కూటమి పార్టీలైన టిడిపి, బిజెపి నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. టిడిపి నాయకుల వాహనాలపై బిజెపి నాయకులు కట్టెలు, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘర్షణలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరుగకుండా డిఎస్‌పి హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఘర్షణల కారణంగా పట్టణంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడటంతో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ధర్మవరానికి చెందిన వైసిపి నాయకుడు బిజెపిలో చేరే విషయంలో టిడిపి, బిజెపి నాయకుల మధ్య విభేదాలు వచ్చినట్లు సమాచారం. వైసిపి నాయకుడు బిజెపిలోకి చేరే విషయంలో టిడిపి నాయకులు విబేధించినట్లు తెలిసింది. ఆ నాయకుడిని తాము తమపార్టీలోకి చేర్చుకుంటామని బిజెపి నాయకులు పట్టుపట్టడంతో ఇరుపార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త వాతారణం నెలకొన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా డిఎస్‌పి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యతని, శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసు విభాగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.

## ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

- పాఠశాల విద్య డైరెక్టర్‌కు పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐవి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తప్పుడు సమాచారం ఉంటే ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు పెడతామని బెదిరించిన పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై విద్యాశాఖ అధికారులు ఇచ్చిన నివేదిక తప్పుగా ఉందని, ఈ సమాచారం ఇచ్చిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పడంపై అభ్యంతరం తెలియజేస్తున్నామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ యంత్రాంగంపై నమ్మకం లేని కమిషనర్‌కు రెవెన్యూ యంత్రాంగంపై నమ్మకం కలిగిందా? అని ప్రశ్నించారు. ఎన్‌రోల్‌మెంట్, డ్రాపౌట్స్‌కు సంబంధించి స్పష్టమైన ఆదేశాలిచ్చి అందుకు భిన్నమైన నమోదు ఉంటే చర్యలు తీసుకోవచ్చునని తెలిపారు. క్రిమినల్ కేసులు పెడతామని బెదిరింపులు ఏమిటని, ఉపాధ్యాయులు ఎలా క్రిమినల్స్ అవుతారని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దు చేయాలని అడిగితే గత ప్రభుత్వం ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం తప్పుడు సమాచారం దొర్లితే క్రిమినల్ కేసులు పెడతామనే బెదిరింపులు ఏమిటని ప్రశ్నించారు.

## అగ్ని ప్రమాదంలో గాయపడిన బాలుడు మృతి

ప్రజాశక్తి - మండవల్లి (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా మండవల్లి మండలంలోని ప్రత్తిపాడు స్టేజి వద్ద చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో గాయపడిన నాలుగేళ్ల బాలుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ప్రత్తిపాడు స్టేజి వద్ద శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించి పది పూరి గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో నాలుగేళ్ల బాలుడు విక్కీతో పాటు బాలుడి తల్లికి, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ విక్కీ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విక్కీ మృతదేహానికి పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ రామచంద్రరావు తెలిపారు.

# కదం తొక్కిన కార్మికులు, కర్షకులు

- రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి
- రాష్ట్ర వ్యాప్తంగా ట్రాక్టర్, బైక్ ర్యాలీలు

విశాఖలో నిర్వహించిన కార్మిక ప్రదర్శనలో సిహెచ్ నర్సింగరావు తదితరులు

కర్నూలులో ట్రాక్టర్‌లతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

ఒంగోలులో ర్యాలీని ప్రారంభిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రంగారావు

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై రైతులు, కార్మికులు కదం తొక్కారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రాక్టర్, బైక్ ర్యాలీలు నిర్వహించారు. గణతంత్ర వేడుకల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఆదివారం ఎపి రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు చేశారు. కార్మికుల పొట్టగొట్టే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించా లని నినదించారు. గణతంత్ర స్ఫూర్తితో కార్మిక, రైతు చట్టాలను రక్షించుకుంటామని ప్రతినబూనారు.

విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆశీల్‌మెట్ట వరకు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు, ఎఐటియుసి నాయకులు డి.ఆదినారా యణ, ఇతర అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లౌకిక, ప్రజాస్వామ్య హక్కులను హరించడంతోపాటు కార్మిక, రైతు చట్టాలకు తూట్లు పొడుస్తోందన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో కార్మిక, రైతు చట్టాలు, రాజ్యాంగ రక్షణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దగల సిఐటియు కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని మార్కెట్ యార్డ్ నుండి స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్క్ వరకు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ పార్క్ వద్ద జరిగిన సభలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్పొరేట్ అనుకూల విధానాలే కారణమన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, కేరళ తరహా రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలో ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు ప్రారంభించి మాట్లాడారు. పెదనంది పాడులో నిరసన తెలిపారు. పెదకాకాని, అమరాతి రాజధాని పరిధి తుళ్లూరులో నిరసన ప్రదర్శన చేశారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వ పదేళ్ల కాలంలో రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. పౌరుల హక్కులకు భంగం వాటిల్లిందని తెలిపారు. ఇటువంటి సమ యంలో రాజ్యాంగాన్ని, హక్కులను కాపాడుకోవడం ప్రతి భారతీయుని బాధ్యత అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. బొబ్బిలిలో బైక్ ర్యాలీ చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. పాలకొండలోని కోటమ్మ ఆలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రంలోని విస్సాకోడేరు రైస్‌మిల్లు సెంటర్ నుంచి భీమవరం ప్రకాశంచౌక్ వరకూ ట్రాక్టర్, బైక్ ర్యాలీ చేసి సభ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి.బలరాం మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రజలపై భారాలు వేయబోమని మోడీ ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. నరసాపురం మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో, జీలుగుమిల్లిలో అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. కర్నూలు జిల్లా పరిషత్ నుండి కొండారెడ్డి బురుజు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు సిపిఎం ఆధ్వర్యంలో రెడ్‌షర్ట్ వలంటీర్లు ప్రదర్శన చేశారు. రాజ్యాంగాన్ని రక్షించుకుంటాం.. హక్కులను కాపాడుకుంటాం అంటూ నినదించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి.ఆనంద్ బాబు భారత రాజ్యాంగ పీఠికను చదివి అందరి చేత ప్రమాణం చేయించారు. కర్నూలులో అంబేద్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకూ ట్రాక్టర్ల ర్యాలీ చేపట్టారు. నంద్యాలలో నూనెపల్లె ఫ్లై ఓవర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ ట్రాక్టర్లు, బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆత్మకూరు, నందికొట్కూరు, పాములపాడులో ర్యాలీలు చేపట్టారు. శ్రీకాకుళం నగరంలో నిర్వహించిన బైక్ ర్యాలీ ఏడు రోడ్ల కూడలి నుంచి ప్రారంభమై జిటి రోడ్డు, సూర్యమహల్ కూడలి మీదుగా రామలక్ష్మణ కూడలి వరకు సాగింది. కడప, అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు నగరంలో బోసు బొమ్మ నుంచి విఆర్‌సి సెంటర్ వరకు రైతు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, ముదిగుబ్బ పుట్టపర్తి మండలాల్లో, అనంతపురం జిల్లా పామిడి, ఉరవకొండ మండలాల్లో నిరసన ర్యాలీలు చేపట్టారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ట్రాక్టర్లు, బైక్ ర్యాలీలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పాల్గొన్నారు.

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న మండలి ఛైర్మన్ మోషేన్ రాజు, సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు

## మత గ్రంథం కన్నా రాజ్యాంగం గొప్పది

- అన్ని తరగతుల్లో పాఠ్యాంశాలుగా చేర్చాలి
- 'రాజ్యాంగం'పై పుస్తకాల ఆవిష్కరణ సభలో మండలి ఛైర్మన్ మోషేన్ రాజు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలోని అన్ని మత గ్రంథాల కంటే రాజ్యాంగం గొప్పదని రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ కె.మోషేన్ రాజు అన్నారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు రాజ్యాంగంపై రాసిన ఐదు పుస్తకాల ఆవిష్కరణ సందర్భంగా గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం రాత్రి జరిగిన సభలో మోషేన్ రాజు ప్రసంగించారు. తొలుత భారత రాజ్యాంగం తెలుగు అనువాదం పుస్తకాన్ని మోషేన్‌రాజు ఆవిష్కరించారు. రాజ్యాంగ నిర్మాణం, పీఠిక పుస్తకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవితం పుస్తకాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు పుస్తకాన్ని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సమకాలీన వ్యాసాలు పుస్తకాన్ని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఐలూ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభలో మోషేన్‌రాజు ప్రసంగిస్తూ.. భారత రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవడం, ఆచరించడం కోస రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. రాజ్యాంగాన్ని సరళమైన భాషలో తీసుకొచ్చే ప్రయ త్నం చేసిన కెఎస్.లక్ష్మణరావును ఆయన అభినందించారు. శాసన మండలిలో ప్రజా సమస్యలపై చర్చించడంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ పాత్ర అమోఘమైందన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజ్యాంగం అమలు సంక్షోభంలో చిక్కుకుందని, రాజ్యాంగాన్ని రక్షించుకు నేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కాంగ్రెస్‌తోపాటు కమ్యూనిస్టులు కీలక భూమిక పోషించారని, ఈ ఉద్యమంతో సంబంధంలేని వ్యక్తులు ఇప్పుడు భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని వివరించారు. కార్పొరేట్, మతోన్మాద శక్తుల వల్ల రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని, ఈ కుట్రలను భగ్నం చేయాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడు తూ రాజ్యాంగంపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాలని, విద్యార్థి దశ నుంచే అవగాహన కోసం పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయా లని, ఇది నిత్య జీవితంలో ఒక భాగం కావాలని కోరారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని సమూలంగా మార్చలన్న బిజెపి కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావుతో పాటు వి.లక్ష్మణరెడ్డి, నారాయణరావు, కన్నా మాస్టారు, కేశన శంకరావు ప్రసంగించారు.

## ప్రజా సమస్యలపై పోరాడే రాఘవులును గెలిపించాలి

- ఎమ్మెల్సీ గోపీమూర్తి

రాఘవులును పరిచయం చేస్తున్న గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

రానున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులు పరిచయ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అభ్యర్థి రాఘవులును ఎమ్మెల్సీ గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.సుభాషిని, కె.శ్రీదేవి సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ.. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన రాఘవులు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా, ఫ్యాప్టో చైర్మన్‌గా, జెఎసి కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారన్నారు. 40 ఏళ్ల ఉపాధ్యాయునిగా సుదీర్ఘమైన సర్వీసులో ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, రైతు, కార్మిక, కర్షక సమస్యలపై పిడిఎఫ్ నిరంతరం పోరాడుతుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పట్టభద్రులు మొదటి ప్రాధాన్యతా ఓటును రాఘవులకు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అభ్యర్థి రాఘవులు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యార్థి, యువజన, మహిళ, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వంతో పోరాడి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, పిడిఎఫ్ వారసత్వాన్ని కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఆర్.రవికుమార్, ఎకెవి.రామభద్రం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కె.సురేంద్ర, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు మురళీకృష్ణ, యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎస్.జయప్రభ, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిజె.గాంధీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు జి జేమ్స్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సిహెచ్ ప్రసాదరావు, రైతు సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు బి.బలరాం, ప్రజా సంఘాల జిల్లా నేతలు పాల్గొన్నారు.

## ముగిసిన ఏలూరు, తణుకు బాలోత్సవాలు

- నిర్వహణ అభినందనీయం :వక్తలు

ఏలూరులో హేలాపురి బాలోత్సవ విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, తణుకు

ఏలూరు జిల్లా వట్లూరు, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరిగిన బాలోత్సవాలు ఆదివారం ఉత్సాహంగా ముగిశాయి. ఏలూరు జిల్లా వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాల్లో విజేతలకు ఆదివారం స్థానిక సిఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 69 అకడమిక్, కల్చరల్ అంశాల్లో కిడ్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్ కేటగిరీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సభకు బాలోత్సవ కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ బాలోత్సవం పిల్లల సంబరాలు పేరిట వేలాది మంది విద్యార్థులను ఒకే చోట చేర్చి, వారిలోని సృజనాత్మకతను, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. రెండు రోజుల్లో సుమారు 14 వేల మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసొచ్చారని తెలిపారు. ఆహ్వాన సంఘం చైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, నిర్వాహక కమిటీ కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సిఆర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ కెఎ రామరాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గుత్తా గిరిబాబు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఆళ్ల సతీష్, వేమా సురేష్ మాట్లాడుతూ సామాజిక స్పృహ లేకుండా కేవలం మార్కులతో ఏ విద్యార్థీ ఉన్నత స్థానానికి చేరుకోరని, అలాంటి సామాజిక స్పృహ విద్యార్థుల్లో పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయని అన్నారు.

**అలరించిన మేజిక్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు**

పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని జడ్‌పి బాలుర హైస్కూల్‌లో జరిగిన బాలోత్సవంలో 50కి పైగా పాఠశాలల నుంచి సుమారు 2500 మందికిపైగా విద్యార్థులు 45 రకాల అకడమిక్, కల్చరల్ ఈవెంట్స్‌లో ప్రతిభ చాటుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవ సభలో బిఎం గోపాల్‌రెడ్డి చేసిన మేజిక్ షో, పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలోత్సవం నిర్వహణ కమిటీ అధ్యక్షులు హుస్సేన్ అహ్మద్, మానవత అధ్యక్షులు గమని రాంబాబు, రూట్స్ డైరెక్టర్ బి విద్యాకాంత్ మాట్లాడుతూ అందరం మంచి పౌరులుగా పిల్లల్ని తీర్చిదిద్దాలన్నారు.

# నేటి నుంచి సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు

- సిపిఎం రాష్ట్ర మహాసభ నేపథ్యంలో మూడ్రోజుల పాటు నిర్వహణ
- హాజరు కానున్న తమ్మారెడ్డి భరద్వాజ్, గోరటి వెంకన్న

సిద్ధమౌతున్న వేదిక

**ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి**

నెల్లూరు నగరంలో వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ నేపథ్యంలో సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు సోమవారం నుంచి మూడ్రోజులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ముత్తుకూరు గేట్ సెంటర్‌లో కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణ రాజు కళా ప్రాంగణంలో ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి సాంస్కృతిక ప్రదర్శలు జరగనున్నాయి. ప్రారంభ కార్యక్రమానికి సినీ దర్శకులు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గాయకులతో ఆలాపన పాటల కార్యక్రమం, బుచ్చిరెడ్డిపాలెం రేబాల కళాకారుల డప్పుల విన్యానం, నెల్లూరు సిటీకి చెందిన వారి పండరి భజన, ముత్తుకూరు మండలం నేలటూరిపాలెం కళాకారుల జడ కోలాటం, శాస్త్రీయ నృత్యాలు, నాగరాజు ఈవెంట్స్ డ్యాన్స్, ఆర్‌టిసి కాలనీ వారి వేమన రూపకం, సుందరయ్య నగర్ కళాకారుల ఆధ్వర్యాన 'జనం కోసం', దామరమడుగు కళాకారుల రైతు నాటిక, చిన్న పిల్లల నృత్యాలు నిర్వహించనున్నారు. రెండో రోజున 28వ తేదీ మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఆలాపన, 15వ డివిజన్ కళాకారుల డప్పుల విన్యాసం, ఒంగోలు కళాకారుల కోలాటం, నెల్లూరు సిటీ కళాకారుల జడ కోలాటం, శాస్త్రీయ నృత్యాలు, కళాంజలి ఆర్కెస్ట్రా, నెల్లూరు సిటీ కళాకారుల జానపద నృత్యాలు, యల్లాయపాలెం కళాకారుల గిరిజన నృత్యం, బుజబుజ నెల్లూరు వారి ఆయా రే మే డే డ్యాన్స్, శ్రీధర్ మాట్లాడే బొమ్మ, బుజబుజ నెల్లూరు వారి పాడుదమా స్వేచ్ఛాగీతం, ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన తియ్యటి ముప్పు, రాష్ట్ర కేంద్రం నుంచి 'ఏ కులం నీదని' నాటిక ప్రదర్శించనున్నారు. మూడో రోజైన 29వ తేదీ తెలంగాణ ఎంఎల్‌సి, ప్రజావాగ్గేయకారులు గోరేటి వెంకన్న, నెల్లూరు సీనియర్ రంగస్థల నటి రేబాల శ్రీలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. రాష్ట్ర కళాకారుల ఆలాపన, డప్పుల విన్యాసం, జోసఫ్‌పేట వారి కోలాటం, ఆత్మకూరు కళాకారుల ఏకలవ్య నృత్య రూపకం, శాస్త్రీయ నృత్యాలు, సుందరయ్య కాలనీ కళాకారుల సెల్యూట్ సుందరయ్య, చిట్టిబాబు డ్యాన్స్ ఈ వెంట్స్, వీర తెలగాణ నాటిక, పద్య నాటకం ప్రదర్శంచనున్నారు. వీటిని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

# కాకలుతీరిన యోధుడు నండూరి

జననం : 24.09.1912 మరణం : 29.11.2001

రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ తొలి తరం కమ్యూనిస్టు నేత. భారత కమ్యూనిస్టు ఉద్యమం నిర్మాతల్లో ఒకరు కామ్రేడ్ నండూరి ప్రసాదరావు. ఏడు దశాబ్దాలకుపైగా కమ్యూనిస్టు ఉద్యమానికీ, రైతాంగ, కార్మిక ఉద్యమాలకూ ఎనలేని సేవలందించిన నండూరి కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా ఆరుగొలనులో 1912 సెప్టెంబర్ 24న జన్మించారు. వారిది సనాతన బ్రాహ్మణ భూస్వామ్య కుటుంబం. వారి కుటుంబానికి 60 ఎకరాల మాగాణి, 90 ఎకరాల మెట్ట పొలం ఉండేది. నండూరి ప్రాథమిక విద్య ఆరుగొలనులో, ఎస్ఎస్ఎల్‌సి గుడివాడలో, ఇంటర్ బందరులో సాగింది. డిగ్రీ బెనారస్‌లో చదివారు. కాంగ్రెస్‌లో పేరుమోసిన నాయకుడు అయ్యదేవర కాళేశ్వరరావు నండూరి పినతండ్రి బావమరిది. అయ్యదేవర 1923వ సంవత్సరంలో మహాత్మా గాంధీని ఆరుగొలను తీసుకువచ్చారు. అప్పటికి నండూరికి పదకొండేళ్లుంటాయి. ఆనాటి నుంచి నండూరిపై జాతీయోద్యమం ప్రభావం ఉంది. బందరులో ఇంటర్ చదివే రోజుల్లో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్నారు. బిఏ చదవడానికి బెనారస్ వెళ్లినప్పుడు అక్కడ చంద్ర రాజేశ్వరరావు, ఆయన అన్న రామలింగయ్య, వి.వి.గిరి (తర్వాత కాలంలో భారత రాష్ట్రపతి) తమ్ముడు రామ్మోహనరావు, పేర్రాజు, వెంకటరత్నం తదితరులతో పరిచయమైంది. వి.డి.చితాలే అనే మరాఠీ కమ్యూనిస్టు నాయకుని ప్రభావం నండూరిపై పడింది. . నండూరికి ఆ యూనివర్సిటీలో బోధించే చదువుపై విరక్తి కలిగింది. చదువు మధ్యలోనే మానేసి స్వగ్రామం తిరిగొచ్చారు. కొన్ని నెలల తరువాత గుంటూరు బ్రాడీపేటలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని 'ఫ్రెండ్స్ హోం' పేరుతో హోటల్ పెట్టారు. ఆ హోటల్ గుంటూరులో కమ్యూనిస్టులందరికీ కేంద్రంగా ఉండేది. అప్పట్లో ఎస్.వి.ఘాటే ఈ హోటల్‌కు రహస్యంగా వచ్చి వారిని కలిసి వెళ్తుండేవారు. రోజూ సాయంత్రం జ్యూట్ ఫ్యాక్టరీకి వెళ్లి అక్కడ అధ్యయన తరగతులు నడిపేవాళ్లు.ఓ రోజు సుందరయ్య ఆరుగొలను వచ్చి నండూరిని కలిసి తూర్పు గోదావరి జిల్లాలో పార్టీని ఆర్గనైజ్ చేయడానికి అక్కడకు వెళ్లాలని కోరారు. నండూరి రాజమండ్రిలో ఓ సత్రంలో ఉంటూ హోటల్‌లో భోజనం చేస్తూ పార్టీ నిర్మా ణం జరుపుతుండేవారు. హోల్‌టైమర్ వేతనం కింద సుందరయ్య నెలనెలా 14 రూపాయలు నండూరికి పంపించేవారు. కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి నాయకత్వంలో రైతు రక్షణయాత్ర జరిగింది. ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకూ 1300 మైళ్ల దూరం కొనసాగిన ఈ యాత్రకు తూర్పు గోదావరి జిల్లాలో రూట్ నిర్ణయించడమేగాక యాత్ర జిల్లా దాటే వరకూ నండూరి ఎంతగానో కృషి చేశారు. 1944లో రాయలసీమ, ఉత్తరాంధ్రలో పెద్ద కరువులు వచ్చాయి. రైతు సంఘం తరపున ఆయన ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు చేపట్టారు. 1946లో ప్రకాశం ప్రభుత్వం ఆంధ్ర కమ్యూనిస్టులపై తీవ్ర నిర్బంధం అమలు జరిపింది. నండూరినీ ఇతర నాయకులనేకమందిని జైల్లో పెట్టారు. ఆ సందర్భంగా ఆయన 10 నెలలపాటు జైలులో ఉన్నారు. స్వాతంత్ర్య దినానికి ఒక రోజు ముందు ఆయన విడుదలయ్యారు. 1947 డిసెంబర్‌లో మరలా నండూరిని అరెస్టు చేసి కైకలూరు జైలులో పెట్టారు. తెలంగాణా సాయుధ పోరాట కాలంలో ఆయన ప్రధానంగా అడవుల్లో రహస్య స్థావరాల్లో ఉంటూ దళాల సభ్యులకు తరగతులు నిర్వహించేవారు. 1952లో అజ్ఞాతవాసం నుంచి బయటకు వచ్చారు. 1953లో ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా, పార్టీ చీలిన తర్వాత మార్కిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా ఉన్నారు. అఖిల భారత కిసాన్‌సభ నాయకునిగాను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగాను పనిచేశారు. తన యావదాస్తినీ పార్టీకి అప్పగించి జీవితాంతం పీడిత ప్రజా ఉద్యమానికి అంకితమై పనిచేశారు.

నండూరి బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను ఔపోసన పట్టారు. రామాయణ, మహా భారత, భాగవతాది పురాణాలు మొదలు కారల్ మార్క్స్ క్యాపిటల్ వరకూ ఆయనకు కరతలామలకాలు. ఆయన ఎంతో వైవిధ్యం కలిగిన రచయిత. సాహిత్యం, కళలు, తత్వశాస్త్రం, చరిత్ర, రాజకీయ, ఆర్థిక విషయాలు, సిద్ధాంతాలు ఇలా అనేక విషయాలపై ఆయన వందల సంఖ్యలో వ్యాసాలు రాశారు. చివరికి భారత క్రికెట్ జట్టు ఆటతీరుపై కూడా ఆయన వ్యాసాలు రాశారు. పదుల సంఖ్యలో పుస్తకాలు ప్రచురించారు. శాసనమండలి సభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. రైతు ఉద్యమంలో విశేష అనుభవం కల్గిన నండూరి ద్వితీయ, తృతీయ పంచవర్ష ప్రణాళికల్లో భూ సంస్కరణల ఉపసంఘంలో సభ్యునిగా పనిచేసి విశేషమైన ప్రతిభ కనపరిచారు. కార్యకర్తలపట్ల ఎనలేని ఆప్యాయతానురాగాలను ప్రదర్శించేవారు. కార్యకర్తల కుటుంబాలలో ఒక సభ్యునిగా ఆయన కలగలిసిపోయేవారు. ఆ కుటుంబాలకు ఆయన ఒక పెద్దగా వ్యవహరించేవారు. తొమ్మిది పదుల నిండు జీవితాన్ని గడిపిన కామ్రేడ్ నండూరి 2001 నవంబర్ 29న కన్నుమూశారు.

# రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న కేంద్రం

**'రాజ్యాంగ పరిరక్షణ' సదస్సులో సుంకర రాజేంద్రప్రసాద్**

సదస్సులో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్

**ప్రజాశక్తి- నెల్లూరు**

రాజ్యాంగ వ్యవస్థలకు కేంద్ర ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో నెల్లూరు నగరంలో జరగనున్న సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ నేపథ్యంలో 'రాజ్యాంగ పరిరక్షణ' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ సదస్సుకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహనరావు అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా హాజరైన సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ రాజ్యాంగానికి మూలస్తంభాలైన లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఫెడరలిజం తదితర అంశాలకు తిలోదకాలి స్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'తాను రచించిన రాజ్యాంగం మంచి వారి చేతుల్లో పడితే ప్రజలకు మంచి జరుగుతుంది, చెడ్డ వారి చేతుల్లో పడితే చెడ్డదైపోతుంది' అని రాజ్యాంగ నిర్మాత డాక్టరు బిఆర్.అంబేద్కర్ అప్పట్లో చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ ఉటంకించారు. రాజ్యాంగం నేడు ఎటువంటి వారి చేతుల్లో ఉందో ప్రజలకు అర్థమవుతోందన్నారు. దేశ స్వాతంత్రం కోసం జరిగిన పోరాటాలతో ఎటువంటి సంబంధమూలేని, బ్రిటీషు వారి పరిపాలనకు రక్షణగా ఉంటామని ఉత్తరాలు రాసిన వారి వారసులు నేడు దేశాన్ని పాలిస్తున్నారని వివరించారు. రాజ్యాంగ విలువల గురించి కార్మికులు, కర్షకులు, మహిళలు, విద్యార్థులకు తెలియజేసి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మేలుకో ఆంధ్రప్రదేశ్ కో-కన్వీనర్ డి.రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ కార్మికుల మధ్య విభజన తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. దీనిని గుర్తించి కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగ విధ్వంసానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏ విధంగా పాల్పడుతుందో వివరించారు. మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, యునైటెడ్ ముస్లిం మైనార్టీస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ, జమయిత్ ఉలయా వైస్ ప్రెసిడెంట్ మౌలానా ఇలియాజ్ తదితరులు ప్రసంగించారు.

## ఎప్పటికీ రుణపడి ఉంటాను..

- పద్మ భూషణ్ పురస్కారంపై బాలకృష్ణ

**హైదరాబాద్ :** తనకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి ప్రముఖ హీరో నందమూరి బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. "నాకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించిన భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన అందరికీ నా ధన్యవాదాలు. నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో పాలుపంచుకున్న తోటి నటీనటులకు, సాంకేతిక నిపుణులకు, నిర్మాతలకు, పంపిణీదారులకు, ఎగ్జిబిటర్లకు, కుటుంబ సభ్యులకు, యావత్ చలనచిత్ర రంగానికీ నా ధన్యవాదాలు. నా వెన్నంటే ఉండి నన్ను ప్రోత్సహిస్తున్న నా అభిమానులకు, నాపై విశేష ఆదరాభిమానాలు కురిపిస్తున్న ప్రేక్షకులకు సదా రుణపడి ఉంటాను" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పద్మ అవార్డు గ్రహీతలందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు.

**పలువురి శుభాకాంక్షలు**

బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించడంపై సినీ, రాజకీయ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన నా ప్రియమైన మిత్రుడు నందమూరి బాలకృష్ణకు శుభాకాంక్షలు అంటూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. 'బాలా బాబాయ్‌కి హృదయపూర్వక అభినందనలు. సినిమా రంగానికి మీరు చేసిన అసమాన సేవలకు, నిర్విరామ ప్రజాసేవకు ఇది గుర్తింపు' అంటూ ఎన్‌టిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎపి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, దర్శకుడు రాజమౌళి, నటులు మహేశ్‌బాబు, మంచు మోహన్‌బాబు, మంచు విష్ణు, విజయ్ దేవరకొండతోపాటు పలువురు ప్రముఖులు బాలకృష్ణను అభినందించారు. ఆయనతో పాటు పద్మ అవార్డులకు ఎంపికైన వారికీ శుభాకాంక్షలు తెలిపారు.

## 'సలామ్ సైనికా' ట్రైలర్ విడుదల

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

చిగురుపాటి క్రియేషన్స్ బ్యానర్‌పై చిగురుపాటి సుబ్రమణ్యం దర్శకత్వంలో నిర్మించిన 'సలామ్ సైనికా' చిత్రం ట్రైలర్‌ను శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు అసెంబ్లీ భవనంలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శత్రువులతో పోరాడి మరణించే సైనికుల విషయంలో ప్రతి భారతీయులు బాధ్యతతో ఉండాలనే ఇతివృత్తంతో కూడిన చిత్రం సలామ్ సైనికా అని అన్నారు. ఈ చిత్రంలో కథానాయకులుగా దేవ్, సాయి, సురేష్ నటించగా, కథానాయికలుగా శ్రీభవ్య, సోనిరెడ్డి నటించారని తెలిపారు. దర్శకుడు చిగురుపాటి సుబ్రమణ్యం మాట్లాడుతూ.. సైనికులు దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను ఫణంగా పెడుతున్నారని, వారికి సాయపడాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రాన్ని రూపొందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకరు కె రఘురామ కృష్ణరాజు, 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకరన్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# కడప-బెంగళూరు రైల్వేలైన్ పట్టాలెక్కేనా!

- ముద్దనూరు-ముదిగుబ్బ లింకు పేరుతో కాలయాపన
- 15 ఏళ్లుగా పెండింగులోనే రైల్వేలైన్ అలైన్‌మెంట్
- విశాఖ రైల్వేజోన్‌తో రాష్ట్రంలోని రైల్వేలైన్లు పూర్తవుతాయని సిఎం ప్రకటన

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులకు కదలిక ఎప్పుడో తెలియడం లేదు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా దశాబ్దానికిపైగా రైల్వేలైన్ అలైన్‌మెంట్ పనులు ప్రకటనలకే పరిమితమయ్యాయి. 2006లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో రూ.2,705 కోట్లతో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాయి. ముఖ్యమంత్రి వైఎస్ఆర్ మరణానంతరం రైల్వేలైన్ మూలనపడింది. మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయలేదనే పేరుతో కేంద్రంలోని బిజెపి సర్కారు నాటకమాడుతోంది. విశాఖకు రైల్వేజోన్ రావడం ద్వారా రూ.70 వేల కోట్లతో రాష్ట్రంలోని రైల్వేలైన్లింటినీ పూర్తి చేస్తామని కడప జిల్లా మైదుకూరు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఫిబ్రవరి ఒకటి నుంచి పార్లమెంట్ సెషన్‌లో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యం కడప-బెంగళూరు రైల్వేలైన్ చర్చనీయాంశమైంది. కడప నుంచి పెండ్లిమర్రి, నందిమండలం మీదుగా అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, చిన్నమండెం, మదనపల్లి, చిత్తూరు జిల్లాలోని వాయల్పాడు, కర్ణాటకలోని మాడగట్ట నుంచి కోలార్ వరకు రైల్వేలైన్ అలైన్‌మెంట్‌కు రూపకల్పన జరిగింది. రెండు రైల్వే జోన్ల పరిధిలో 257 కిలోమీటర్ల మేర నాలుగు దశల్లో రైల్వేలైన్ పనులు చేపట్టాల్సి ఉంది. 205 కిలోమీటర్లు మనరాష్ట్రం పరిధిలో ఉండగా, మిగతాది కర్ణాటక పరిధిలో ఉంది. మెదటి దశలో రూ.358 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్‌తో కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21 కిలోమీటర్ల వరకు 10 శాతం రైల్వేలైన్ పనులు పూర్తి అయ్యాయి. 2013 భూసేకరణ చట్టం కింద సౌత్ సెంట్రల్, సౌత్ వెస్ట్రరన్ జోన్లు మిగిలిన భూసేకరణ, సర్వే పనులు పూర్తి చేయాల్సి ఉంది. సౌత్ వెస్ట్రరన్ జోన్ కర్ణాటక పరిధిలో ఉండడంతో ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. కేంద్ర బడ్జెట్‌లో 2017-18లో రూ.175 కోట్లు, 2022-23లో రూ.289 కోట్ల అత్తెసరు కేటాయింపుల నేపథ్యంలో పనులు ముందుకు సాగలేదు. 2023-24 కేంద్ర బడ్జెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించకపోవడంతో నిధుల విడుదల ఆగిపోయింది. 2023-2024లో అప్పటి వైసిపి సర్కారు నిధుల లేమి కారణంతో కడప జిల్లాలోని ముద్దనూరు, అనంతపురం జిల్లాలోని ముదిగుబ్బ రైల్వేలైన్ కూడలి వరకు సుమారు 82 కిలోమీటర్ల మేర పనులు చేపడితే తక్కువ ఖర్చుతో బెంగళూరు లైన్ సదుపాయం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటును విడుదల చేయలేదనే పేరుతో కేంద్రంలోని బిజెపి సర్కారు కడప-బెంగుళూరు రైల్వేలైన్ పనులను అటకెక్కించింది. ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పిచ్చి చెట్ల మధ్య కడప-బెంగుళూరు రైల్వేలైన్

# పర్యాటకాభివృద్ధి దిశగా అడుగులు

- నేడు విశాఖలో రీజినల్ ఇన్వెస్ట్ మీట్
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి**

రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ఈ నెల 27న విశాఖలో రీజినల్ ఇన్వెస్ట్ మీట్‌ను నిర్వహిస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆయన ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేవారిని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అఖండ గోదావరి, గండికోటను రూ.170 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. అన్నవరంలోని సత్యదేవుని ఆలయం అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా అహోబిలం, నాగార్జున సాగర్‌లను ఒక్కొక్క ప్రాజెక్టుకు రూ.25 కోట్లతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలో రూ.100 కోట్లతో సూర్యలంకను పర్యాకంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పరిశ్రమల స్థాపన మాదిరిగానే పర్యాటక రంగంలోనూ పెట్టుబడులు పెట్టేవారికి రాయితీలు అందిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో మారేడుమిల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటూ, పాపికొండలు విహారయాత్రకు భద్రతా ప్రమాణాలను మరింత మెరుగు పరుస్తామని తెలిపారు. అమరావతి రివర్ ఫ్రంట్ మొత్తాన్ని పర్యాటక ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు సిఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి తాజ్, ఒబెరాయ్, ఐఆర్‌టిసి వంటి సంస్థలు ముందుకొస్తున్నాయని తెలిపారు. 2025-29లో పర్యాటక రంగంలో కొత్త పాలసీని తెస్తున్నామని చెప్పారు. సోమవారం జరిగే రీజినల్ ఇన్వెస్ట్‌మీట్‌కు సుమారు 150 మంది హాజరకానున్నారని, 15 మందితో ఎంఒయు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు.

# కస్టోడియల్ టార్చర్‌లో నిందితుడిని గుర్తించిన రఘురామకృష్ణరాజు

- గుంటూరు జైల్లో పెరేడ్ నిర్వహించిన అధికారులు

**ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి**

గత ప్రభుత్వ హయాంలో సిఐడి అధికారుల కస్టడీలో తనను హింసించిన నిందితుల గుర్తించేందుకు ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ ఎ రఘు రామకృష్ణం రాజు ఆదివారం గుంటూరు జైలుకు వచ్చారు. నిందితులతో జైలు అధికారులు పెరేడ్ ఏర్పాటు చేశారు. జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గుడివాడ ఎమ్మెల్యే పెనుగండ్ల రాము అనుచరుడు కామేపల్లి తులసి బాబును రఘురాం కృష్ణంరాజు గుర్తుపట్టారు. తన గుండెలపై తులసి బాబు కూర్చొని తీవ్రంగా హింసించాడని ఆయన స్పష్టం చేశారు. నిందితున్ని గుర్తుపట్టిన అనంతరం రఘురాం కృష్ణంరాజు మీడియాతో మాట్లాడుతూ గతంలో నాకు న్యాయం జరగదు అనే భావం ఉండేది, కానీ ఇప్పుడు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. ఐపిఎస్ అధికారి పివి సునీల్ కుమార్ వెనుక ఉన్న ఆర్మీని చూసి భయపడుతున్నారా? ఎందుకు ఆయన్ని దర్యాప్తునకు పిలవడం లేదు అని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు ప్రధాన నిందితులకు నోటీసులు ఇవ్వలేదని, సస్పెన్షన్ చేయలేదని అన్నారు. సర్వీసు రూల్స్ ప్రకారం, అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదయితే వాళ్లనీ సస్పెన్షన్ చేయాలి కానీ సునీల్ కుమార్ ను ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. సిఐడి మాజీ అదనపు ఎస్‌పి విజయ పాల్‌కు గతం గుర్తుకు రావడంలేదని, వయసు అయిపోయిందని చెప్తున్నారని ఎద్దేవా చేశారు.

ఫిషింగ్ హార్బర్‌కు ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన శిలాఫలకం (ఫైల్)

# పూడిమడక హార్బర్‌కు మళ్లీ డిపిఆర్!

- గతేడాది ప్రధాని మోడీ శంకుస్థాపన
- నేటికీ ప్రారంభం కాని పనులు
- మత్స్యకారుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యం

**ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి**

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయి. అదే సమయంలో ప్రజలు వ్యతిరేకిస్తున్న బల్క్ డ్రగ్ పార్కు వంటి వాటికి రెండు ప్రభుత్వాలూ కలిసి కావాల్సిన వారికి భూములు కట్టబెట్టడానికి తహతహలాడుతున్నాయి. సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు దోహదపడే ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. గతేడాది ఆగస్టు 30న రూ.392 కోట్ల విలువైన ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత నిర్మాణ పనులు చేపట్టకపోగా, తక్కువ ఖర్చుతో ఫిషింగ్ హార్బర్ పనులు జరిగేలా సవివర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) తయారు చేయాలని కేంద్ర ప్రభుత్వం మెలికపెట్టింది. దీనికి అనుగుణంగా నూతనంగా డిపిఆర్ తయారు చేసి పంపించినా ఇంతవరకు ఆమోదించలేదు. హార్బర్ నిర్మాణ ప్రదేశానికి వాహన రాకపోకలకు రహదారిలేదని కొంతకాలం జాప్యం చేసింది. రోడ్డుకు అడ్డంకులు తొలగిన తర్వాత పనులు ప్రారంభమవుతాయనుకుంటే తక్కువ ఖర్చుతో హార్బర్ పనులు జరిగేలా డిపిఆర్ తయారు చేయాలని కేంద్రం అడ్డుపుల్ల వేసింది. కొత్త డిపిఆర్‌కు ఆమోదం రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. కొత్త డిపిఆర్‌లో నిర్మాణ వ్యయ అంచనాల్లో మార్పులు చేర్పులు జరిగితే పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేసి తాజాగా టెండర్లు పిలవాల్సి ఉండడంతో పనుల్లో మరింత జాప్యం చోటుచేసుకోనుంది. గతంలో డబ్ల్యుఎపిసిఒఎస్ తయారు చేసిన డిపిఆర్‌పై తర్జనభర్జనలు జరుగుతుండగానే హార్బర్ పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. కొత్త డిపిఆర్ తయారీ బాధ్యతను బెంగళూరుకు చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజనీరింగ్ ఫర్ ఫిషరీ (సిఐసిఇఎఫ్)కి అప్పగించారు. కొత్త డిపిఆర్‌ను ప్రభుత్వానికి సిఐసిఇఎఫ్ నివేదించి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆమోదం తెలపలేదు. పూడిమడక వద్ద 30 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదిత ఫిషింగ్ హార్బర్ పూర్తయితే జిల్లాలోని పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లోని 73 కిలోమీటర్ల తీర ప్రాంతంలోని 86,497 మంది మత్స్యకారులకు లబ్ధి కలుగుతుందని మత్స్యశాఖాధికారులు చెబుతున్నారు. 700 నుంచి వెయ్యి మెకనైజ్డ్ బోట్లు హార్బర్‌లో పెట్టుకొనే అవకాశం కలగనుంది. సముద్ర కెరటాల ఆటుపోట్లకు బోట్లు దెబ్బతినకుండా సురక్షితంగా హార్బర్‌లో నిలుపుకోవచ్చు. హార్బర్‌తో పాటు చేపలు నిల్వ చేసుకొనేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు, మార్కెట్, ఇతర సదుపాయాలతో కూడిన గదుల నిర్మాణ మత్స్యకారులకు ఎంతో దోహదపడనుంది. శంకుస్థాపన చేసిన ఏడాదిన్నరలోపు హార్బర్ పనులు పూర్తి చేయాలని అనుకున్నా కొత్తగా డిపిఆర్ తయారు చేయాలని కేంద్రం ఆదేశించడంతో మళ్లీ మొదటికి వచ్చింది. హార్బర్ పనులపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త డిపిఆర్‌ను వెంటనే ఆమోదించి పనులు ప్రారంభించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

## బ్లర్బ్

యుద్ధ శిథిలాల కడుపు కోత
విషాద గీతాల కన్నీళ్ళ, నిప్పు కణిక కళ్ళల్లోంచి
ఎగిసి పడుతున్న మంటలకు
దావోస్ సభలు చలికాచుకుంటున్నాయి!

కంపెనీలు ప్రాజెక్టులు
అరచేతిలో వైకుంఠాలు
అభివృద్ధి ఉపాధి కల్పనలు
షరతులు అంగీకారాలు
సిఈఒలు, రాజకీయ ప్రతినిధులు
చేతులు మార్చుకుంటున్న
కాగితం మీద కందిపప్పు
ఒప్పందాల అవగాహన పత్రాలు!

రుణమను నువ్వు ఆర్థిక సహాయమను
పేరు ఏదైనా ఒక్కటే!
పూల బొకే లాటి
చక్కెర పూత సంభాషణలు!
రెప్పలు తెరచి ఉండగానే
సుతారంగా కనుగుడ్లను
ఒడుపుగా మాయం చేసే కాలం!

ఉద్రిక్తలు వారే పెంచుతారు
యుద్ధాలు వారే చేయిస్తారు
సహాయ శిబిరాలను నిర్మించి
హెలికాప్టర్ మీంచి గొప్ప ఉదారతతో
నిత్యావసరాలను వారే విసిరేస్తారు
నొప్పి తెలియకుండా
ఎన్ని రకాల సుద్దులు బుద్ధులు చెప్పినా
అమాయక శిశువులు స్త్రీలు వృద్ధులు
డాలర్ దాహానికి ఆహుతి అవుతుంటారు

శ్రమ వస్తువు వినియోగదారుడు
ప్రతిదీ షోకేస్‌లో అందంగా ప్రదర్శించి
మార్కెట్ చేయబడుతుంది
రాజ్యాలకు రాజ్యాలను నడిపిస్తున్న
కుంపెనీల లక్ష్యం ప్రజా సంక్షేమమైతే
దేశదేశాలు లేబర్ అడ్డా మీద
పని కోసం వలస కూలీలుగా
ఎందుకు నిలబడుతున్నారు?

– జూకంటి జగన్నాథం
94410 78095

## వివక్షపై పోరాడు ...

విశ్వమంతా
వివక్షా భావాలు విస్తరిస్తూ
విజ్ఞానాన్ని ధిక్కరిస్తూ, విజ్ఞతను సవాలు చేస్తూ
సవాలక్ష రూపాల్లో సవారీ చేస్తూ
అంతర్జాల యుగంలో
అంతరిక్షాన్ని గెలిచినా
అంతర్ధానమవ్వని భేషజాలు
అంతులేని అజ్ఞానపు ఆనవాళ్లు

వర్ణమో, వర్గమో, రూపమో, కులమో,
మతమో, ప్రాంతమో, మహిళ అయిన కారణమో
వివక్షకు హేతువయ్యే దౌర్భాగ్యం
మానవాళిని వదిలిపోని దౌర్బల్యం
సాటి మనిషి ఆత్మ గౌరవం
సయించలేని హీన గర్వం
అర్హులను అణగదొక్కే గర్హనీయ కుటిల పర్వం
పక్షపాత ధోరణితో
సగం చచ్చుబడెను సమాజ దేహం!

సహోదరా, మేలుకో!
పురోగామి భావాలను అడుగడుగునా జల్లిపో
మానవతా పరిమళాన్ని ప్రపంచమంతా పంచిపో!

ఉగ్గుపాలతో నేర్చిన వివక్ష
ఒక్క ఉదుటున మాయం కాదు
తరతరాల ఆధిపత్యపు మరక
ఒక్క ఉతుకుతో దూరం కాదు
అయినా నిరాశ పడక
నీ ప్రయత్నం విరమించక
నిరంతరం సాగాలి ఔన్నత్యం పొందాలి!

– డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.
94408 36931

## నిద్రపోతున్న రాజ్యం

ఊచలు లేని జెయిలై పోయింది ఇల్లు
కిటికీ రెప్ప వేయటానికి భయపడుతుంది
చెట్లు ఫోటోకి పోజులు ఇస్తున్నాయి.
చచ్చిన పాములా పడిఉన్న రోడ్డు
లక్షలాది పదఘట్టనలకి ఉలికి పడుతోంది
ఎర్ర గోరింటను ఒళ్లంతా పులుముకుని
పగిలిన బొబ్బల తడి అర్చుకుంటుంది
గుండెలకి ప్రాణ బలం ఊదుతున్న ఊపిరి కూడా
బైటకి రావటానికి భయపడుతున్న రోజుల్లో
ఓహ్! ఎన్నెన్ని జతల కాళ్ళు 'దూలా' ఆడుతున్నాయో
లెక్క పెట్టను ఆకాశం రాత్రిళ్ళు చుక్కల కళ్ళతో
భూమ్మీదికి దిగి వస్తుంది చంద్ర దీపం పట్టుకొని.

'వసుధైక కుటుంబకమ్' అన్న దేశంలో
రోడ్ల నిండా మరీచికలు దాహం తీర్చలేని నీళ్ళతో
ఎడాపెడా కురిసే వాగ్దానాల వర్షంలో
ఇసుమంతైనా తడవని దేహంతో
నడుస్తూ నడుస్తూనే
కూలిపోతున్న వలస కార్మికుల శవాలు
అనాథ ప్రేతాలుగా పడి ఉన్న రోడ్ల పక్కన
జీవం పోయలేని చేతులు గుంటలు తవ్వుతున్నాయి
ఏలికలెవ్వరూ ఒక్క నిస్పృహ అయినా వదల్లేదు
గుడ్డి రాజ్యం గూట్లో నిద్ర పోయింది
స్వాతంత్ర్యం నన్ను చూసి నవ్వి పోయింది!

– ఈతకోట సుబ్బారావు

## మనిషి వెలుతురు

తొలిసారిగా ఖాళీ చేతులు
డబ్బుతో మాట్లాడినప్పుడు
రూపాయి బలం తెలిసింది.
పని పరిచయమయ్యాక
చెమట చుక్కలకు రెట్టింపు లెక్కతో
జేబు నిండినప్పుడు
ఏడిపించిన కోరిక
కాళ్ళ మీద పడి సలాం చేసింది
ఊరి వీధులన్నీ
గౌరవిస్తూ వెంట నడిచాయి
ఇంటికెళ్లాక మంచం మంచి నిద్రని వడ్డిస్తే
కష్టం ఒడిలో ఆదమరచిన
ఈ మనిషి వెలుతురులో
ఇల్లు కళకళలాడింది!

– చందలూరి నారాయణరావు
97044 37247

# అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
4 | విజయవాడ
సోమవారం 27 జనవరి 2025

"సాహిత్యం రాజకీయాలకు అతీతంగా ఉండాలని ఎవరైనా అంటే- వాళ్లు కచ్చితంగా మోసపుచ్చేవాళ్లో, మోసపోయినవాళ్లో అయి ఉండాలి."
- కొడవటిగంటి కుటుంబరావు

# పోరాటమ్మల త్యాగాల కథ

రాజ్యం వుందీ అంటే దాని చేతిలో అధికార దండం ఉంటుంది. అధికారం వున్నచోట ప్రజల మీద అణిచివేత తప్పకుండా వుంటుంది. ప్రజలా అణిచివేతను అధికారానికి భయపడో, కర్మ సిద్ధాంతానికి కట్టుబడో భరిస్తూ వస్తుంటారు. ఏదొక సమయాన ప్రజలు ఆ అణిచివేతను ఏమాత్రం భరించలేని స్థితికి వస్తారు. వారి నుంచే కొందరు వ్యక్తులు నాయకులుగా పుట్టుకొచ్చి బాధితులను సమీకరించి, అధికారంతో ఢీ కొడతారు. తిరుగుబాటు బావుటాలను ఎగరేయిస్తారు. విస్తృతమైన అధికార బాహువులు కలిగిన రాజ్య వ్యవస్థను సాధారణ ప్రజలు ఢీకొట్టే క్రమంలో తాత్కాలికమైన ఊరట లేదా విజయం లభించినప్పటికీ – ఒక్కోసారి ఆ విజయాలు సంపూర్ణం కావు. అందుకే చరిత్రలో బలహీనులకు విజయాలకంటే అపజయాలు ఎక్కువగా ఎదురయ్యాయి.

తెలుగునాట జరిగిన తెలంగాణా సాయుధ పోరాటం, శ్రీకాకుళ రైతాంగ పోరాటాలతో పాటు కొమరం భీమ్, అల్లూరి వంటి వారు సాగించిన పోరాటాలు ఉత్తుంగ తరంగాల మాదిరిగా లేచి, కారణాలు ఏవైనప్పటికీ అసంపూరణంగా సమసిపోయాయి. శ్రీకాకుళ రైతాంగ పోరాటంతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం వున్న రచయిత అట్టాడ అప్పల్నాయుడు ఆ అనుభవాల నేపథ్యంలో ఇటీవల తన ఆరవ నవలగా 'నక్షత్ర బాట'ను వెలువరించారు.

ఆ పోరాటంలో మగవారితో సమానంగా అంచలంచలుగా వుండే అధికారపు ఆఖరి తంతేలోని మునసబు, కరణాలతోపాటు భూస్వాములను, వారి స్వార్థపూరిత వికృత చర్యలను వీరోచితంగా ఎదుర్కొన్న మహిళా మణిదీపాలను ప్రధాన పాత్రలుగా చేసుకొని, వారి అసమాన ధైర్య సాహసాలను, బలిదానాలను కరుణ రసార్ద్రపూరితంగా ఆసాంతం పాఠకుల చేత చదివించేలా రచయిత నవలను తీర్చిదిద్దారు.

నవలలో ప్రధాన పాత్రధారి భూదేవితో పాటు సీతమ్మ, సరస్వతి, అంకమ్మ, తవిటమ్మ, కళావతి, పైడమ్మ, సుజాత, సత్యవతి, దేవి మొదలైన స్త్రీలంతా భూస్వాముల అన్యాయాన్ని, పోలీసుల దాష్టీకాన్ని ఎదిరించారు. మనసున్న మనుషులుగా మసలుకుంటూ తోటివారికి సాయపడే క్రమంలో తమ ప్రాణాలనే ఫణంగా పెట్టిన వారూ వున్నారు. ఈ నవల కార్యస్థానం ఉద్దానంలోని పలు గ్రామాల చుట్టూ ఫ్లాష్‌బ్యాక్‌లో మొదలవుతుంది. పైల చిరంజీవులు అనే పార్టీ కార్యకర్త తమ గ్రామంలోని పేదల పక్షాన నికరంగా నిలబడి ఊరి కామందులకు వ్యతిరేకంగా అనేక విషయాల మీద జనాన్ని కూడగడుతూ ఉంటాడు. అతని చర్యల కారణంగానూ, పార్టీ నాయకులు వచ్చిపోతుండడంతోనూ, వారి స్ఫూర్తితో నిరుపేదలు సంఘటితమై కూలీ రేట్ల పెంపుదల కోసం, బంజరు భూముల ఆక్రమణ కోసం ఉద్యమిస్తుంటారు. అది కంటగింపైన భూస్వాములు చిరంజీవుల్ని హత్య చేయిస్తారు.

చిరంజీవి చిన్న కూతురు భూదేవి తండ్రి బాటలో ఉద్యమంలో చేరి అజ్ఞాతంలోకి వెలిపోతుంది. ఆమె జీవితం ఓ నదీ ప్రవాహంలా ఎన్నెన్ని మలుపులు తిరిగింది? చివరికి ఏ తీరం చేరింది? అన్నదే నవలాంశం. నవల ఆరంభంలోనే రచయిత పోలీస్ శాఖలోని సాధారణ పోలీసులు తమ ఉన్నతాధికారుల చేత హీనత్వాన్నీ, చులకనను భరిస్తూ అసహనంతో రగిలి పోతుంటారు. ఫలితంగా వారిలో పేరుకు పోయిన అసహనాన్ని పేద ప్రజల మీద వెళ్లదీస్తుంటారు. పేద ప్రజలను ఎంతగా హింసిస్తే అంతగా శాఖలో తమకు గౌరవం పెరుగుతుందన్న భ్రమలో మునిగిపోతుంటారు. అదే క్రమంలో బూటకపు ఎన్‌కౌంటర్లు ఏవిధంగా జరుగుతాయో కూడా తెలియజేస్తారు.

అంకమ్మకు అయిదో తరగతి అయిపోగానే తల్లిదండ్రులు పెళ్లి చేసి అత్తారింటికి పంపిస్తారు. అత్తారింటి ఆరళ్ళు తట్టుకోలేకపోయిన అంకమ్మ పుట్టింటికి వచ్చేస్తుంది. ఊరిపెద్దల వద్ద అత్తింటి వారు పంచాయితీ పెడతారు. అంకమ్మ అత్త వారింటికి వెళ్ళాలని, లేని పక్షంలో అవతలి వారికి తప్పు (జరిమానా) కట్టాలని పెద్దలు తీర్మానం చేస్తారు. అందుకు అంగీకరించలేని అంకమ్మ 'నాకా మగడూ వద్దు, అతను కట్టిన తాళీ వద్దు, ఊరి పెద్దల తీర్పూ వద్దు. ఈ క్షణమే అతనికీ, నాకు తెగతెంపులు కావాలి' అంటూ బలంగా తన అభిప్రాయాన్ని తెలియజేస్తుంది. 'నా తల్లిదండ్రులు పేదోళ్ళు. ఆళ్ళు జరిమానా కట్టలేరు. నాకీ పెనిమిటి ఒద్దే వొద్దం'టూ గబాల్న మెడలోని పసుపు దారపు పూస్తేల తాడును తీసి భర్త మీదికి విసిరేస్తుంది. ఒక నిరుపేద యువతి అంత విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవడం వెనుకనున్న ధైర్యం పార్టీనే! ఆ విషయాన్ని రచయిత పాఠకులకు అర్థమయ్యేలా చెప్పడంలో ఒక విధమైన సరళత్వం కన్పిస్తుంది.

ఒక సందర్భంలో మునసబు గోవర్ధనరావు ఇంట్లో గ్రామపెద్దల సమావేశం జరుగుతుంది. మున్సబ్ ఇరిడి కర్రతో చేసిన చేతుల కుర్చీలో కూర్చుంటాడు. అతనికి ఎదురుగా మామిడి కర్రతో చేసిన కుర్చీలు సర్పంచ్, కరణం కోసం. వాటి పక్కగా పనసకర్రతో చేసిన రెండు పొడవాటి బల్లలు రైతుల కోసం ఏర్పాటు చేయబడి వున్నాయి అంటూ వివరిస్తాడు రచయిత. అందరూ ఊరి పెద్దలే అయినా స్థాయినిబట్టి కూర్చునే స్థానాలు మారిపోయి, గ్రామంలో ఒకస్థాయి వ్యక్తుల పట్ల కూడా వివక్ష ఎంత నాజూగ్గా పాటించబడుతుందో రచయిత వివరించారు.

మరొక సందర్భంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన లెవీ ధాన్యాన్ని భూస్వాములు దాచిపెట్టగా, పేదలు ప్రభుత్వాధికారులకు పట్టిస్తారు. దీంతో క్రోధాన్ని పెంచుకున్న ఊరి భూస్వాములంతా ఏకమౌతారు. మునసబు పేదవారిని తమ బావి నీళ్ళకు రానివ్వడు. అప్పుడు వారంతా ఊరికి దూరంగా వున్న వాడలోని బావి నుంచి నీళ్ళు తెచ్చుకోవాల్సి వస్తుంది. మరో సందర్భంలో చందన నాయుడి మేకల్ని గొల్ల కురమయ్య కాస్తుంటాడు. ఓ రోజు తోడేలు మేకల మంద మీదపడి ఓ మేకను ఎత్తుకు పోతుంది. దాంతో నాయుడుకి, కురమయ్యకి పంచాయితీ అవుతుంది. పెద్దలు కురమయ్యను నాయుడికి నష్టపరిహారం కట్టమంటారు. మెకం ఎత్తుకు పోయిన మేకకు నేనెందుకు డబ్బులు కట్టాలన్న భావనతో ప్రోనోట్ మీద నిశానీ వేయకూడదన్న ఉద్దేశంతో కురమయ్య కత్తితో తన ఎడమచేతి బొటనవేలును చటుక్కున తెగేసుకుంటాడు. తెగిపడిన మొండివేలితోనైనా సరే నిశానీ వేయించడానికి ఆ భూస్వామి, అతని తాబేదార్లు చేసిన ప్రయత్నాన్ని చదివి, ఇంత అన్యాయమా? అన్న చింతన పాఠకుల్లో కొండలా పేరుకుపోతుంది. ఈ సంఘటన చదివిన పాఠకులకు యజ్ఞం కథలోని సీతారాముడు కళ్ల ముందు కదలాడతాడు. భూస్వామి చందన నాయుడితో కురమయ్య భార్య పైడమ్మ తలపడుతుంది. భూదేవి పార్టీలో చేరి, అజ్ఞాతంలోకి వెళ్లిపోతుంది. అక్కడ ఒక డాక్టర్ కామ్రేడ్‌ని పార్టీ అనుమతితో పెళ్ళాడు తుంది. ఆ తరువాత ఆవిడ జీవితం అనేక ఆటుపోట్లకు లోనవుతుంది. వాటన్నింటినీ అప్పల్నాయుడు సంఘటన వెనుక సంఘటనను వివరిస్తూ, నవలను పఠనీయంగా పరుగెత్తిస్తాడు.

నవలలో గర్భవతి 'దేవి' తనకు ఏమాత్రం పరిచయం లేని మరో గర్భిణి జీవితాన్ని కాపాడడం కోసం పోలీసుల చేత అన్యాయంగా స్టేషన్‌కి ఈడ్చుకు పోబడి, వాళ్లు పెట్టిన చిత్ర హింసలకు ప్రాణాలు కోల్పోతుంది. ఎంత హింసించినా పోలీసులకు కావాల్సిన వ్యక్తి ఆచూకీ గురించి వెల్లడించదు. దేవి తన అసమాన త్యాగంతో నక్షత్రబాటలో సాగిపోయి చుక్కల్లో ఓ చుక్క ఔతుంది.

నవల రాసే సందర్భంలో రచయిత తప్పకుండా అనేక ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. రచయిత తన పరిధుల మేరకు ప్రయత్నించినట్టుగా నవల చదివేటప్పుడు అన్పిస్తుంది. కల్పిత కథ అయితే, రచయిత స్వేచ్ఛా విహంగమై కలాన్ని నడిపిస్తాడు. వాస్తవ కథలో అలా సాధ్యం కాదు. తను అనుకున్నట్టుగా మహిళా కామ్రేడ్ల పాత్రలను ప్రధాన స్రవంతికి దూరం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ కథన ఔచిత్యానికి భంగం కలగకుండా రెండు వందల పేజీల నవలను రాయడం కత్తి మీద సాములాంటిదే! జీవనది లాంటి ఉత్తరాంధ్ర యాసను ఇప్పటివరకూ వచ్చిన తన ప్రతి రచనలోనూ ప్రతిబింబింపజేసిన అట్టాడ ఈ నవలలో యాసకు అంత ప్రాధాన్యత ఇచ్చినట్టుగా కనిపించదు.

ఉద్యమం ఒక పరిమిత ప్రాంతానికే పరిమితమైనదన్న పరిజ్ఞానం లేకుండానే భూదేవి అంత పోరాటం చేసిందా? అన్న సంశయానికి పాఠకుణ్ణి లోను చేస్తూ ఆవిడ ఒకానొక పరిస్థితిలో దేశాటన చేస్తున్న సందర్భంలోనే మొదటిసారిగా అటువంటి అవగానకొచ్చినట్టుగా రచయిత చెప్పడం ఉచితంగా లేదన్పిస్తుంది. రచయిత స్వీయ అనుభవాన్ని, ఆలోచనను ఆ పాత్రకు ఆపాదించి రాసినట్టుగా పాఠకులు భావించే అవకాశమూ వుంది. ఇలాంటి ఒకటి రెండు విషయాలను మినహాయిస్తే – శ్రీకాకుళ రైతాంగ పోరాటం నాటి సామాజిక, రాజకీయ పరిస్థితులను రచయిత తనకున్న పరిమితులను అతిక్రమించకుండా నేటితరం పాఠకులు తెలుసుకునేలా అక్షరబద్ధం చేశారు. రూ.220 వెల ఉన్న ఈ నవల కోసం 94400 31961 నెంబర్లో సంప్రదించొచ్చు.

– శిరంశెట్టి కాంతారావు
98498 90322

# ఆధునిక నాటక అవలోకనం

మానవ జీవితంలోని వివిధ ఘట్టాలను నవరసాల మేళవింపుతో నాటకాలుగా ప్రతిబింబింపజేస్తూ, మనిషి మనోవికాసానికి తోడ్పడుతుంది రంగస్థలం. సంగీత, సాహిత్య, అభినయ సమ్మిళితమైన నాటకంలోని అనేక కోణాల్ని స్పృశిస్తూ, మారుతున్న పరిస్థితులకనుగుణంగా దానిలో చోటు చేసుకుంటున్న పరిణామాలను వీక్షిస్తూ, అది ప్రతిబింబించే పలు సమకాలీన సామాజిక పార్శ్వాలను విశ్లేషిస్తూ, సగటు ప్రేక్షకుడిలో రంగస్థల వీక్షణం మీద అవగాహన కలిగించే దిశగా నటుడు, నాటక విశ్లేషకుడు ఆకుల మల్లేశ్వరరావు తాజాగా వెలువరించిన వ్యాససంపుటి 'రంగ విపంచిక'.

పలు ఆధునిక మాధ్యమాల కారణంగా పూర్వవైభవాన్ని కోల్పోయిన రంగస్థలానికి మళ్లీ శోభను మళ్లీ ఇనుమడింపజేయడానికి కృషి చేస్తున్న వారిలో మల్లేశ్వరరావు ఒకరు. అర్ధ శతాబ్దం ముందు ఆంధ్రదేశంలో ఎన్నో నాటక పరిషత్తులు విరివిగా పోటీలు నిర్వహించి నాటకరంగానికి ఎనలేని ప్రోత్సాహాన్నిచ్చాయి. ఇప్పుడు అన్ని నాటక పరిషత్తులు లేకపోయినా వున్న కొన్ని అడపాదడపా పోటీలు నిర్వహిస్తూ రంగస్థల ఉనికిని కాపాడగలుగుతున్నాయి. ఈ పోటీలకు ఈ రచయిత గుణనిర్ణేతగా వ్యవహరిస్తూ– ఆ పోటీలతో తాను మమేకం కావడమే కాకుండా ప్రేక్షకులనూ మమేకం చేయడానికి ప్రయత్నిస్తుంటారు. ఆ ప్రయత్నంలోంచి వెలువడిందే ఈ సంపుటి. గతంలో ఈయన మూడు దశాబ్దాల్లో తాను వీక్షించిన నాటకాల గురించి విశ్లేషిస్తూ 'రంగవీక్షణం' వ్యాససంపుటిని వెలువరించారు. ఈ సంపుటిలో గత మూడేళ్లలో పలు పోటీల్లో ప్రశంసలందుకున్న ఐదు రంగస్థల నాటకాలను ఎంచుకొని ఈ వ్యాసాలను వెలువరించారు. ఈ ఐదు నాటకాలూ సమాజంలో వేళ్లూనుకున్న వివిధ సమస్యలను ఎత్తిచూపుతూ, వేటికవి ప్రత్యేకత కలిగినవే! రచన, దర్శకత్వం, నటన, సాంకేతిక నేపథ్యం ముప్పేటలా కలిసిపోవడం; కథాకథనం కళాత్మకతతో కళకళలాడడం; ప్రదర్శన వర్తమాన సమాజంతో అనుసంధానత కలిగివుండడం ... ఈ మూడు అంశాల మీద దృష్టి కేంద్రీకరించి, విశ్లేషణ చేశారు. నటన, సంభాషణ, సన్నివేశ కల్పన, రంగస్థల వేదిక నేపథ్యం, నేపథ్య సంగీతం... పార్శ్వాలనూ ప్రస్తావించారు. ఇలా నాటకంలోని అనేక అంశాలను తెలియజేస్తూ వివరించటం సగటు వీక్షకుడికి ఆసక్తిని కలిగిస్తుంది.

ఈ పుస్తకంలో ప్రస్తావించిన మొదటి నాటకం పి.టి. మాధవ్ రచించిన '27వ మైలురాయి'. ఇది న్యాయవ్యవస్థలోని లొసుగుల్ని ఎత్తి చూపుతుంది. ఒక కేసును వాదించినప్పుడు న్యాయవాదిలో లోపించిన నిజాయితీ అతని కుటుంబాన్ని ఎన్ని ఇక్కట్లకు గురిచేస్తుందో, చివరికి ఆ న్యాయవాది ఎలా పరివర్తన చెందుతాడో ఈ నాటకం తెలియజేస్తుంది. నాటక లక్షణాలన్నింటినీ సమపాళ్లలో రంగరించుకున్న నాటకం అని విశ్లేషకుడు దీనికి కితాబు ఇచ్చారు.

రెండవ నాటకం పోటీలో ప్రథమస్థానం పొందిన 'స్వేచ్ఛ'. (నాటకీకరణ– పరమాత్ముని శివ, మూలకథ : పి.ఎస్.నారాయణ). ఒక వివాహిత విలాసాలకు అలవాటు పడి సహోద్యోగితో సాగించే సహజీవనం ఆమె కుటుంబ జీవితాన్ని ఎంతగా అతలాకుతలం చేస్తుందో ఈ నాటకం తెలియజేస్తుంది. చివరికి ఆమె కొడుకు, కుమార్తె ఆమెకు కనువిప్పు కలిగించే వైనం ఇందులో చూస్తాం. ఈ నాటకానికి దర్శకుడు కూర్చిన పటిష్టమైన స్క్రీన్ ప్లే, నటీనటుల నటనా చాతుర్యం, పదునైన సంభాషణలను విశ్లేషకుడు ప్రస్తావించాడు. మూడవ నాటిక మాడభూషి దివాకర్ బాబు రచించిన 'మంత్రనగరి'... తన మానసిక స్థితిని పెడదోవ పట్టించే మనిషి స్వార్థాన్ని తెలుపుతుంది. కృత్రిమ మేధతో తాను రూపొందించిన రోబోతో శస్త్రచికిత్సలు నిర్వహించాలని ఆరాటపడే యువకుడికి ఆ రోబోతోనే హార్ట్ సర్జరీ చేయించుకోవడానికి సిద్ధపడిన అతడి తాత ద్వారా కనువిప్పు కలుగుతుంది. ఈ నాటకానికి సంబంధించి సంభాషణలనూ, సాంకేతికతనూ విశ్లేషకుడు ప్రస్తావించాడు. నాల్గవ నాటకం పోలుదాసు శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించిన 'నిశి' .. ఒక వివాహిత విచ్చలవిడితనాన్ని తూర్పారబడుతుంది. సరదాలకు చోటివ్వని భర్తతో విసిగిపోయిన యువతి తానూ ఉద్యోగంలో చేరి అక్కడి సహోద్యోగి ట్రాప్‌లో పడిపోయి అతనితో సంబంధం పెట్టుకుంటుంది. ఆ విషయం తెలుసుకున్న భర్త ఆమెను క్షమిస్తాడు. పశ్చాత్తాపంతో లేఖ రాసి ఆమె ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడం ఈ నాటకం క్లైమాక్సు. ఇందులోని నటీనటుల ప్రతిభను విశ్లేషకుడు ప్రధానంగా ప్రస్తావించాడు. ఐదవ నాటకం భాస్కరచంద్ర రచించిన 'ఇది రహదారి కాదు'... మహానగరా ల్లోని విశృంఖలత్వం, విలాసజీవితం మాతృత్వానికి అడ్డంకులుగా మారి కుటుంబ జీవితాల్ని ఎలా మార్చివేస్తాయో తెలియజేస్తుంది. పని మనిషి తన కుటుంబం ద్వారా వాళ్లకు కనువిప్పు కలిగించడం ఇందులోని కొసమెరుపు. ఇందులోని పాత్రోచిత సంభాషణల్ని విశ్లేషకుడు ప్రధానంగా పేర్కొన్నాడు.

పేరూరు బాలసుబ్రమణ్యం కథాసంపుటి 'మడకెద్దులు'లోని కథలు రచయిత రైతు జీవన దృశ్యాలను ఎలా ఆవిష్కరించారో మరొక వ్యాసంలో చర్చించాడు. నాటక రంగానికి స్ఫూర్తినిచ్చిన బెల్లంకొండ రామదాసు వ్యక్తిత్వాన్నీ, రచనాపాట వాన్నీ, ఆయన రచనల్లోని అంకితభావాన్నీ చివరి వ్యాసంలో వివరించారు. రంగస్థలానికి ఆధునిక నాటకం ఎంతగా వన్నె తెస్తుందో, ప్రేక్షకుడి హృదయాన్ని ఎంతగా చూరగొంటుందో ఈ సంపుటి విశదీకరిస్తుంది. 64 పేజీలు, రూ.100 వెల ఉన్న ఈ పుస్తకాన్ని 94400 07374 నెంబర్లో రచయితను సంప్రదించి, పొందవచ్చు.

– డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
91777 32414

# గచ్చెం సెట్టుకి అటు కవిత్వం ఇటు జీవితం!

కళింగాంధ్రలో ముల్లొంకాయ రుచిచూడని వారు ఎవరూ ఉండరు. ఎండ్రెత్తల్లు కలిపి వండే వంకాయ కూర నంజుకొని మెతకల బియ్యం కూడు కడుపారా తిని త్రేంచని రైతు కుటుంబమూ ఉండదు. వంకాయల్లో ఒకానొక మేలు రకం ఆంధ్రొంకాయ్ అయినట్టే – ప్రస్తుత తెలుగు కవుల్లో ఒక మేలిమి కవిత్వ పాయ పాయల మురళీకృష్ణ కవిత్వం అనడం చక్కటి సామ్యమే! ఈ కవి ఇటీవల వెలువరించిన తన రెండో కవితా సంపుటి 'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ' చదువుతున్నప్పుడు ముల్లొంకాయ రుచీ, ఆంధ్రొంకాయ పచీ పాఠకులకు నోరూరిస్తాయి.

50 కవితల్ని గుదిగుచ్చి, మరో ఐదు అనువాద కవితల్ని జతచేసి కూర్చిన ఈ సంపుటి వస్తు విస్తృతి పరంగా విశాలమైన కాన్వాస్‌తో ఉంది. ఇందులోని వాక్య విన్యాసం చూసినప్పుడు వేర్వేరు పాయలు కనిపిస్తాయి. అవి కొత్త దారి కోసం అన్వేషిస్తుంటాయి. ఆ దారిలో గాయపడిన పాదాలు ఎదురైనప్పుడు వాటికి వెన్నపూస రాసేందుకు సుతిమెత్తగా కదిలొస్తూ కొన్ని పద్యాలు కదిలిస్తాయి. నెత్తురోడే బతుకుల్ని గుండెలకు హత్తుకుని వెక్కివెక్కి ఏడ్చే కొన్ని వాక్యాలు ఎక్కిళ్లతో ఎదురౌతాయి. సూది మొనల కర్కశత్వంతో బాటసారులకు తొన్నుపోట్లు తగిలించే బండరాళ్ల మీద సమ్మెట పోట్లయ్యే కొన్ని కవితా పాదాలు ధ్వనిస్తాయి. ప్రముఖ ఫ్రెంచ్ కవి పాల్ వేలెరీ చెప్పినట్టు 'వచనం నడక – కవిత్వం నాట్యం' అనుకుంటే అనేక భంగిమల లయ విన్యాసంతో నవరసభరితంగా సాగే రూపకం ఈ సంపుటం.

ఈ సంపుటిలో పిల్లలు నేపథ్యంగా రాసిన కవితలు పిల్లలే లేకుంటే, మాస్టారికో ఉత్తరం రెండూ ఎంతో ప్రత్యేకం. పిల్లల ఉనికి పెద్దల జీవితాలకు ఆటపట్టు అనే సత్యాన్ని ఈ కవి ఎంత చక్కగా వర్ణిస్తున్నాడో చూడండి. "సాగర కెరటాల ఆనందాన్ని అల్లరి గాలిపటంలా ఎగరేసే పిల్లలే లేకుంటే మన జమానా ఏమైపోయుణ్ణు" అంటూ బెంగపడతాడు. పిల్లల్ని ఇంతలా ప్రేమించగలగడం ఒక గొప్ప హృదయ సంస్కార చిహ్నం కదా! ఉపాధ్యాయుడిగా నిత్యం పిల్లల మధ్య ఉండే ఈ కవి ఆ పిల్లల ప్రపంచంలోనే వెలుగుల్ని ఆస్వాదిస్తుంటాడు. కవి తండ్రి గారైన పాయల సత్యనారాయణ గారు ఒక బాల సాహితీవేత్త. పద్యాన్ని ఆలపించడంలో కూడా దిట్ట. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నందువల్ల కాబోలు మురళీకృష్ణ కూడా సాహిత్యాన్ని పిల్లలకు చేరువ చేసే దృష్టితో పనిచేస్తున్నాడు. తన సాహితీ మిత్రుల్ని కొందరిని ఆహ్వానించి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయున్ని ఒప్పించి వారి బడుల్లో కొన్ని ప్రత్యేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఈ సంపుటిలో 'ఏమీ రాయబడని పలకలతో' అనే కవిత అతని సునిశిత దృష్టికి, బాలల పట్ల హద్దుల్లేని ప్రేమకు నిదర్శనంగా నిలుస్తుంది.

'అలలూ – కన్నీళ్లూ' అనే కవితలో 'సందెలేలకి/ అతడు/ అలలు దాటి తూర్పుకు వెళ్ళినపుడు/ నులక మంచం తెరచిన కళ్లు/ ఎంత మాత్రమూ ఎదురుచూపులయ్యేవి కావు/ ఆ సమయంలో/ సముద్రమే/ తోడొచ్చే వేటకుక్క కదా!/ అన్నంత ధైర్యం/ ఆ ధైర్యమే బలం/ తిరుగు ప్రయాణంలో సమాంతరంగా సూర్యోదయం' అంటూ ఈ కవి చెప్తున్న సంగతిని డీకోడ్ చేయాలి. ఇందులో చాలా పొరలు కనిపిస్తాయి. వలలో కొన్ని చేపలు పడితే కుటుంబానికి కూడు పెట్టొచ్చునన్న ఆశతో సముద్రానికి వల విసురుతాడు జాలరి. అప్పుడప్పుడూ సముద్రం కూడా జాలరి పైకి మృత్యువల విసురుతుంది. అలాంటప్పుడు ఆ కుటుంబం ఆసరా కోల్పోతుంది. ఇలాంటి ప్రమాద పరిస్థితుల్ని కూడా గుండె నిబ్బరంతో ఎదుర్కోవడానికి సిద్ధపడి బొట్టు పెట్టుకున్న సముద్రమొకటి ఆ జాలరి ఇంట్లో ఎదురుచూస్తూ ఉంటుంది. ఐనా నులక మంచం తెరిచిన కళ్లలో అతడు భద్రంగా తిరిగి వస్తాడనే భరోసా! ఇక్కడ సమాంతరంగా సూర్యోదయం అనే ప్రస్తావన ఉద్దేశం ఉదయానికి చేపలతో జాలరి ఇల్లు చేరడం. జాలర్లు వేటకు వెళ్లడానికి ఏ సమయంలో సముద్రం ప్రశాంతంగా ఉండి సహకరిస్తుందో తెలిపేది సముద్రం వేటకుక్కై వెంట రావడం. ఇలా పొరలు పొరలుగా అనేక అంశాలను మగ్గబెట్టిన మాగాయ జాడి మురళి కవిత్వం. మూత తెరిస్తే ఘుమ ఘుమ. తినే కొద్దీ రుచి. ఇలాంటి కవితల్లో పై పొర నుంచి సంగ్రహించే విషయం ఒకటైతే, లోపలి పొరల్లో కన్సీల్డ్‌గా మరో రహస్యం దాగి ఉంటుంది. ఈ సంపుటిలో చాలా కవితల్లో ఇలాంటి టెక్నిక్ మనకు కనిపిస్తుంది.

లోతైన భావనా ప్రపంచం. రహస్యాంత రంగపు నిశ్శబ్ద అన్వేషణ. ఎదలకు అందీ కళ్ళకు అందని తడిఛాయల బరువురంగు. నిరామయ స్పృహ. కనిపించే అదృశ్యాల మీదుగా ప్రకాశిస్తూ ఆకట్టుకునే దృశ్య శోభ. ఇలాంటి అన్ని హంగుల సాదా సమాహారం ఈ కవితా సంపుటి. మూడో మనిషిగా గౌరీ సావంత్ గురించి చెప్పినా; ఆల్మిహాన్ సెయిటీ, బూరుగుపల్లి సీతమ్మ, రాయపల్లి గైరమ్మ వంటి సాహసులైన స్త్రీ మూర్తుల్ని ఉదహరించినా; లూసీ గ్రే, కేసిబియాంకల్ని ప్రస్తావించినా; గాలవుడి గురుదక్షిణ గురించి స్పృశించినా... ఇవన్నీ ఉదాత్తీకరించిన మానవీయ విలువల సారాంశంగా ఉండడం గమనించొచ్చు. సమాచారాన్ని సాధారణీకరణ వైపు ఒడుపుగా నడిపించిన తీరును గుర్తించొచ్చు.

ఓ పుస్తకాల సంచిని తూనీరంలా ధరించి బయలుదేరిన వాడు ఇక మళ్ళీ రాడు అంటున్నాడు కవి. "పడమటి ఎల్లలు దాటి/ చీకటి ఖండాల్ని చేరి/ సిరియా మీదుగా/ మధ్యధరా సముద్రపు కన్నీటి అలలకి/ కొన్ని భాష్పాలను త్యాగం చేసి/ స్ట్రాంబోలి పర్వతాన్ని చుట్టుముడుతూ/ అవసరమైతే మనిషి ఒక అగ్నిపర్వతం కావాలంటాడ"ని ఊహిస్తున్నాడు. గాయపడిన చోటల్లా గ్లోబుని పరామర్శించడానికి అతడు తన పుస్తకాల సంచితో బయలుదేరాడని రూఢీగా తెలియజేస్తున్నాడు. ప్రపంచ పరిస్థితుల్నీ, స్థానిక పరిస్థితుల్నీ ఎంతో లోతుగా అధ్యయనం చేస్తే తప్ప ఎక్కడి ప్రజల విముక్తి ఉద్యమాల కోసమైనా చోదక శక్తులయ్యే చైతన్యమూర్తుల చేతిలో ఏముండాలో అవగాహనకు రాదు.

'ఎడిటివ్ ఐడెంటిటీ' అనే కవితలో మనిషి నికరంగా మిగిలించుకుంటున్నది శూన్యం అని చెప్పిన తీరు చాలా కొత్తగా ఉంది. 'రెండు మౌన శిఖరాలెదురైనపుడు' అనే కవితలో ఇద్దరు మూగవాళ్ళ గురించి చెప్తూ 'మౌనం వాళ్లకి ప్రసాదించబడిన అపురూప అదృశ్య అవయవం' అని వ్యాఖ్యానిస్తాడు కవి. 'వాళ్లు వెళ్లిపోతున్న దారిలో/ నిశ్శబ్దం ఒక మహాకావ్యానికి ముఖచిత్రం అవుతుంది' అంటాడు. 'నిషేధిత సమయంలో' అనే కవితలో 'మే నెలలో ఈ బెస్త పల్లె/ బోర్లించిన ఉప్పునీటి గిన్నె ముందు/ ఆబగా కూర్చున్న ఆకలి పేగు' అంటాడు. తిరుగు వలస కార్మికుల గురించి చెప్తున్నప్పుడు 'వాళ్లొచ్చారు' అనే కవితలో 'ఎప్పటికైనా వాళ్లు/ పల్లె గోడకు కొట్టిన బంతులే' అని ప్రకటిస్తాడు. మహా దుఃఖం అనే మరో కవితలో 'ఇంటికి నోచుకోని మనుషుల కన్నా/ మనుషులకి నోచుకోని ఇంటిదే మహా దుఃఖం' అంటాడు. ఈ సంపుటిలో ఇటువంటి మరికొన్ని కవితా పాదాలు అబ్బురపరుస్తాయి.

పక్షి రెక్కల కోసం, పాల నవ్వుల కాలం కోసం కళ్ళలో ఒత్తులు వేసుకుని నిరీక్షించే 'ఉదయించని ఆకాశం' అంటూ నెలసరి నెత్తుటి మేఘమయ్యే స్త్రీ గురించి, బిడ్డలు కలగనందువల్ల ఆమె ఎలాంటి సంఘర్షణ పడుతుందో ప్రెగ్ కలర్, ఫోలిక్యులార్ స్టడీల కోణంలో సరికొత్తగా చెప్పడం కనిపిస్తుంది. 'బ్రోకెన్ రైఫిల్ మధ్య/ పసిపాప ప్రతిరూపమై/ నిన్ను దర్శించే సూర్యోదయం /ఇంకెంతో దూరంలో లేదు' అంటూ ఇంతిఫాదా కవితలో గాజా యుద్ధం ఆగిపోతుందన్న ఆశావాదం కనిపిస్తుంది. కుంకుమ పూల మట్టికి స్వయం ప్రతిపత్తి అనే సంస్కారమే దీపధారి అన్న ప్రతిపాదనుంది. బహుశా శవాలకు పోస్టుమార్టం చేసే కట్టర్ జీవితం తెలుగు కవిత్వంలోకి రావడం ఈ సంపుటిలోనే తొలిసారి.

'గోచీ కట్టిన అడ్డపొగ బాల్యం ', 'తప్పుడు పైకప్పు' లాంటి ప్రయోగాలు గానీ, కరవాలం లాంటి కొన్ని మాటలు గానీ కొంత ఇబ్బంది కలిగించినా అన్వయానికి సరిపోతాయి. అరణ్యం ప్రవేశించే సమయం, ఒక చెట్టు – పగిలిన అద్దం వంటి కవితల్లో కొంత అస్పష్టత ఉన్నా వాటిలోకి దోవ చిక్కడానికి కవి క్లూ వదిలిపెట్టాడు. దాదాపు అన్ని కవితలూ పాఠకుల మెప్పు పొందేవిగానే ఉన్నాయి. అనువాద కవితల్లో గంట అన్న కవితను పాఠకులూ ప్రసంగీకులూ సులభంగా గుర్తుపెట్టుకుని ఉటంకిస్తారు. వెనుక అట్టమీద మానస చామర్తి రాసిన బ్లర్బ్ పుస్తకం ఆత్మను స్పష్టంగా పట్టి చూపింది.

ఇదంతా గచ్చెంసెట్టు దగ్గర వెలిగిన కళాకాంతి. గజిబిజిగా ఉండే బిజీ జీవితాలను వడగట్టి తేటతెల్లం చేసిన విరామ స్పృహ. బతుకు పట్ల ఆశ, దీనుల పట్ల జాలి, కాలం తప్పటడుగుల పైన నిఘా, సునిశిత పరిశీలన, హృదయోద్వేగపు సంచిత సారం... మొత్తంగా చూస్తే పాయల మురళీకృష్ణ కవిత్వం ఒక గోళీ మాత్ర. ఏవో మానవ దౌర్బల్యాలనూ అస్వస్థతలనూ నయం చేసే మందు. అబరాగుబరాగా ఉద్రేక ప్రసారాలేమీ జరగవు గానీ నిదానమైన ఉద్వేగ ప్రసారం మాత్రం ఖాయం. రూ.150ల వెల ఉన్న కాపీ కోసం సంప్రదించాల్సిన నెంబరు : 83410 84389.

– కంచరాన భుజంగరావు
94415 89602

# అసెంబ్లీలో గణతంత్ర వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గణతంత్ర దినోత్సవ వేడుకలు అసెంబ్లీలో ఆదివారం జరిగాయి. శాసనమండలి ప్రాంగణంలో ఛైర్మన్ కె మోషేనురాజు, శాసనసభ ప్రాంగణంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జాతీయ జెండాను ఎగురవేశారు. సంక్షేమ ఫలాలు అందరికీ అందినప్పుడే సమాజంలోని అసమానతలు తొలగుతాయని ఛైర్మన్ మోషేనురాజు అన్నారు. ప్రజలకు కల్పించిన హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. రాజ్యాంగం దేశ పౌరులకు స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం, ఓటు హక్కును కల్పించిందని చెప్పారు. చట్టసభలు పనిదినాలు తగ్గిపోవడం వల్ల ప్రజాస్వామ్యం బలహీనమవుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏడాదిలో 75 రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కార్యదర్శి జనరల్ ఎస్ ప్రసన్నకుమార్, ఉపకార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. హైకోర్టు ఆవరణలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ జాతీయ జెండాను ఎగురవేశారు. రాజ్యాంగం స్ఫూర్తికి విఘాతం కలగకుండా న్యాయ వ్యవస్థ సంరక్షిస్తుందని ఠాకూర్ ఈ సందర్భంగా అన్నారు.

సెక్రటేరియట్‌లో
జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ, బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలతో ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా, అదనపు కార్యదర్శి కాశీకుమార్, సిఎస్‌ఒ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

**పలు కార్యాలయాల్లో...**

రాష్ట్ర ప్రభుత్వ, కార్పొరేషన్, సంస్థల కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ఆయా కార్యాలయాల్లో ఆ శాఖల అధిపతులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఇడిలు జివి రవి వర్మ, ఎ అప్పలరాజు, చంగల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గుణదలలోని విద్యుత్ సౌదలో జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి, డైరెక్టర్ ఎకెవి భాస్కర్, జెన్‌కో డైరెక్టర్లు ఎం సుజయ్‌కుమార్, పి అశోక్‌కుమార్ రెడ్డి, పి నవీన్ గౌతమ్ పాల్గొన్నారు. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ కె మధుమూర్తి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి కార్యదర్శి ఐ నరసింహమూర్తి జాతీయ జెండాను ఎగురవేశారు.

# గవర్నర్ 'ఎట్‌హోం'కు సిఎం, డిప్యూటీ సిఎం

- ప్రతిపక్షాలు గైర్హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నిర్వహించిన 'ఎట్‌హోం'కు ప్రతిపక్ష పార్టీల నాయకులు గైర్హాజరయ్యారు. రాజ్‌భవన్ వేదికగా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భాల్లో ఎట్‌హోం పేరుతో తేనేటి విందు కార్యక్రమం ఏర్పాటుచేయటం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులతో పాటు ప్రతిపక్ష పార్టీలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలకు కూడా రాజ్‌భవన్ ఆహ్వానాలు పంపుతుంది. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో అధికార పార్టీ నేతలు మినహా ఇతర పార్టీల నాయకులు హాజరు కాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీసమేతంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, కె అచ్చెన్నాయుడు, ఎస్ సవిత, కె పార్థసారథి, పి నారాయణ, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ మయాన జకియా ఖానం, శాసనసభ ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, డిజిపి ద్వారకా తిరుమలరావు హాజరయ్యారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హాజరయ్యారు. వైసిపి, కాంగ్రెస్ నుంచి ఎవరూ హాజరుకాలేదు. ముందుగా రాజ్‌భవన్‌కు పవన్‌కల్యాణ్ చేరుకోగా, తరువాత చంద్రబాబు చేరుకున్నారు. ఇరువురు కలిసి గవర్నర్‌ను వెంటతీసుకొని వచ్చారు. సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ముఖ్యమంత్రి కార్యాలయం కార్యదర్శి రాజమౌళి తదితరులు హాజరయ్యారు.

# యుపిఎస్.. ఉద్యోగి భవిష్యత్తుకు ఉరి

- సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన పెన్షన్ విధానం (ఎన్‌పిఎస్/సిపిఎస్) బదులు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యునిఫైడ్ పెన్షన్ స్కీం (యుపిఎస్) ఉద్యోగి భవిష్యత్తుకు ఉరి అని ఎపి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సతీష్, సిఎం దాస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి దాచుకున్న 100 శాతం సొమ్ము మొత్తాన్ని ఉద్యోగ విరమణ పొందిన తరువాత తిరిగి ఇస్తారని, ఇది సిపిఎస్‌లో 60 శాతం ఉందని తెలిపారు. యుపిఎస్‌లో మొత్తం సొమ్ము ప్రభుత్వమే తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రతినెలా 10 శాతం చొప్పున 30-40 ఏళ్లు ఉద్యోగి దాచుకున్న మొత్తాన్ని ప్రభుత్వమే తీసుకోవడం అత్యంత దారుణమని అన్నారు. ఉద్యోగుల సొమ్మును కార్పొరేట్ శక్తులకు అడ్డంగా దోచిపెట్టడానికి ఈ విధానం తీసుకొచ్చారని విమర్శించారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని దేశవ్యాప్తంగా ఉద్యోగులంతా పోరాటం జరుపుతుంటే సిపిఎస్ కంటే దారుణమైన విధానాన్ని తీసుకురావడం అప్రజాస్వామికమని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యమైన రాష్ట్ర ప్రభుత్వం యుపిఎస్ విధానాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్, జిపిఎస్ విధానానికి బదులుగా పాత పెన్షన్‌లో ఉన్న ప్రయోజనాలను కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

దీక్షల్లో కూర్చున్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

పోరాటాలతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ సాధ్యమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, ఎన్ రామారావు, దానయ్య అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1445వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి నాయకులు, కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. తొలుత సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్మిక వర్గానికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ కలలు కన్న సమసమాజ నిర్మాణానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. భారత రాజ్యాంగానికి పాలకులు తూట్లు పొడవాలని చూస్తే ప్రజలు సహించబోరన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి అమలులో అలసత్వం వహిస్తున్న ప్రభుత్వాల వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ప్రజాప్రతినిధులు పని చేయాలని కోరారు. దీక్షల్లో సిహెచ్ నాగరాజు, పి కామేష్ ఈశ్వరరావు, సూర్యారావు, ప్రసాద్ కూర్చున్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు కృషి

## టిడిపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు

పతాకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగ పరిరక్షణ, ప్రజల హక్కులను కాపాడేందుకు సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళగిరిలోని టిడిపి ప్రధాన కార్యాలయంలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని పల్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అశోక్ బాబు, జంగా కృష్ణమూర్తి, టిడిపి నాయకులు ఎవి రమణ తదితరులు పాల్గొన్నారు.

**పేదరికం లేని సమాజం కోసం కృషి : అంబటి**

పేదరికం లేని సమాజం కోసం అంతా కృషి చేయాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, కార్యదర్శులు మస్తాన్ వలీ, అంకంరెడ్డి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**రాజ్యాంగం అంటే బిజెపికి గౌరవం లేదు : షర్మిల**

జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న షర్మిల

రాజ్యాంగం అంటే బిజెపికి గౌరవం లేదని, స్వాతంత్ర్య ఉద్యమ నాయకులను సైతం అవమానిస్తోందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. విజయవాడలోని పిసిసి రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్ ఆవరణలో జాతీయ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, పార్టీ నాయకులు నరహరిశెట్టి నర్సింహారావు పాల్గొన్నారు.

**రాజ్యాంగ పరిరక్షణకు నడుంకట్టాలి : రామకృష్ణ**

లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు నడుంకట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పిలుపునిచ్చారు. విజయవాడలోని దాసరి భవన్ ఆవరణలో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మతోన్మాద రాజకీయాలను తరిమికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రావుల రవీంద్రనాథ్, సిహెచ్ కోటేశ్వరరావు, పి దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(MINISTRY OF Finance, Government of India)
Ground &1st Floor, 31-31-21,Narayana Bhavanam,Sai Baba Street,Daba Gardens, Visakhapatnam-530020

**Demand Notice** Paper Publication ( Substituted Service) FORM NO.14 [See regulation 33(2)]

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF THE RECOVERY OF DEBT & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT,1961)

**R.P. No. 762 of 2017 in OA No. 626 of 2016**

**Union Bank of India (e-Corporation Bank), Benz Circle Branch, Vijayawada,**

**Versus**

**Mrs. Tumati Dhana Lakshmi & another**

To, **(CD-1) Mrs. Tumati Dhana Lakshmi W/o. G. Yesudas, D.No.67-1-1, GF-1, Vinayaka Vihar Apartments, Patamata, Vijayawada.**
**(CD-2) Mr. G. Yesudas, D.No.67-1-1, GF-1, Vinayaka Vihar Apartments, Patamata, Vijayawada.**

1.This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the presiding officer, Debts Recovery Tribunal Viskhapatanam in **OA/626/2016** an amount of **Rs.11,34,494/- (Rupees Eleven Lakh Thirty Four Thousand Four hundred Ninety Four only)** along with pendentellite and future intrest @12.5% p.a compounded with Half yearly rests W.e.f. 01-06-2016 till realization and the costs become due against you (Jointly and Severally/Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordence with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of your assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **25-02-2025** at 10:30 a.m for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
(a) Such intrest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
(b) All Cost, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be take place for recovering the certificate amount due.

**(Given under my hand and seal of this Tribunal on this date :10-12-2024)**

(B.N.S.V.S.K. BANGARRAJU)
RECOVERY OFFICER

**ఇ-వేలం విక్రయ నోటీసు**

**ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్**
సిఐఎన్: U67100MH2007PLC174759
నమోదిత కార్యాలయం: ఈడెల్‌వీస్ హౌస్, ఒయఫ్‌యఫ్ సి.ఎస్.టి రోడ్, కలిన, ముంబాయి 400098

**సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్") యొక్క రూల్ 8(6) నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002, క్రింద స్థిర సెక్యూర్డ్ అసెట్స్ అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు.**

సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ఆర్థిక సౌకర్యాలు అందించిన కాలమ్‌లో స్పష్టంగా పేర్కొన్న వివిధ ట్రస్టుల ట్రస్టీ హోదాలో **ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్** (ఇకపై "బిహెచ్‌ఎఫ్‌ఎల్/అసైనర్" గా సూచించబడుతుంది) కి కేటాయించబడ్డాయి. పేర్కొన్న అసైన్‌మెంట్‌కు అనుగుణంగా ఇఎఆర్‌సి అసైనర్ షూస్‌లోకి అడుగుపెట్టింది మరియు సెక్యూర్డ్ క్రెడిటార్‌గా దాని హక్కులను వినియోగించుకుంటుంది. ఆ ఇఎఆర్‌సి, సెక్యూర్డ్ క్రెడిటార్ హోదాలో, క్రింద పేర్కొన్న స్థిరమైన సెక్యూర్డ్ అసెట్స్‌ను సర్ఫాసీ యాక్ట్ మరియు నిబంధనల క్రింద 13(4) కింద స్వాధీనం చేసుకుంది.
**15 రోజుల** నోటీసు దీని ద్వారా సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత మరియు హామీదారు(లు)కి ఇవ్వబడింది, క్రింద వివరించిన స్థిరమైన సెక్యూర్డ్ అసెట్స్, సెక్యూర్డ్ క్రెడిటార్‌కి అనుకూలంగా తనఖా పెట్టబడ్డాయి, దాని భౌతిక స్వాధీనాన్ని సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి (ఎఓ) తీసుకున్నారు. **"ఎక్కడ ఉందో అలాగే" "ఉన్నట్లే" మరియు "ఏదైనా ఉంది"** ఆధారంగా రుణగ్రహీత మరియు హామీదారు నుండి ఇఎఆర్‌సి ద్వారా స్వీకరించబడిన ఏదైనా డబ్బు కోసం తీసివేయబడిన తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు / ఖర్చులతో పాటు ఇఎఆర్‌సి కారణంగా దిగువ పేర్కొన్న మొత్తాలను తిరిగి పొందడం కోసం. ప్రతి ఆస్తికి రిజర్వ్ ధర మరియు బయానా మొత్తం క్రింద పేర్కొనబడ్డాయి.

**వేలానికి ఉంచిన సెక్యూర్డ్ అసెట్స్ వివరాలు :**

| క్ర సం. | లోన్ అకౌంట్ నెం. | రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతల పేరు | ట్రస్ట్ పేరు | 23.01.2025 నాటికి మొత్తం రుణ బకాయిలు ఐఎన్‌ఆర్ లో | రిజర్వ్ ధర (రూ.లో) | బయానా (ఇఎమ్‌డి) లో | వేలం యొక్క తేదీ మరియు సమయం | స్వాధీనతా రకం |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | 02400005793/ PHFL | 1) శ్రీ. కిరణ్ కుమార్ చప్పిడి ("రుణగ్రహీత") 2) శ్రీ.విజయ్ కుమార్ కొంగల ("సహ-రుణగ్రహీత") | ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 477 | Rs. 33,09,545.72 | Rs. 5,00,000 | Rs. 50,000 | 18-02-2025 at 11:00am | భౌతికం |
| | **తనఖా ఆస్తి వివరణ :** కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పు సబ్ రిజిస్ట్రీ అధికార పరిధి మరియు పామర్రు సబ్ రిజిస్ట్రీ అధికార పరిధి పామర్రు మండలం, కొమరవోలు గ్రామం యొక్క కిరణ్ బాబూ డ్రీమ్ సిటీ ఫేజ్-2, లే అవుట్ నం.11/2016/విజిఎ ఆమోదించబడిన ఎపి సిఆర్‌డిఎ ఆర్.ఎస్.నం.196/1 లో బయట మొత్తం పరిధి ఎ.లు. 1-64 సెంట్లు. ప్లాట్ నం.83 మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ కొలిచే పరిధి 181 చ.గ.లు. ఉన్న **హద్దులు : తూర్పు :** ఇతరుల ఆస్తి 30-0 అ.లు., **దక్షిణం :** ప్లాట్ నం.84-54-5 అ.లు., **పడమర :** 40- అ.లు. వెడల్పు రోడ్డు 30-0 అ.లు., **ఉత్తరం :** ప్లాట్ నం.82, 53.8 అ.లు. పై సరిహద్దుల ప్లాట్ నం.83 మధ్యలో విస్తీర్ణం 181 చ.గ.లు. తో లే అవుట్ ప్లాన్‌లో చూపించిన అన్ని సౌలభ్య హక్కులు. | | | | | | | |
| 2. | 7986361/ HDBFSL | 1. మెసెర్స్. సీతా మహాలక్ష్మి హ్యాండ్‌లూమ్స్ ("రుణగ్రహీత") ప్రొప్రైటర్. శ్రీ.శివ శంకర పొట్లబతుని, 2. శ్రీమతి. సీతా మహాలక్ష్మి పొట్లబతుని ("సహ రుణగ్రహీత"), 3. మెసెర్స్. సాయిలక్ష్మి హ్యాండ్‌లూమ్స్ ("సహ రుణగ్రహీత"), 4. శ్రీ.శివ శంకర పొట్లబతుని ("సహ రుణగ్రహీత"), 5. శ్రీ.పొట్లబతుని ప్రకాష్ ("సహ రుణగ్రహీత") | ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 449 | Rs. 91,85,907.68 | Rs. 42,00,000 | Rs. 4,20,000 | 18-02-2025 at 11:30 am | భౌతికం |
| | **తనఖా ఆస్తి వివరణ :** గుంటూరు జిల్లా, మంగళగిరి ఉపజిల్లా, మంగళగిరి మున్సిపాలిటీ పరిధి, పాత మంగళగిరి, 11వ వార్డు, డో.నం.11-285/13/ఎ, మూల్యాంకనం నం.ఐ023016888, ఎస్.నం.130/1 లో సైట్ పరిధి 145.2 చ.గ.లు. మరియు ఆర్.సి.సి. భవనం ఉన్న **హద్దులు : తూర్పు :** రైస్ మిల్లు యజమానుల ఆస్తి, **దక్షిణం :** కవిత ఆస్తి, **ఉత్తరం :** పాంచాల శివ మోహనరావు ఆస్తి, **పడమర :** ఉమ్మడి బజారు. ఈ సరిహద్దుల సైట్ పరిధి 145.2 చ.గ.లు. లేదా 121.986 చ.మీ.లు., మంగళగిరి సబ్ రిజిస్ట్రేషన్ మరియు గుంటూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉన్న ఆర్.సి.సి. భవనం మరియు ఎలక్ట్రిసిటీ కస్టమర్ కనెక్షన్ మొదలైనవి. | | | | | | | |

**వేలం ప్రక్రియకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం:**

| | | |
|---|---|---|
| 1 | అన్ని డిమాండ్ డ్రాఫ్టులు (డిడి) పైన పేర్కొన్న విధంగా ట్రస్ట్ పేరుకు అనుకూలంగా డ్రా చేయబడతాయి మరియు ముంబైలో చెల్లించబడతాయి. | |
| 2 | ఆర్‌టిజిఎస్ ద్వారా ఇఎమ్‌డి చెల్లింపు మోడ్ చేయగలరు : **అకౌంట్ నం. పేరు :** ఈడల్‌వీజ్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్- ఇఎమ్‌డి అకౌంట్" **అకౌంట్ నం.: 000405158602, బ్యాంక్ పేరు :** ఐసిఐసిఐ బ్యాంక్, **ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ : IFSC ICIC0000004** | |
| 3 | ఇఎమ్‌డి సమర్పణ చివరి తేదీ | వేలం తేదీకి 1 రోజు ముందు స్వీకరించబడింది |
| 4 | బిడ్ల సమర్పణ కొరకు స్థలం | 1వ అంతస్తు, ఈడల్‌వీస్ హౌస్, ఓఎఫ్ఎఫ్ సిఎస్‌టి రోడ్డు, కలిన ముంబై-400098 |
| 5 | వేలం స్థలం (వేలం కొరకు వెబ్‌సైట్) | ఇ-వేలం (**https://auction.edelweissarc.in**) |
| 6 | సంప్రదింపు వివరాలు | **టోల్ ఫ్రీ నంబర్ 1800 266 6540** |
| 7 | ఆస్తి తనిఖీ తేదీ మరియు సమయం | ముందస్తు నియామకం ప్రకారం |

విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కొరకు, దయచేసి ఇఎఆర్‌సి వెబ్‌సైట్ అనగా... **https://auction.edelweissarc.in** లో అందించిన లింక్‌ను చూడండి.

**ప్రదేశం : ముంబై**
**తేది: 23.01.2025**

**సం/- అధీకృత అధికారి**
**ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్**

Edelweiss
Asset Reconstruction

TATA

**టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిష్టర్డు చిరునామా : 11వ అంతస్తు, టవర్ ఏ, పెనిన్‌సులా బిజినెస్ పార్క్, గణపత్‌రావు కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400013.
బ్రాంచ్ చిరునామా : టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.54-15/4సి/1, 5వ అంతస్తు, అర్‌కె గల్లేరియా, శ్రీనివాస్ బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008.

**స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన**
**(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోనిరూల్ 9(1)తో చదవగల రూల్ 8(6) క్రింద)**

**ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) మరియు రూల్ 9(1) యొక్క నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల ఇ-వేలం అమ్మకపు ప్రకటన.**

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత, లేదా వారి చట్టబద్ధ వారసులు/ ప్రతినిధులు (రుణగ్రహీత)లకు ప్రకటన ఇవ్వడమేమనగా, **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్)కు తాకట్టుపెట్టబడిన దిగువ వివరించిన స్థిరాస్తిని టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడినది, అవి దిగువ పేర్కొనబడిన రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతల నుండి బాకీపడిన బకాయిల రికవరీ కొరకు **"ఎక్కడ ఉన్నది & అది అక్కడ అలాగే"** మరియు **"ఉన్నది ఉన్నట్టుగా మరియు ఏదేని రికోర్స్ లేకుండా ప్రాతిపదికన" 13-02-2025న** విక్రయించబడుతుంది. రిజర్వు ధర మరియు ధరావత్తు దిగువ పేర్కొనబడినవి. ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, అమ్మకంలో ఏవేని వాయిదాలు/ నిలిపివేయుటలో ఏవేని గైర్హాజరులో, సదరు సెక్యూర్డ్ అసెట్/ ఆస్తిని ఇ-వేలం ద్వారా సదరు **13-02-2025న మ.2.00గం.లకు** విక్రయించబడుతుంది. ఇ-వేలంలో పాల్గొనుట కొరకు ధరావత్తు డిమాండ్ డ్రాఫ్ట్ కలిగియున్న సీల్డు ఎన్వలప్‌ను బ్రాంచ్ చిరునామా: **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.54-15/4సి/1, 5వ అంతస్తు, అర్‌కె గల్లేరియా, శ్రీనివాస్ బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008** వద్ద **12-02-2025న సా.5.00 గం.ల** వరకు లేదా ముందుగా టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ యొక్క అధీకృత అధికారికి దాఖలు చేయబడాలి.
సెక్యూర్డ్ అసెట్/స్థిరాస్తి అమ్మకం అనునది "ఎక్కడ ఉన్నది అది అక్కడ షరతుపై" జరుపబడుతుంది, సంక్షిప్త వివరాలు దిగువ పేర్కొనబడినవి.

| క్ర సం. | రుణ ఖాతా నెం | రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీత(లు) / చట్టబద్ధ వారుసులు / చట్టబద్ధ ప్రనినిధి / హామీదారుల పేరు | డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం | రిజర్వు ధర | ధరావత్తు | స్వాధీనతా రకం | ఈ తేది నాటికి బాకీపడిన మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| 8 | 10556840 | శ్రీ బండి శ్రీనివాస్, శ్రీమతి బండి సాయి లక్ష్మి | రూ. 9,41,379/- (రూపాయలు తొమ్మిది లక్షల నలబైఒకవే మూడువందల డెబ్భైతొమ్మిది మాత్రమే) & 12-12-2022 | రూ.6,00,000/- (రూపాయలు ఆరులక్షలు మాత్రమే) | రూ. 60,000/- (రూపాయలు అరవై వేలు మాత్రమే) | భౌతికంగా | రూ. 13,60,873/- (రూపాయలు పదమూడు లక్షల అరవైవేల ఎనిమిది వందల డెబ్బై మూడు మాత్రమే) |
| | **స్థిరాస్తి యొక్క వివరణ:** రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.1991/2019 ఆధారంగా శ్రీ బండి శ్రీనివాస్ వారిపేరునగల ఆర్‌సి.నెం.225/4, 225/5, ఎపిసిఆర్‌డిఏ ఎల్‌పి నెం.28/2016, ప్లాట్ నెం.27, నందిగామా ఎస్ఆర్ఓ, చందర్లపాడు మండలం, ముప్పల గ్రామపంచాయతీ ఏరియా, ముప్పల గ్రామంలోని 150 చ.గ.ల విస్తీర్ణపు మొత్తం భాగం సరిహద్దులు దిగు విధంగా కలవు: **సరిహద్దులు: తూర్పు:** 40-00 అ.ల వెడల్పు రోడ్డు 30-0 అడుగులు, **దక్షిణం:** ప్లాట్ నెం.26 45-0 అడుగులు, **పడమర:** ఇతరుల భూమి 30-0 అడుగులు, **ఉత్తరం:** ప్లాట్ నెం.28 సరిహద్దు 45-0 అ.లు. ఈ సరిహద్దుల మధ్య 150-0 చ.గ.లు లేదా 125-419 చ.మీ.ల విస్తీర్ణంలో అన్ని సౌలభ్య హక్కులతో కూడిన ఓపెన్ ల్యాండ్. | | | | | | |
| 9 | TCHHL0 8030001 0008439 5 | శ్రీ మొదేంటి దుర్గ ప్రసాద్ శ్రీమతి మొండేటి రూపవతి | రూ. 29,16,115/- (రూపాయలు ఇరవైతొమ్మిది లక్షల పదహారువేల ఒకవంద పదిహేను మాత్రమే) & 15-11-2022 | రూ.20,00,000/- (రూపాయలు ఇరవైలక్షలు మాత్రమే) | రూ.2,00,000/- (రూపాయలు రెండు లక్షలు మాత్రమే) | భౌతికంగా | రూ. 42,20,299/- (రూపాయలు నలబై రెండు లక్షల ఇరవైవేల రెండువందల తొంబై తొమ్మిది మాత్రమే) |
| | **స్థిరాస్తి యొక్క వివరణ:** రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.2029/2017 ఆధారంగా శ్రీ.మొండేటి దుర్గప్రసాద్ వారిపేరునగల అంబాపురం గ్రామం, అంబాపురంగ్రామ పంచాయితీ ప్రాంతం, విజయవాడ రూరల్ మండలం, నున్న సబ్ రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ లోని ఆర్ఎస్ నెం.99/4 & 99/5ఏ, ఆర్ఎల్‌పి నెం.361/2010/విజేఏ, ప్లాట్ నెం.61 డోర్ నెం.1-9 దగ్గరలోని 206.0 చ.గ.ల విస్తీర్ణంలో 36.0చ.గ.ల ఉమ్మడి విస్తీర్ణంతోపాటుగా 800.0చ.అ.ల నిర్మితమైన ఏరియాతో "లక్ష్మి శ్రీనివాస టవర్స్", 2వ అంతస్తులోని తూర్పువైపు ఫ్లాట్ నెం.ఎస్ఎఫ్-2 మొత్తం భాగం మరియు **స్థలానికి సరిహద్దులు: తూర్పు:** డి.రాజగోపాల రాజు మొదలైనవారు ఇతరులకు విక్రయించిన ఆస్తి 34.0 అ.లు, **దక్షిణం:** పి.వర ప్రసాదమ్మ యొక్క ప్లాట్ నెం.60- 54.6 అడుగులు, **పడమర:** 33.0అ.ల వెడల్పు రోడ్డు 34.0అడుగులు, **ఉత్తరం:** పి.నరేంద్రబాబు యొక్క ప్లాట్ నెం.62-54.6 అడుగులు. **ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఉమ్మడి కారిడార్ & మెట్లు, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై. | | | | | | |
| 10 | 10229198 | శ్రీ కొలగాని ఏడుకొండలు (రుణగ్రహీత) శ్రీమతి కొలగాని వీరనాగమ్మ (సహ రుణగ్రహీత) | Rs.12,70,441/- & 16.11.2021 | రూ.5,00,000/- (రూపాయలు ఐదులక్షలు మాత్రమే) | రూ.50,000/- (రూపాయలు యాభై వేలు మాత్రమే) | భౌతికంగా | రూ. 19,88,654/- (రూపాయలు పందొమ్మిది లక్షల ఎనభై ఎనిమిది వేల ఆరువందల యాభై నాలుగు మాత్రమే) |
| | **స్థిరాస్తి యొక్క వివరణ :** కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట సబ్-రిజిస్ట్రార్, సుబ్బాయి గూడెం గ్రామ పంచాయతీ మరియు గ్రామం, ఆర్ఎస్ నెం.35/2ఏ1ఏ, 35/2ఏ1బి, 35/2సి1, ఎల్‌పి నెం.53/2016 ఆధారంగా APCRDA విజయవాడ ద్వారా ఆమోదించిన లేఔట్‌కు సంబంధించి 248.75 చ.గ.ల విస్తీర్ణపు లేఔట్ ప్లాన్ ప్లాట్ నెం.207 మొత్తం. **సరిహద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.208, **దక్షిణం:** ప్లాట్ నెం.206, **పడమర:** 40-0 అ.ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ఇతరుల ఆస్తి. పేర్కొన్న సరిహద్దుల పరిధిలో 248.75 చ.గ.లు లేదా 207.97 చ.మీ.ల విస్తీర్ణంలో ఖాళీగా ఉన్న సైట్‌తో పాటు దానికి అనుబంధించబడిన హక్కులు మరియు హక్కులు. | | | | | | |
| 11 | 10124413 | శ్రీ ఎస్ కోటేశ్వరరావు శ్రీమతి ఎస్ పుష్పలత | రూ. 20,72,293/- (రూపాయలు ఇరవైలక్షల డెబ్బైరెండువేల రెండువందల తొంబైమూడు మాత్రమే) & 12-10-2022 | రూ.15,00,000/- (రూపాయలు పదిహేను లక్షలు మాత్రమే) | రూ.1,50,000/- (రూపాయలు ఒకలక్షా యాభై వేలు మాత్రమే) | భౌతికంగా | రూ. 30,35,114/- (రూపాయలు ముప్పైలక్షల ముప్పైఐదువేల ఒకవందా పద్నాలుగు మాత్రమే) |
| | **స్థిరాస్తి యొక్క వివరణ:** రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.12939/2017 ఆధారంగా శ్రీ.సంకబత్తుల కోటేశ్వర రావు వారి పేరునగల కృష్ణా జిల్లా, ఎస్ఆర్ఓ జగ్గయ్యపేట పరిధిలోని భీమవరం గ్రామం మరియు గ్రామపంచాయతీ, వత్సవాయి మండలంలోని రిఫరెన్స్ ఆర్‌సి నెం.సిఎఫ్‌జి5-10/2013, తేది.02.04.2015, టిఎల్‌పి నెం.141/2015/ఆర్ క్రింద ఆమోదిత డి.టి.సి.పి.లేఔట్ నెం.3217/138/2015/ఆర్3 ప్రకారం ప్లాట్ నెం.115, ఆర్.ఎస్ నెం.లు 327/1బి, 2, 3, 328/1(పి), 2ఏ1, 2ఏ2, 2బి మరియు 330/2ఏ(పి) & 327/2లోని ఎక 2.00 సెంట్లలోని 516 చ.గ.ల విస్తీర్ణపు మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** 33-0 అ.ల వెడల్పు రోడ్డు 99-0 అ.లు, **పడమర:** ప్లాట్ నెం.138, 137, 136లోని ఆస్తి 99-0అ.లు, **ఉత్తరం:** ప్లాట్ నెం.128లో ఆస్తి 47-0 అ.లు, **దక్షిణం:** ప్లాట్ నెం.124లోని ఆస్తి 47-0 అ.లు. | | | | | | |
| 12 | 9793067 | శ్రీ పోతు రెడ్డి ఎం. శ్రీమతి బుల్లెమ్మ మున్నంగి | రూ. 98,61,026/- (రూపాయలు తొంబైఎనిమిది లక్షల అరవైఒకవేల ఇరవైఆరు మాత్రమే) & 12-12-2022 | రూ. 1,00,00,000/- (రూపాయలు ఒక కోటి మాత్రమే) | రూ.10,00,000/- (రూపాయలు పది లక్షలు మాత్రమే) | భౌతికంగా | రూ.1,27,79,604/- (రూపాయలు ఒకకోటి ఇరవైఏడు లక్షల డెబ్భైతొమ్మిది వేల ఆరువందల నాలుగు మాత్రమే) |
| | **స్థిరాస్తి వివరణ : దీని మొత్తం భాగం : 1వ ఐటం :** అంకిరెడ్డిపాలెం గ్రామం, గుంటూరు మునిసిపాలిటీ, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు జిల్లాలోని డిమార్కేషన్ నెం.14/ఏ, 14/బి, ప్లాట్ నెం.6, సైటు యొక్క 350చ.గ.లు లేదా 292.63 చ.మీ.ల విస్తీర్ణపు మొత్తం భాగం. సరిహద్దులుగా: **సరిహద్దులు: తూర్పు:** 28 అ.ల వెడల్పు రోడ్డు 52-6 అ.లు, **దక్షిణం:** కన్నెదర సుబ్బారావు ప్లాట్ నెం.7 సైట్ 60 అ.లు, **పడమర:** గాదె అంకిరెడ్డికి విక్రయించిన స్థలం-52.6 అ.లు, **ఉత్తరం:** శివారెడ్డి ఆస్తి 60అ.లు. **2వ ఐటం:** అంకిరెడ్డిపాలెం గ్రామం, గుంటూరు మునిసిపాలిటీ, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు జిల్లాలోని డిమార్కేషన్ నెం.14/ఏ, 14/బి, ప్లాట్ నెం.2, సైటు యొక్క 183.34 చ.గ.లు లేదా 153.29 చ.మీ.ల విస్తీర్ణపు మొత్తం భాగం. సరిహద్దులుగా: **సరిహద్దులు: తూర్పు:** మెట్టు చిన్న మల్లారెడ్డి ఆస్తి 30అ.లు, **దక్షిణం:** మున్నంగి పోతి రెడ్డి ప్లాట్ నెం.3 సైటు 55 అ.లు, **పడమర:** 28 అ.ల వెడల్పు రోడ్డు 30 అ.లు, **ఉత్తరం:** యారం శివారెడ్డి ప్లాట్ నెం.2 సైట్ 55 అ.లు. **3వ ఐటం:** అంకిరెడ్డిపాలెం గ్రామం, గుంటూరు మునిసిపాలిటీ, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు జిల్లాలోని డిమార్కేషన్ నెం.14/ఏ, 14/బి, ప్లాట్ నెం.3, సైటు యొక్క 220 చ.గ.లు లేదా 183.94 చ.మీ.ల విస్తీర్ణపు మొత్తం భాగం. సరిహద్దులుగా: **సరిహద్దులు: తూర్పు:** మెట్టు చిన్న మల్లారెడ్డి ఆస్తి 36 అ.లు, **దక్షిణం:** పెరుమాళ్ల రాంబాబు యొక్క ప్లాట్ నెం.4 సైటు 55 అ.లు, **పడమర:** 28 అ.ల వెడల్పు రోడ్డు 36 అ.లు, **ఉత్తరం:** మున్నంగి బుల్లెమ్మ ప్లాట్ నెం.2 సైటు 55 అ.లు. **4వ ఐటం:** అంకిరెడ్డిపాలెం గ్రామం, గుంటూరు మునిసిపాలిటీ, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు జిల్లాలోని డిమార్కేషన్ నెం.14/ఏ, 14/బి, ప్లాట్ నెం.5, సైటు యొక్క 222 చ.గ.లు లేదా 185.61 చ.మీ.ల విస్తీర్ణపు మొత్తం భాగం. సరిహద్దులుగా: **సరిహద్దులు: తూర్పు:** మెట్టు చిన్న మల్లారెడ్డి ఆస్తి 36 అ.లు, **దక్షిణం:** ప్లాట్ నెం.5ఏ సైటు మరియు కుందుల రోడ్డు 55-6 అ.లు, **పడమర:** 28 అ.ల వెడల్పు రోడ్డు 36 అ.లు, **ఉత్తరం:** పెరుమాళ్ల రాంబాబు ప్లాట్ నెం.4 సైట్ 55-6 అ.లు. **5వ ఐటం:** అంకిరెడ్డిపాలెం గ్రామం, గుంటూరు మునిసిపాలిటీ, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు జిల్లాలోని డిమార్కేషన్ నెం.14/ఏ, 14/బి, ప్లాట్ నెం.8, సైటు యొక్క 240 చ.గ.లు లేదా 200.66 చ.మీ.ల విస్తీర్ణపు మొత్తం భాగం. సరిహద్దులుగా: **సరిహద్దులు: తూర్పు:** 28అ.ల వెడల్పు రోడ్డు 36 అ.లు, **దక్షిణం:** డి.వరప్రసాద్ ప్లాట్ నెం.9 సైటు 60అ.లు, **పడమర:** గాదె అంకిరెడ్డికి ఇతరులు విక్రయించిన స్థలం-36 అ.లు, **ఉత్తరం:** కె.సుబ్బారావు ప్లాట్ నెం.7 సైట్ 60 అ.లు. | | | | | | |
| 13 | 10421835 | శ్రీ వరద కోటేశ్వర రావు శ్రీమతి వరద లోక కళ్యాణి | రూ. 9,83,782/- (రూపాయలు తొమ్మిది లక్షల ఎనభైమూడు వేల ఏడువందల ఎనభైరెండు మాత్రమే) & 15-11-2022 | రూ.6,50,000/- (రూపాయలు ఆరులక్షల యాభై వేలు మాత్రమే) | రూ.65,000/- (రూపాయలు అరవై ఐదు వేలు మాత్రమే) | భౌతికంగా | రూ. 13,90,120/- (రూపాయలు పదమూడు లక్షల తొంబై వేల ఒకవంద ఇరవై మాత్రమే) |
| | **స్థిరాస్తి యొక్క వివరణ :** రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.5689/2018 ఆధారంగా శ్రీ వరద కోటేశ్వర రావు వారి పేరునగల రావికంపాడు శివారులోని షేర్ ఎండి పేట్, జగ్గయ్యపేట మండలం, ఎస్ఆర్ఓ జగ్గయ్యపేట, కృష్ణా జిల్లాలోని "సిద్ధార్థ టౌన్‌షిప్', ఎల్‌పి నెం.49/2016/విజేఏ, ప్లాట్ నెం.31, సర్వే నెం.56లోని సైట్ యొక్క ఎక 11.50 సెంట్ల విస్తీర్ణపు మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులు: **సరిహద్దులు: తూర్పు:** 40 అ.లవెడల్పు రోడ్డు-36 అ.లు, **దక్షిణం:** ప్లాట్ నెం.30-50 అ.లు, **పడమర:** ప్లాట్ నెం.55-36 అ.లు, **ఉత్తరం:** ప్లాట్ నెం.32లో స్థలం-50 అ.లు. ఈ సరిహద్దుల పరిధిలో 200 చదరపు గజాల ఓపెన్ ప్లాట్. | | | | | | |
| 14 | 9870408 | వెంకటేశ్వర రావు మొంద్రు, మొంద్రు సునీత | రూ. 13,39,605/- (రూపాయలు పదమూడులక్షల ముప్పైతొమ్మిదివేల ఆరువందలఐదు మాత్రమే) & 05-02-2024 | రూ.11,00,000/- (రూపాయలు పదకొండు లక్షలు మాత్రమే) | రూ.1,10,000/- (రూపాయలు ఒకలక్షా పది వేలు మాత్రమే | భౌతికంగా | రూ.15,87,245/- (రూపాయలు పదిహేనులక్షల ఎనభైఏడువేల రెండువందల నలబై ఐదు మాత్రమే) |
| | **స్థిరాస్తి యొక్క వివరణ :** రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.896/2017 ఆధారంగా శ్రీమతి మొంద్రు సునీత వారి పేరునగలనాగవరప్పాడు గ్రామం, గుడివాడ మున్సిపల్ ఏరియా మరియు గుడివాడ మండలం, గుడివాడ సబ్-రిజిస్ట్రీ, కృష్ణా జిల్లాలోని ఆర్ఎస్ నెం.193/2లోని 145.2 చ.గ.ల విస్తీర్ణపు సైటు మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులు ఉన్నాయి: **సరిహద్దులు: తూర్పు:** గంటా నిర్మల కుమారికి చెందిన సైటు- 42.6 అ.లు, **దక్షిణం:** అరికిపాటి యేసుమ్మకు చెందిన ఇల్లు & స్థలం-29.6 అ.లు, **పడమర:** మున్సిపల్ రోడ్-45.0అ.లు, **ఉత్తరం:** మలిరెడ్డి విజయ రామిరెడ్డి & నాయుడుకు చెందిన సైటు-30.0అ.లు. సరిహద్దుల లోపల 145.2 చ.గ.లు లేదా 121.40 చ.మీ.ల విస్తీర్ణపు ఖాళీ స్థలం. | | | | | | |

వేలంలో, సాధారణంగా ప్రజలు తమ బిడ్(లు)ను వ్యక్తిగతంగా సమర్పించమని ఆహ్వానించబడతారు. ఈ అమ్మకానికి సంబంధించి ఏదైనా విధిని నిర్వర్తించాల్సిన అధికారి లేదా ఇతర వ్యక్తి, అయితే, విక్రయించిన స్థిరాస్తిలో ఏదైనా వాటా కోసం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బిడ్ చేయకూడదు, పొందకూడదు లేదా పొందేందుకు ప్రయత్నించకూడదు.
ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో నిర్దేశించిన నియమాలు మరియు దిగువ తదుపరి షరతుల ప్రాతిపదికన అమ్మకం ఉంటుంది :
**గమనిక : ఆస్తుల ఇ-వేలం అనునది 13-02-2025న మ.2.00 గం.లు నుండి మ.3.00 గం.ల మధ్య ప్రతి 5 నిమిషాల పరిమిత పొడిగింపుతో పోర్టల్:** http://bankauctions.in/ **ద్వారా చేపట్టబడును.**

**నియమ & నిబంధనలు :**

**1)** ఇందు దిగువ షెడ్యూలులో ప్రత్యేకించి సూచించినవి క్రింది సంతకందారు యొక్క సమాచారం మేరకు ఉంది, కానీ ఈ ప్రకటనలో ఏదైనా తప్పు, తప్పు ప్రకటన లేదా మినహాయింపుకు దిగువ సంతంకదారు వ్యక్తి బాధ్యత వహించదు. బిడ్ మొత్తంలో ఏవేని వివాదం ఏర్పడిన సందర్భంలో లేదా బిడ్డరుదారుగా, అధీకృత అధికారి నిర్ణయం ప్రాతిపదికన మరొకసారి స్థిరాస్తి వేలం పెట్టబడుతుంది. **2) స్థిరాస్తిని రిజర్వు ధరకు తక్కువకు విక్రయించబడదు. 3)** బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/- (రూపాయలు పది వేలు మాత్రమే). **4)** ఆస్తి కొనుగోలు కొరకు దాఖలుచేయబడిన బిడ్స్‌అన్నీ **"టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్"** పేరున **బ్రాంచ్ చిరునామా** వద్ద చెల్లుబడు నట్లుగా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో పై పేర్కొన్నట్లుగా ధరావత్తు కలిగియుండవలెను. వేలం తరువాత గెలుపొందని బిడ్డరుదారులకు డిమాండ్ డ్రాఫ్టులు తిరిగి ఇచ్చి వేయబడుతాయి. ఎన్ఇఎఫ్టీ/ఆర్టీజిఎస్/ఐఎంపిఎస్ ద్వారా ధరావత్తు చెల్లింపుకు దయచేసి అధీకృత అధికారిని సంప్రదించండి. **5)** అత్యధిక బిడ్డరుదారును గెలుపొందిన బిడ్డరుదారుగా ప్రకటించబడును మరియు బిడ్‌కు చట్టబద్ధంగా అర్హుడైనాడని అతన్ని/ఆమెకు సమకూర్చ బడుతుంది మరియు బిడ్ మొత్తం రిజర్వు ధరకు తక్కువగా లేదని సమకూర్చబడుతుంది. ఇది అధీకృత అధికారి నిర్ణయం మేరకు ఆఫర్ ధర స్పష్టతలేనట్లు భావించబడి రద్దు చేయబడుతుంది. **6)** కారణాలకు రికార్డు చేయబడిన, అధీకృత అధికారి నిర్ణయం మేరకు అమ్మకం నిలిపివేయబడవచ్చు/ వాయిదా వేయబడవచ్చును. **7) ముందస్తు అనుమతితో స్థిరాస్తి 06-02-2025న ఉ.11.00 గం.ల నుండి సా.5.00గం.ల మధ్య తనిఖీ చేసుకోవచ్చును. 8)** గెలుపొందిన బిడ్డరుదారుగా ప్రకటించబడిన వ్యక్తి, ప్రకటించబడిన తరువాత వెంటనే 24 గంటల్లోగా అధీకృత అధికారికి కొనుగోలుచేసిన సొమ్ము/ బిడ్ మొత్తానికి ఇరువై-ఐదు శాతం డిపాజిట్ చేయవలసి ఉంటుంది మరియు అట్టి డిపాజిట్ చేయుటలో విఫలం చెందినట్లైతే, తాజా వేలం/ ప్రైవేట్ ట్రీటి ద్వారా అమ్మకం పెట్టుటకు ఆస్తి జప్తు చేబయడుతుంది. **9)** పై విధంగా ప్రారంభ డిపాజిట్ చేసిన, కొనుగోలు చేసిన మొత్తాలు యొక్క మిగతా మొత్తాలను ఆస్తి అమ్మకం ఆమోదించబడిన తేదికి ముందు 15వ రోజున లేదా ముందుగా అధీకృత అధికారికి కొనుగోలుదారుచే చెల్లించవలసి ఉంటుంది లేదా 15వ రోజున ఆదివారం లేదా ఇతర సెలవుదినమైనచో, 15వ రోజున తరువాత మొదటి ఆఫీసు దినమున చెల్లించవలసి ఉంటుంది. **10)** పైన పేర్కొన్న కాలవ్యవధిలోగా ఏవేని చెల్లింపులు చేయుటలో డిఫాల్టిచెందిన సందర్భంలో, ఆస్తిని తాజా వేలం/ప్రైవేట్ ట్రీటి అమ్మకంకు పెట్టబడును. ధరావత్తుతోపాటు డిపాజిట్‌చేసిన మొత్తాలను **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**చే జప్తు చేయబడుతుంది మరియు డిఫాల్టి చెందిన కొనుగోలుదారు ఆస్తికి అన్ని క్లెయింలు పోగొట్టుకుందురు. **11)** ఆస్తికి సంబంధించి **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**కు తెలిసిన ఏవేని రుణభారాల వివరాలు: పై పట్టిక ప్రకారం ఉండును. ఆస్తి పన్ను, ఎలక్ట్రిసిటి బకాయిగల చట్టబద్ధమైన బాకీతోసహా ఆస్తిపైగల రుణభారాల గురించి ఆసక్తిగల బిడ్డరుదారు స్వంతగా స్వతంత్రంగా విచారణ చేసుసుకోవాల్సిందిగా సలహా ఇవ్వబడినది. **12) ఇ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణకు విధానం కొరకు లేదా ఏవేని ఇతర వివరాలకు నిర్ణీత బిడ్డరుదారులు వీరిని సంప్రదించవచ్చు: సర్వీస్ ప్రొవైడర్, మెసర్స్ 4 క్లోజర్, బ్లాక్ నెం.605 ఏ, 6వ అంతస్తు, మైత్రివనం కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500038, ఇమెయిల్:** info@bankauctions.in **లేదా మనిష్ బన్సాల్, ఇమెయిల్ ఐడి:** Manish.Bansal@tatacapital.com, **అధీకృత అధికారి, మొబైల్ నెం:858898 3696. వాట్సాప్ నెంబరు-9999078669 పై దయచేసి మీ ప్రశ్నను పంపండి. 13)** అత్యధిక ప్రకటించిన బిడ్ మొత్తంలో అత్యధిక బిడ్డరుదారుచే 1% టిడిఎస్ చెల్లించాలి. అవసరమైన చెల్లింపును యజమాని/ రుణగ్రహీతల పాన్‌లో అత్యధిక బిడ్డరుదారు డిపాజిట్‌చేయాలి మరియు చలాన్ కాపీని మా కంపెనీకి సమర్పించాలి. **14)** పై పేర్కొన్న వివరాలకు దయచేసి సెక్యూర్డ్ క్రెడిటర్ వెబ్‌సైట్: http://surl.li/lagxrh లో ఇవ్వబడిన దిగువ లింకును పరిశీలించవచ్చును. **15)** దయచేసి లింక్‌ను కూడాను దర్శించండి: https://www.tatacapital.com/property-disposal.html
**దయచేసి గమనించండి :** ఈ ఆస్తి యొక్క అమ్మకం/ వేలం కొరకు పేర్కొన్న వేలం పార్ట్నర్ కాకుండా ఎవరైనా బ్రోకర్/ ఏజెంట్‌ను టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ నియమించలేదు. ఈ విషయంలో అన్ని ప్రశ్నలు & విచారణ కొరకు క్రింది సంతకందారు లేదా అధీకృత అధికారిని మాత్రమే ఆసక్తిగల పార్టీలు సంప్రదించాలి.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేది : 27-01-2025

సం/- అధీకృత అధికారి,
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు కర్తవ్య పథ్‌కు రాష్ట్రపతి ముర్ముతో కలిసి గుర్రపు బగ్గీలో వస్తున్న ఇండోనేషియా అధ్యక్షులు ప్రబోవో సుబియాంతో

# రక్షణ, సముద్ర, సైబర్ రంగాల్లో సత్వర చర్చలు

● భారత్- ఇండోనేషియా అంగీకారం

**న్యూఢిల్లీ :** రక్షణ, సముద్ర, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సత్వర చర్చలకు భారత్- ఇండోనేషియా అంగీకరించాయి. ఈ మేరకు ఇరు దేశాలు ఆదివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. భారత్‌లో మూడు రోజుల పాటు సాగిన ఇండోనేషియా అధ్యక్షులు ప్రబోవో సుబియాంతో పర్యటన ఆదివారంతో ముగిసింది. పర్యటన ముగింపు సందర్భంగా ఈ ప్రకటన విడుదల చేశారు. ఇరు దేశాలు 2018లో ఇండోపసిఫిక్ సముద్ర సహకారంపై భాగస్వామ్య దృక్పథ ఒప్పందంపై సంతకంపై చేశాయి. ఈ నేపథ్యంలో దక్షిణ చైనా సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆయా దేశాలకు విజ్ఞప్తి చేశాయి. భారత్-ఇండోనేషియా వ్యూహాత్మక భాగస్వాములుగా సంయుక్త ప్రకటనలో పునరుద్ఘాటించారు. నాయకుల, మంత్రుల, సీనియర్ అధికారుల స్థాయిలో ద్వైపాక్షిక చర్చలను క్రమం తప్పకుండా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. రక్షణ ఒప్పంద సహకారాన్ని (డిసిఎ) రెండు దేశాల నాయకులు స్వాగతించినట్లు ఈ ప్రకటన తెలిపింది. ఈ డిసిఎతో రక్షణ బంధాలు మరింత బలపడతాయే విశ్వాసం వ్యక్తం చేశాయి.

ఇండోనేషియా బృందంతో చర్చలు జరుపుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉన్నతాధికారులు

## 100వ ప్రయోగానికి ఇస్రో సిద్ధం..!

● ప్రయోగ వేదికపైకి జిఎస్ఎల్‌వి 15ఎఫ్ రాకెట్..!

**శ్రీహరికోట :** భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో మైలు రాయికి సిద్ధమైంది. 29న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి వందో ప్రయోగం చేపట్టనున్నది. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌ను నింగిలోకి పంపనున్నది. ఈ రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని స్పేస్‌లోకి పంపనున్నది. జీఎస్ఎల్‌వీ-15 రాకెట్‌తో ఎన్‌వీఎస్ ఉపగ్రహం అనుసంధాన ప్రక్రియ పూర్తయ్యిందని ఇస్రో ఆదివారం పేర్కొంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొంది. ప్రయోగం సందర్భంగా కౌంట్‌డౌన్‌లో మూడురోజుల కంటే తక్కువ సమయం మాత్రమే మిగిలి ఉందని ఇస్రో పేర్కొంది. జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 15 రాకెట్ ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని భూస్థిర లక్ష్యంలో ప్రవేశపెడుతుందని పేర్కొంది. షార్‌లోని రెండో లాంచ్‌ప్యాడ్ నుంచి ప్రయోగం చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ ఉపగ్రహం సెకండ్ జెనరేషన్ శాటిలైట్ కాగా.. ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని 29 మే 2023న ఇస్రో నింగిలోకి పంపింది. ఇది ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం ఎన్‌వీఎస్ సిరీస్‌లో రెండో ఉపగ్రహం.

## అమెరికా హోమ్‌లాండ్ భద్రతా శాఖ మంత్రిగా క్రిస్టీ నోమ్

● ధ్రువీకరించిన సెనేట్

**వాషింగ్టన్ :** అమెరికా హోమ్‌లాండ్ భద్రతా శాఖ మంత్రిగా సౌత్ డకోటా గవర్నర్ క్రిస్టీ నోమ్ నియామకాన్ని సెనేట్ ధ్రువీకరించింది. నోమ్‌ను ఆంతరంగిక భద్రతా శాఖ మంత్రిగా ట్రంప్ చేసిన ఎంపికను సెనేట్ 59-34 ఓట్ల తేడాతో ఆమోదించింది. దక్షిణ సరిహద్దును భద్రంగా కాపాడడం, ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను సరిదిద్దాలన్న అధ్యక్షుడు ట్రంప్ లక్ష్యాలను నెరవేర్చడమే తన విధి అని ఆమె చెప్పారు.విదేశాంగ మంత్రి మార్కో రూబియో, సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ , రక్షణ మంత్రిగా పీట్ హెగ్‌సేత్ నియామకాన్ని సెనేట్ అంతకుముందే ధ్రువీకరించింది. పస్తుతం సెనేట్‌లో రిపబ్లికన్లకు 53 మంది సభ్యులు ఉండగా, డెమొక్రాట్లకు 47 మంది మాత్రమే ఉన్నారు. అధ్యక్ష నామినేషన్‌ను నిర్ధారించడానికి, సాధారణ మెజారిటీ ఉంటే చాలు.

## అన్న వెంటే తమ్ముడు

● ఆరు గంటల వ్యవధిలో మృతి

**ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్**

ఆరు గంటల వ్యవధిలో అన్నాదమ్ముళ్ళు మృతి చెందిన సంఘటన పార్వతీపురం మండలం పులిగుమ్మిలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... పులిగుమ్మి గ్రామానికి చెందిన మడక అప్పలస్వామి (90) ఇటీవల భార్యను కోల్పోయి, పిల్లలు లేకపోవడంతో తమ్ముడు సింహాచలం పోషణలో ఉంటున్నారు. శనివారం రాత్రి అన్న అప్పలస్వామి మృతి చెందడంతో ఆయనకు దహన సంస్కారాలు జరిపేందుకు సన్నాహాలు చేస్తుండగా ఇంతలో తమ్ముడు సింహాచలం కూడా హఠాత్తుగా మరణించడంతో గ్రామంలో కలకలంతోపాటు దుఃఖ వాతావరణం నెలకొంది. అందరికీ ఆదర్శంగా ఉండే అన్నదమ్ములు ఆరు గంటల కాలంలోనే మృతి చెందడంతో గ్రామస్తులు విస్మయం చెందారు. ఆదివారం ఉదయం వారి ఇరువురికీ పక్కపక్కనే దహన సంస్కారాలు నిర్వహించారు. చావులోనూ ఒకరికొకరు తోడుగా ఉన్న అన్నదమ్ముల అనుబంధాన్ని బంధువులు గుర్తు చేసుకుంటూ దుఃఖిస్తున్నారు. మృతుల కుటుంబానికి సర్పంచ్ బేత బాల కుమారి, వెంకటరమణ బాసటగా నిలిచి తదుపరి కార్యక్రమాలు నిర్వహించారు.

## సి.కె.నాయుడు ట్రోఫీ మ్యాచ్ ప్రారంభం

● మొదటి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకు ఆంధ్ర ఆలౌట్

**ప్రజాశక్తి - కడప**

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో శనివారం కల్నల్ సి.కె. నాయుడు ట్రోఫీ అండర్-23 మల్టీ డే స్టేట్ మ్యాచ్‌లో భాగంగా ఆంధ్ర, పంజా బ్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన పంజాబ్ జట్టు ఫీల్డింగ్ ఎంచు కుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 83.0 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఆంధ్ర జట్టులోని తేజ 157 బంతులను ఎదుర్కొని 8 బౌండరీల సహాయంతో 70 పరుగులు చేశాడు. ప్రసాద్ 27, రేవంత్ రెడ్డి 23 పరుగులు చేశారు. పంజాబ్ జట్టులోని క్రిష్ బగట్ 4, ఆర్యమన్ దలివాల్ 2, అభయ్ చౌదరి 2 వికెట్లు తీసుకున్నారు.

## నష్టాల బారిన చామంతి రైతులు

**ప్రజాశక్తి- కడియం**

ఏడాదిపాటు ఎదురు చూసిన సరదాల సంక్రాంతి పండుగ వెళ్లిపోయింది. కానీ, చామంతి సాగు రైతులకు నష్టాలు మిగిల్చింది. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా ఇళ్లు, కార్యాలయాలు అలంకరణకు చామంతి మొక్కలను విరివిగా కొనుగోలు చేస్తుంటారు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన కడియం నర్సరీల నుండి ఏటా లక్షలాది మొక్కలు అమ్మకాలు జరుగుతాయి. ఈ ప్రాంత నర్సరీ రైతులు ఈ సీజన్లో చామంతి మొక్కలను అధికంగా ఉత్పత్తి చేస్తారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో అధిక శాతం మొక్కలు వికసించాయి. ఉత్పత్తి పెరిగినా అమ్మకాలు తగ్గాయి. కాని నర్సరీ రైతులకు తీవ్ర నష్టాలు మిగిల్చాయి. ఇవి నెలలు తరబడి జీవించే మొక్కలు కాకపోవడం, శీతాకాలంలో మంచు బిందువులు పడుతున్నంత కాలం మాత్రమే చామంతులు వికసిస్తాయి. అనంతరం ఎండిపోతాయి. సీజన్ అయిపోతున్నా మొక్కలు అమ్మకాల జరగక రైతులు లబోదిబోమంటున్నారు.

# అరుణపతాకమా.. రెడ్ సెల్యూట్

● సిపిఎం జెండాను ఎగురవేసిన మాజీ ఎంపి మిడియం బాబురావు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సంగారెడ్డిలోని సీతారాం ఏచూరినగర్‌లో సిపిఎం నాలుగో రాష్ట్ర మహాసభల ప్రారంభ సూచికగా ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి మిడియం బాబూరావు అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మోహన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నారులు 'ఓ అరుణ పతాకమా.. మా ఆశయాల నవచేతనమా..రెడ్ సెల్యూట్..రెడ్ సెల్యూట్..లాల్ సలాం..లాల్ సలాం' పాటకు శాస్త్రీయ నత్యాన్ని ప్రదర్శించారు. వారి ప్రదర్శన ఆసాంతం ఆకట్టుకుంది. తదనంతరం అమరవీరుల స్థూపానికి సిపిఎం కోఆర్డినేటర్, పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్, పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్, బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు కె హేమలత, అరుణ్ కుమార్, పుణ్యవతి, జి.నాగయ్య, చెరిపెల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య, టి.సాగర్, డిజి నర్సింహారావు, జాన్‌వెస్లీ, జ్యోతి, చుక్క రాములు, మల్లు లక్ష్మి, పాలడుగు భాస్కర్, పి.ప్రభాకర్, అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు, మహాసభల ప్రతినిధులు నివాళు లర్పించారు.

విజయవాడలో జరిగిన గణతంత్ర వేడుకల్లో రెండో బహుమతి సాధించిన ఉద్యానశాఖ (నాణ్యమైన ఉత్పత్తులు బ్రాండింగ్) శకటం, మూడో బహుమతి ఎంఎయుడి, పిఆర్ అండ్ ఆర్‌డి శకటాలతో కలిసి సంయుక్తంగా పంచుకున్న సిఆర్‌డిఎ శకటం

# రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా గణతంత్ర వేడుకలు

**ప్రజాశక్తి-యంత్రాంగం**

గణతంత్ర దినోత్సవ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఉత్తమ సేవకులకు ప్రభుత్వం పురస్కారాలను ప్రధానం చేసింది. అధికారులు గౌరవ వందనం చేసి తమ దేశభక్తిని చాటుకున్నారు. విశాఖ పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. శకటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తిని, దేశ సమగ్రతను చాటి చెప్పాయి. వివిధ రకాల ఉత్పత్తులను, కార్యక్రమాలను, సాధించిన ప్రగతిని వివరిస్తూ వ్యవసాయ, పశుసంవర్ధక, హార్టికల్చర్, ఎపిఎంఐపి, మత్స్యశాఖ, ఐసిడిఎస్, డ్వామా, ఎస్‌సి, బిసి, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. 446 మందికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ విజయకృష్ణన్ జెండా ఎగురవేశారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో తలారి సింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మైదానంలో జరిగిన వేడుకల్లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కర్నూలు పోలీస్ పరేడ్ మైదానంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర సమరయోధుల వారసులను సన్మానించారు. ప్రదర్శించిన పలు శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఉత్తమ సేవలందించిన అధికారులకు, ఉద్యోగులకు ప్రసంశాపత్రాలను అందజేశారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెరేడ్ మైదానంలో ఘనంగా జరిగాయి. ముఖ్యతిధిగా కలెక్టర్ జి.రాజకుమారి పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేసి రాష్ట్రీయ సెల్యూట్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాతో కలిసి మైదానంలో పెరేడ్‌ను పరిశీలించారు. జిల్లాలో అత్యుత్తమ సేవలు అందించిన 9 శాఖలకు జిల్లా కలెక్టర్ రోలింగ్ షీల్డ్‌లను అందజేశారు.

రాజమహేంద్రవరంలో నిర్వహించిన వేడుకల్లో 'ప్రధాన మంత్రి సూర్యఘర్' శకటం

ప్రకాశం జిల్లా ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియా, బాపట్లలో కలెక్టర్ జె.వెంకటమురళి జాతీయ జెండాను ఆవిష్కరించారు. నెల్లూరు కలెక్టర్ ఒ.ఆనంద్ జాతీయజెండాను ఆవిష్కరించి.. పేదరిక నిర్మూలన, మౌలిక సౌకర్యాల అభివృద్ధి, వనరుల సమర్ధ నిర్వహణ గురించి వివరించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ పి.ప్రశాంతి, కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ మహేష్‌కుమార్ పాల్గొన్ని త్రివర్ణ పతాకాలను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీసులు, అగ్నిమాపక దళం, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, సిఆర్‌పిఎఫ్ బెటాయిన్లు కవాతు నిర్వహించారు. పలుశాఖల శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీకాకుళంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పతాకావిష్కరణ చేసి సాయుధ పోలీసు దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జలవనరులు, జలజీవన్ మిషన్, ఇపిడిసిఎల్, డ్వామా, నగరపాలక సంస్థ, అన్న క్యాంటీన్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, విపత్తులు, అగ్ని మాపక శాఖల శకటాలను ప్రదర్శించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పలు శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి.

వైజాగ్ వెలాసిటీ-3 జట్టుకు ట్రోఫీ అందచేస్తున్న భాష్యం రామకృష్ణ తదితరులు

# ముగిసిన భాష్యం క్రికెట్ పోటీలు

**ప్రజాశక్తి-గుంటూరు**

నేటి యువత వారి శక్తిని సరైన మార్గంలో వినియోగిస్తే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. గుంటూరులోని జెకెసి కాలేజి మైదానంలో భాష్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో వైజాగ్ వెలాసిటీ-3 జట్టు, హైదరాబాద్ హైలాండర్స్-2 జట్టుతో తలపడగా వైజాగ్ వెలాసిటీ-3 జట్టు విజేతగా నిలిచి ఛాంపియన్‌షిప్‌ను చేజిక్కించుకుంది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించటానికి ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. గెలుపొందిన జట్టుకు రామకృష్ణతోపాటు, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌రామ్ చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు.

ఆల్‌రౌండర్లు శశాంక్, నీరజ్‌కు రామోజీరావు టాలెంట్ అవార్డ్స్ పేరుతో రూ.5 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య సలహాదారు మైఖేల్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హుస్సేన్ సాగర్‌లో అగ్ని ప్రమాదం

● బాణసంచా పేలి 2 బోట్లు దగ్ధం

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లో రెండు బోట్లలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బాణసంచా పేలి రెండు పడవల్లో మంటలు చెలరేగి దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా గ్రౌండ్స్‌లో భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా బాణాసంచా కాల్చారు. బాణసంచా అదుపు తప్పి సాగర్‌లో ఉన్న రెండు బోట్లపై పడి మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా వ్యాపించిన మంటల్లో రెండు బోట్లు కాలిపోయాయి. ప్రమాద సమయంలో బోట్లలో సుమారు 20 మంది ఉండగా, ఇద్దరికి గాయాలైనట్టు సమాచారం. మహాహారతి కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సంగీత దర్శకులు ఎంఎం.కీరవాణి పాల్గొన్నట్టు తెలుస్తోంది.

## కామన్వెల్త్ దేశాల్లో... భారత్‌లోనే క్యాన్సర్ కేసులు అధికం

**న్యూఢిల్లీ :** కామన్వెల్త్‌లోని ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లోనే క్యాన్సర్ ఉనికి అధికంగా ఉంది. 2008-2018 మధ్య కాలంలో దేశంలో క్యాన్సర్ నిర్ధారణ అయిన రోగుల సంఖ్య 35 శాతం పెరిగింది. భారత్‌లో ప్రతి తొమ్మిది మందిలోనూ ఒకరు తన జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఉపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్లు సర్వసాధారణమై పోయాయి. ఇక్కడ ఆందోళన కలిగించే ముఖ్య విషయమేమంటే భారత్‌లో క్యాన్సర్ కేసుల సంఖ్య అంతర్జాతీయ సగటును కూడా దాటిపోయే అవకాశాలు కన్పిస్తున్నాయని లాన్సెట్ అంకాలజీలో ఇటీవల ప్రచురితమైన ఓ పత్రం తెలిపింది. 2020లో దేశంలో 1.39 మిలియన్లుగా ఉన్న క్యాన్సర్ రోగుల సంఖ్య ఈ ఏడాది చివరి నాటికి 1.57 మిలియన్లకు చేరుకుంటుందని పత్రం సహ రచయిత డాక్టర్ భావనా సిరోహి తెలిపారు.

మన దేశంలో క్యాన్సర్ కేసుల్లో సుమారు 40 శాతం వరకూ పొగాకు వినియోగం కారణంగా నమోదవుతున్నవే. పొగాకు వినియోగంతో ఊపిరితిత్తులు, నోరు, గొంతు క్యాన్సర్లు వచ్చే ప్రమాదం అధికంగా ఉంది. ఆహారం సరిగా తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం వల్ల 10 శాతం కేసులు నమోదవుతాయని డాక్టర్ భావనా సిరోహి చెప్పారు. ఆమె ఛత్తీస్‌గఢ్‌లోని నయా రాయపూర్‌లో వేదాంత మెడికల్ రిసెర్చ్ ఫౌండేషన్ వైద్య డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

యాభై ఆరు కామన్వెల్త్ దేశాల్లో క్యాన్సర్ మహమ్మారి ఉనికి కన్పిస్తోందని, 2008-2018 మధ్యకాలంలో ఈ దేశాల్లో క్యాన్సర్ వ్యాధిగ్రస్థుల సంఖ్య 35 శాతం పెరిగిందని కామన్వెల్త్‌లోని లాన్సెట్ అంకాలజీ కమిషన్‌లో ప్రచురితమైన పత్రం తెలియజేస్తూ ఇది ఆందోళన కలిగించే పరిణామమని చెప్పింది. ఆస్ట్రేలియా, కెనడా వంటి పెద్ద దేశాల్లోనూ, భారత్ వంటి అధిక జనాభా కలిగిన దేశాల్లోనూ, బార్బడాస్, బ్రూనై వంటి చిన్న దేశాల్లోనూ క్యాన్సర్ ఉనికి అధికంగా ఉందని, ఈ మహమ్మారిపై పోరాడేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఆ పత్రం సూచించింది.

## జమ్ముకాశ్మీర్ సర్కారు వివాదాస్పద ఉత్తర్వులు

● ఎబివిపి కార్యక్రమానికి విద్యార్థులను పంపాలంటూ ఆదేశం

● తప్పుబట్టిన పిడిపి, విద్యార్థి సంఘాలు

**జమ్మూకాశ్మీర్ :** ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యార్థి విభాగం ఎబివిపి చేపట్టిన ఒక కార్యక్రమం సందర్భంగా జమ్ముకాశ్మీర్ ప్రభుత్వం వివాదాస్పద ఆదేశాలను జారీ చేసింది. సదరు కార్యక్రమానికి టీచర్లు, విద్యార్థులను పంపించాలంటూ పూంచ్ విద్యాశాఖను ఆదేశించింది. దీంతో జమ్ముకాశ్మీర్ యంత్రాంగం తీరుపై విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇది రాజకీయంగానూ దుమారం రేపుతున్నది. ఈ చర్యను పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి), విద్యార్థి సంఘాలు తప్పుబట్టాయి. దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశాయి.

గణతంత్ర దినోత్సవానికి ముందు ఈనెల 23న ఎబివిపి పూంచ్‌లో 'తిరంగ' ర్యాలీని చేపట్టింది. జమ్ముకాశ్మీర్ ప్రభుత్వం ఆదేశాలతో ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ ర్యాలీకి ముందు రోజే ఆదేశాలు జారీ అయ్యాయి. ఇద్దరు టీచర్లతో 40 నుంచి 50 మంది విద్యార్థులను పంపించాలంటూ ఆ ఆదేశాల్లో ఉన్నది. ఎబివిపి సైద్ధాంతిక కార్యక్రమానికి హాజరయ్యేలా నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం విద్యార్థులను బలవంతం చేసిందని పిడిపి ఆరోపించింది. ఈ ఘటనపై విచారణ జరిపించాలని పూంచ్‌లోని ఒక ప్రముఖ ట్రైబల్ స్టూడెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఇలాంటి ఆదేశాలు ఎలా ఇస్తారని గుజ్జర్ బకెర్వాల్ స్టూడెంట్స్ అలయన్స్ దర్యాప్తునకు డిమాండ్ చేసింది. దీంతో జమ్మూకాశ్మీర్‌లో విద్యా శాఖ పనితీరు, దాని కార్యకలాపాలపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ఎన్నికైన ప్రభుత్వం తీరు కూడా ఇప్పుడు విమర్శలపాలవుతున్నది. బిజెపికి సానుకూలంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు ఎదుర్కొంటోంది.

## రిపబ్లిక్ డే వేడుకలకు వెళ్తుండగా వ్యాన్ బోల్తా

విద్యార్థి మృతి, మరో 23 మందికి తీవ్రగాయాలు

**భువనేశ్వర్:** గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి వెళ్తున్న విద్యార్థుల వ్యాన్ బోల్తా పడటంతో ఒకరు మరణించగా, డ్రైవర్‌తో సహా 23 మంది గాయపడ్డారు. ఒడిశాలోని సుబర్ణపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అథాగఢ్‌లోని నార్త్ బంకి మాలా బీహార్‌పూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు సారందా మైదానానికి వ్యానులో బయలుదేరారు. ఆ వాహనం ముందు టైర్ వదులుగా ఉండటంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో ఆ వ్యాను బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒక విద్యార్థి అక్కడికక్కడే మరణించాడు. డ్రైవర్, ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా, మిగతా విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని కటక్‌లోని ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

## బడి బస్సు బోల్తా ... నలుగురు విద్యార్థులకు గాయాలు

**ప్రజాశక్తి - రాయదుర్గం (అనంతపురం జిల్లా)**

అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండలం గోనబావి గ్రామం వద్ద ఆదివారం ఉదయం ప్రయివేటు పాఠశాలకు చెందిన బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా రాయదుర్గం పట్టణంలోని ఎవిఆర్ పాఠశాలకు చెందిన బడి బస్సు విద్యార్థులను తీసుకొని గోనబావి నుండి వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగినప్పుడు బస్సులో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ బస్సును వదిలి పరారయ్యాడు. స్థానికులు గాయపడిన విద్యార్థులను రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఎఐవైఎఫ్ నాయకులు, సిపిఎం, సిపిఐ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. పాఠశాలల యాజమాన్యాలు కండిషన్లో లేని బస్సులను కర్నాటక రాష్ట్రం నుండి తెచ్చి వాటికి పెయింట్ చేయించి వాటిని రోడ్లలో తిప్పుతున్నారని విమర్శించారు. గుమ్మగట్ట రోడ్డులో ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు పోటాపోటీగా అతి వేగంగా నడుపుతుంటారని స్థానికులు విమర్శించారు. ఈ ఘటన వల్ల విద్యార్థులకు జరగరానిది ఏదైనా జరిగితే దానికి బాధ్యులు ఎవరని విద్యార్థి సంఘాల నాయకులు నిలదీశారు. పాఠశాలను, బస్సును సీజ్ చేయాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొట్రేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు అనిల్, సిపిఎం నాయకులు మల్లికార్జున, మధు, సిపిఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో ఎఐకెఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ


పంజాబ్‌లో అన్నదాతల చేపట్టిన భారీ ట్రాక్టర్ ర్యాలీ

# ఎంఎస్‌పి చట్టం కోసం కదం తొక్కిన రైతన్న

- దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వాహన ర్యాలీలు
- అగ్రికల్చర్ ఫ్రేమ్‌వర్క్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల పతాక రెపరెపల సాక్షిగా అన్నదాతలు కదంతొక్కారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే దిశగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సాగిస్తున్న కుట్రలపై కష్టజీవులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అసేతుహిమచలం నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో వివిధ రూపాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు ట్రాక్టర్, బైక్, ఇతర వాహనాలతో ర్యాలీలు చేపట్టారు. వీరికి మద్దతుగా కార్మిక, ప్రజా సంఘాలు కూడా ప్రదర్శనలు నిర్వహించాయి. వ్యవసాయ ఉత్పత్తులన్నిటికీ కనీస మద్దతు ధర కల్పించేలా చట్టం తీసుకురావాలని ముక్తకంఠంతో శ్రమజీవులు నినదించారు. అన్నదాతల మహోద్యమ ఫలితంగా రద్దు చేసిన మూడు చీకటి వ్యవసాయ చట్టాల స్థానంలో వాటి కంటే దుర్మార్గమైన రీతిలో నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్ (ఎన్‌పిఎఫ్ఎఎం) ముసాయిదాను మోడీ సర్కార్ తెరమీదకు తీసుకొచ్చిందని, దీనిని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ రంగ ప్రయివేటీకరణను విరమించుకోవాలని నినదించారు. ఒకవైపు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించకుండా, మరోవైపు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పాలకులు తీసుకొచ్చిన విధానాల ఫలితంగా అప్పుల ఊబిలో చిక్కుకుపోయిన అన్నదాతలందరికీ రుణ మాఫీ చేయాలని కోరారు.

మోడీ సర్కార్ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గణతంత్ర దినోత్సవం రోజున దేశవ్యాప్తంగా ట్రాక్టర్స్ ర్యాలీ చేపట్టాలని ఈ నెల 8న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎస్) పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ పిలుపులో భాగంగా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, బీహార్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో రైతులు ట్రాక్టర్స్ ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో ట్రాక్టర్లతో పాటు బైక్, మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు ఈ ర్యాలీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్రం తీరును నిరసించారు. వీరికి మద్దతుగా కార్మికులు, యువత, విద్యార్థులు, మహిళలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎన్‌పిఎఫ్ఎఎం రద్దు చేయకపోతే రైతులు అఖిల భారత గ్రామీణ హర్తాళ్ నిర్వహించాల్సివుంటుందని ఎస్‌కెఎం హెచ్చరించింది. మార్చి 5 నుండి రాష్ట్ర కేంద్రం, జిల్లా, సబ్ డివిజన్ స్థాయిలో ఆందోళనలు కొనసాగుతాయని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు కృష్ణప్రసాద్ తెలిపారు. అలాగే ఫిబ్రవరిలో పార్లమెంటు సభ్యుల నివాసాలు, కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కాగా, 2024 ఫిబ్రవరి 13 నుంచి పంజాబ్, హర్యానా సరిహద్దులోని ఖనౌరిలో రైతులు నిరసన కొనసాగిస్తున్నారు. పంటలకు కనీస మద్దతు ధరతోపాటు రుణ మాఫీ, రైతులు, కార్మికులకు పెన్షన్లు, 2021లో లఖింపూర్ ఖేరీ హింసా బాధితులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. కేంద్రం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే గతంలో ఢిల్లీ సరిహద్దుల్లో చేపట్టిన నిరసనల కంటే విస్తృతంగా దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని ఎస్‌కెఎం హెచ్చరించింది.

## ‘కృత్రిమ మేధ’తో కుంచించుకుపోతున్న ఐటి కొలువులు

- ప్రముఖ కంపెనీల్లో భారీ కోతలు

**న్యూఢిల్లీ :** కృత్రిమ మేధ (ఎఐ) కారణంగా సాంకేతిక కొలువులు తగ్గిపోతున్నాయి. శ్రామిక శక్తి స్థానాన్ని ‘సాంకేతికత’ ఆక్రమిస్తోంది. లాభాలనే ధ్యేయంగా చూసే కంపెనీలు ఉద్యోగుల స్థానంలో ఎఐ టూల్స్‌ను వినియోగించడం క్రమేపి పెంచుకుంటూపోతున్నాయి. దీనివల్ల ఐటి కంపెనీల్లో ఉద్యోగాల సంఖ్య భారీగా తగ్గిపోతోంది. ఐటి క్రేజీ విపరీతంగా ఉన్న భారత్‌లో దీని ప్రభావం తీవ్రమవుతోంది. వివిధ అధ్యయనాల ప్రకారం..ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో నియామకాల డ్రైవ్స్ కూడా అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. గత రెండేళ్లలో ఐఐటీలతో సహా ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ ప్రాంగణ నియామకాలు భారీగా తగ్గాయి. అమెరికా, యూరోపల నుంచి మన ఐటీ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులు తగ్గడం ఇందుకు ఒక కారణమైతే, కతిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి సరికొత్త టెక్నాలజీలు ఇందుకు మరో కారణం.

**గణనీయమైన మార్పులు...**

ఉద్యోగ నియామకాల్లో, తొలగింపుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో మొదటి ఐదు భారతీయ ఐటీ సంస్థల్లో నికరంగా 2,587 మంది ఉద్యోగులు తగ్గారు. గత త్రైమాసికంతో పోలిస్తే ఇది పూర్తిగా విరుద్ధం. సెప్టెంబర్ త్రైమాసికంలో 15,033 మంది ఉద్యోగులు పెరిగారు. గడచిన మూడు నెలల కాలంలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్‌టెక్ 7,725 మంది ఉద్యోగులను పెంచుకోగా, టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్రా కంపెనీలు మాత్రం ఉద్యోగులను తగ్గించాయి. 2024 ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలోనూ పాత పద్ధతే కనిపించింది. ఐటీ సంస్థలు సమిష్టిగా 12,600 ఉద్యోగాలను తగ్గించాయి. అంతకు క్రితం ఆర్థిక సంవత్సరంలో ఐటీ రంగం 60,000 మంది ఉద్యోగులను జోడించిన క్రమంలో వెంటనే ఈ స్థాయిలో ఉద్యోగులు తగ్గడం గమనార్హం.

**నాలుగింట ఒక వంతు కంటే తక్కువ శ్రామిక శక్తి ...!**

గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ (జిసిసి) ద్వారా వృద్ధి పెరుగుతున్న నేపథ్యంలో ... 2025 ఆర్థిక ఏడాదిలో ఐటీ రంగం గత ఆర్థిక సంవత్సరం శ్రామికశక్తిలో నాలుగింట ఒక వంతు కంటే తక్కువగానే జతవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వర్క్‌ఫోర్స్ జోడింపులో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు వరుసగా రెండవ సంవత్సరం కూడా సాంప్రదాయ ఐటీ సంస్థలను అధిగమిస్తాయని భావిస్తున్నారు.

**ఇమ్మిగ్రేషన్ విధానాల్లో మార్పులు..**

అమెరికాలో వచ్చిన కొత్త పరిపాలనలో హెచ్ వన్ బీ (హెచ్ వన్ బి) వీసా, గ్రీన్ కార్డ్ నిబంధనలతో సహా ఇమ్మిగ్రేషన్ విధానాలు మారవచ్చు కాబట్టి యూఎస్‌లోని భారతీయ ఐటీ నిపుణులు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. కొంతమంది నిపుణులు యూరప్ వంటి దేశాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నారు. అనిశ్చితి ఉన్నప్పటికీ నైపుణ్యం కలిగిన నిపుణులను నియమించుకునేందుకు యూఎస్ కంపెనీలు ప్రయత్నిస్తాయని ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

## మణిపూర్‌లో నలుగురి అరెస్టు

**ఇంఫాల్ :** హింసాకాండ ప్రారంభమై రెండేళ్లు దాటుతున్నా మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు ఇంకా నెలకొనలేదు. రాష్ట్రంలో రెండు వేర్వేరు ఆపరేషన్లలో నలుగురు ఆందోళనకారుల్ని అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాల్లో పిఆర్ఇపిఎకె (ప్రొగ్రెసివ్)కు చెందిన ఇద్దరు క్రియాశీల సభ్యుల్ని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వీరిని రిషికుమార్ సింగ్ (24), లాంగ్‌జామ్ న్గంతోయిబా (22)గా గుర్తించారు. వీరి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రెండు పిస్టల్స్, మ్యాగజైన్లు, ఒక నాలుగు చక్రాల వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరు ఇంఫాల్, తౌబాల్‌ల్లో దోపిడీలకు పాల్పడుతున్నారని పోలీసులు చెప్పారు.

అలాగే చురచాంద్ పూర్ జిల్లాలో యుకెఆర్ఎ గ్రూపునకు చెందిన మరో ఇద్దర్ని పోలీసులు అరెస్టు చేశారు. మౌంజాంగ్ గ్రామంలో అదుపులోకి తీసుకున్న వీరిని థాంగ్రెంగ్ సాంగ్ కోమ్ (45), ఎల్ వాషింగ్టన్ కోమ్ (42)గా గుర్తించారు. వీరు మాజీ సైనికులని బలవంతంగా దోపిడీలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## ప్రస్తుత పాలక శక్తులతోనే రాజ్యాంగానికి ముప్పు

- గణతంత్ర దినోత్సవ సందేశంలో ప్రకాశ్ కరత్
- రాజ్యాంగ రక్షణ కోసం పునరంకితమవ్వాలని పిలుపు

**న్యూఢిల్లీ :** లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదాన్ని వ్యతిరేకించే శక్తులు నేడు అధికారంలో ఉన్నాయని రాజ్యాంగానికి ప్రస్తుతం అదే ముప్పుగా మారిందని సిపిఎం నాయకులు ప్రకాశ్ కరత్ విమర్శించారు. రిపబ్లిక్ డే స్ఫూర్తిగా మనమంతా రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి పునరంకితమవ్వాలని పిలుపు ఇచ్చారు. రిపబ్లిక్ డే సందేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రకాశ్ కారత్ రిపబ్లిక్ డే ప్రసంగం పూర్తి వివరాలు...

ఈ గణతంత్ర దినోత్సవం ఒక ముఖ్యమైన రోజు ఎందుకంటే ఇది భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు, మన లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రానికి ఆధారాన్ని అందించినదే రాజ్యాంగం. ఈ 75 సంవత్సరాల కాలంలో, భారతదేశం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ అభివృద్ధి చెందడం చూశాము. లౌకిక, ప్రజాస్వామ్య, సమాఖ్య సూత్రంపై రచించిన రాజ్యాంగం కారణంగానే ఇప్పటి వరకూ మనం దేశాన్ని ఐక్యంగా ఉంచగలిగాం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోగలిగాము. రాజ్యాంగ నిర్మాతలు రూపొందించినవారు మన దేశాన్ని ప్రగతిశీల, సమ్మిళిత, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ఉండాలని భావించారు. అయితే నేడు రాజ్యాంగ మనుగడ ముప్పులో ఉంది. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదానికి విరుద్ధమైన శక్తులు నేడు రాజ్యాధికారంలో ఉండడమే రాజ్యాంగానికి ముప్పు కలిగిస్తోంది. ఒకవైపు, ప్రస్తుత సమాజంలోని వైవిధ్యం, బహుళత్వ స్వభావాన్ని అంగీకరించ హిందూత్వ శక్తులు ఉన్నాయి. వీరు దేశ ఐక్యత, వైవిధ్యాన్ని బలహీన పరుస్తున్నారు. లౌకిక వాదాన్ని వ్యతిరేకించే శక్తులకు సమాజంలో, ప్రభుత్వ సంస్థలలో అధికారం ఇచ్చారు.

మరొక అంశం ఏమిటంటే, ఆదేశిక సూత్రాలతో ప్రభుత్వం సంపదల్లో అసమానతలను తగ్గించడానికి కృషి చేయాలని, సామాజిక న్యాయం ఉండాలని రాజ్యాంగం పేర్కొంది. అయితే గత దశాబ్దంలో అన్ని వనరులను కేంద్రీకరించి కార్పొరేట్లు చేతుల్లో పోయడం ద్వారా ఈ ఆదర్శాలు కూడా బలహీనపడ్డాయి. ఇది మన సమాజంలో తీవ్ర అసమానతలకు దారితీస్తోంది. రాజ్యాంగంలో నిర్దేశించిన ఆదేశిక సూత్రాలకు విరుద్ధంగా నేటి పాలన ఉంది.

ప్రజలకు సామాజిక, ఆర్థిక సమానత్వం లేనప్పుడు, అలాగే సామాజిక-ఆర్థిక అసమానతలు పెరిగేకొద్దీ రాజకీయ సమానత్వం- రాజకీయ ప్రజాస్వామ్యం కూడా బలహీనపడతాయి. ప్రజాస్వామ్యం స్థానంలోకి నిరంకుశత్వం వస్తుంది. ఈ 75వ వార్షికోత్సవం సమయంలో గణతంత్రం ఎదుర్కొంటున్న సవాళ్లు ఇవే. కాబట్టి మన రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్న ఆదర్శాలను కాపాడుకోవడానికి అన్ని ప్రజాస్వామ్య, లౌకిక, ప్రగతిశీల శక్తులు కలిసి రావడం చాలా అవసరం. గణతంత్ర దినోత్సవం అంటే కేవలం ఉత్సవ కవాతులు, సంబరాలే కాదు. లౌకిక, ప్రజాస్వామ్య భారతదేశంలో మనం నిరంతరం కృషి చేస్తూ, పోరాడుతూనే ఉంటామని ప్రతినపూనడం కూడా. సోషలిజం అనే లక్ష్యం ఉన్న రాజ్యాంగం వైపు మనం ముందుకు సాగుతామనే ప్రతిజ్ఞ చేయడానికి, మనల్ని మనం తిరిగి పునరంకితం చేసుకోవడానికి గణతంత్ర దినోత్సవం సందర్భం కావాలి.

## ఒకే దేశం, ఒకే పార్టీ రుద్దే యత్నం

- కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరుపై ఖర్గే

**న్యూఢిల్లీ :** దేశంలో 140 కోట్ల మంది ప్రజలపై ‘ఒకే దేశం, ఒకే పార్టీ’ని రుద్దేందుకు బిజెపి యత్నిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అధికార పార్టీ నుండి రాజ్యాంగం నిరంతరం దాడికి గురవుతోందని మండిపడ్డారు. ఆదివారం 76వ గణతంత్ర వేడుకల సందర్భంగా ఆయన ఓ సందేశాన్ని విడుదల చేశారు.

భిన్నత్వంలో ఏకత్వాన్ని విశ్వసించే 140 కోట్ల విభిన్న ప్రజలపై ‘ఒకేదేశం, ఒకే పార్టీ ’ విధించే అంతర్లీన ధోరణి కొనసాగుతోందని అన్నారు. కేంద్ర వైఫల్యాలను ఎత్తిచూపినప్పుడల్లా, ద్వంద్వ ప్రమాణాలను తీసుకురావడం, దారి మళ్లించే వ్యూహాలకు పాల్పడటం లేదా ప్రజావేగులను జాతీయ వ్యతిరేకులుగా ముద్ర వేయడం చేస్తోందని అన్నారు. స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థల్లో రాజకీయ జోక్యం ఆనవాయితీగా మారిందన్నారు. సమాఖ్య విధానాన్ని రోజురోజుకి తుంగలో తొక్కి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని పేర్కొన్నారు. పాలక ప్రభుత్వ నిరంకుశ ధోరణి కారణంగా పార్లమెంటు పరితీరు పడిపోయిందని అన్నారు.

యూనివర్శిటీలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు నిరంతరం చొరబాటుకు గురవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని వనరులను అధికారంలో ఉన్నవారి బిలియనీర్ స్నేహితులకు అప్పగించడంతో ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని అన్నారు. బిజెపి సూడో జాతీయవాదం పాటిస్తోందని దుయ్యబట్టారు. అధికార పార్టీ నకిలీ జాతీయ వాదాన్ని పాటిస్తూ వెనుకబడిన వర్గాలకు చెందిన యువతను జాతీయవాదం, మత ఆధిపత్యం జెండాలను మోసేలా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రానికి జవాబుదారీతనం లేదని మణిపూర్ అంశం తెలియజేస్తోందని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కా వాలని, ఇదే మన పూర్వీకులకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

## సూడాన్ ఆసుపత్రిపై దాడిలో 70 మంది మృతి

- డబ్ల్యుహెచ్ఓ వెల్లడి

**ఖర్తూమ్:** పశ్చిమ సూడాన్‌లోని ఎల్-ఫాషర్‌లో ప్రధాన ఆసుపత్రిపై ఇటీవల జరిగిన దాడిలో 70 మంది దాకా మరణించారని, మరో 19 మంది గాయపడ్డారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) చీఫ్ టెడ్రోస్ అధనామ్ గెబ్రేయేసస్ ఆదివారం వెల్లడించారు. ఈ భయంకర దాడిలో చనిపోయినవారిలో రోగులే ఎక్కువ మంది ఉన్నట్లు ఆయన ఎక్స్‌లో పెట్టిన పోస్ట్‌లో తెలిపారు. దాడి సమయంలో ఆసుపత్రి చికిత్స పొందుతున్న రోగులతో నిండిపోయిందని అన్నారు, ఈ దాడిని సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. ఈ చర్యను అంతర్జాతీయ చట్టాల, మానవ హక్కుల ఉల్లంఘనగా అది పేర్కొంది. ఏప్రిల్ 2023 నుండి, సుడాన్ ఆర్మీ చీఫ్ అబ్దేల్ ఫత్తా అల్-బుర్హాన్ , అతని మాజీ డిప్యూటీ, పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ దళాల నాయకుడు మొహమ్మద్ హమ్దాన్ డాగ్లో మధ్య క్రూరమైన పోరు నడుస్తోంది. ఈ అంతర్యుద్ధంలో ఇంతవరకు పదివేల మంది వరకు చనిపోయారు. కోటి 20 లక్షల మంది వరకు ప్రజలు నిరాశ్రయులయ్యారు.మరో వైపు దేశంలోని కొన్ని ప్రాంతాలు కరువు కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి.

## ‘గాజా ప్రక్షాళన’ పేరుతో అక్కడ తిష్టవేసేందుకు ట్రంప్ పన్నాగం

**మియామి/వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాజా ప్రక్షాళన పేరుతో అక్కడ శాశ్వతంగా ఇజ్రాయిల్ తిష్టవేసేందుకు పన్నాగం పన్నారు. ఈ ప్రక్షాళన ఉద్దేశం గాజాను తిరిగి పాలస్తీనీయులకు అప్పగించడం కాదు, వారిని అక్కడి నుంచి పూర్తిగా తరిమివేయడమేనని పలువురు అంతర్జాతీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియాలో శాంతిని పునరుద్ధరించేందుకు గాజా నుండి తరలిపోయిన కుటుంబాలకు ఆశ్రయం కల్పించాలని ఈజిప్ట్ , జోర్డాన్‌లను ట్రంప్ కోరారు. . శనివారం ఎయిర్ ఫోర్స్ వన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, “మీరు బహుశా పది లక్షల మంది వ్యక్తుల గురించి మాట్లాడుతున్నారు, మేము అక్కడి నుంచి పూర్తిగా తొలగిస్తాము” అని చెప్పారు. ఇజ్రాయిల్ గత 15 మాసాలుగా గాజాపై సాగించిన దాడుల్లో ఇరవై నాలుగు లక్షల మందిలో అత్యధికులు చాలాసార్లు స్థానభ్రంశం చెందారు.గాజాలోని ప్రజల తరలింపు “తాత్కాలికంగా లేదా దీర్ఘకాలికంగా” ఉండవచ్చని ట్రంప్ అన్నారు. “గాజా ప్రస్తుతం శిథిల ప్రదేశం. దాదాపు ప్రతిదీ కూల్చివేయబడింది .కాబట్టి అక్కడి వారిని శాంతియుతంగా జీవించగలిగే వేరే ప్రదేశానికి తరలించాలనుకుంటున్నానని” చెప్పారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య బందీల విడుదల ఒప్పందం బైడెన్ అధ్యక్ష పదవి నుంచి వైదొలగడానికి కొద్ది రోజుల ముందు కుదిరింది. ఈ ఒప్పందం ఇప్పుడు రెండో వారంలోకి ప్రవేశించింది. ట్రంప్ వచ్చిన తరువాత ఇజ్రాయెల్‌కు 2,000 బాంబులను పంపాలని పెంటగాన్‌ను ఆదేశించారు. ఇజ్రాయెల్ క్రూరమైన దాడుల్లో పాలస్తీనా భూభాగం చాలా వరకు శిథిలావస్థకు చేరుకుంది, మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి . వీటి పునర్నిర్మాణానికి చాలా సంవత్సరాలు పడుతుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది..

## కాల్పుల విరమణ ఒప్పందాన్ని కాలరాసిన ఇజ్రాయిల్

- కొనసాగిన దాడులు ..

కాల్పుల్లో ఒకరు మృతి

**గాజా స్ట్రిప్ :** కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ప్రభుత్వం నిస్సిగ్గుగా ఉల్లంఘిస్తోంది. గాజాలో యథేశ్చగా దాడులు కొనసాగిస్తోంది. ఇజ్రాయిల్ బలగాలు శనివారం అర్ధరాత్రి జరిగిన కాల్పుల్లో ఓ పాలస్తీనియన్ మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. స్థానిక ఆరోగ్య అధికారులు ఆదివారం ఈ వివరాలు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున జరిగిన మరో కాల్పుల్లో ఓ చిన్నారి సహా ఐదుగురు పాలస్తీనియన్లు గాయపడ్డారని పేర్కొన్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘించడం పట్ల హమాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇజ్రాయిల్ -హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంతో ఉత్తర గాజాస్ట్రిప్‌కు తిరిగి చేరుకునేందుకు వేలాది మంది పాలస్తీనియన్లు గుమిగూడిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఒప్పందం ప్రకారం.. ఇజ్రాయిల్ శనివారం పాలస్తీనియన్లను నెటిజారిమ్ కారిడార్ నుండి గాజాకు వెళ్లేందుకు అనుమతిని నిరాకరించింది. హమాస్ మరో బందీని విడుదల చేసేవరకు ఈ చర్యను నిలిపివేస్తున్నట్లు ఇజ్రాయిల్ పేర్కొంది.

హమాస్ శనివారం నలుగురు ఇజ్రాయిల్ మహిళా సైనికులను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

## వివాహాన్ని ఆమోదించకపోతే ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కాదు

- సుప్రీంకోర్టు వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** భారతీయ శిక్షాస్మృతి ( ఐపిసి )సెక్షన్ 306 ప్రకారం వివాహానికి ఆమోదించకపోవడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. తన కుమారుడితో వివాహాన్ని వ్యతిరేకించడంతో పాటు ఆ యువతి ఆత్మహత్యకు సహకరించిందని ఆరోపిస్తూ ఓ మహిళపై దాఖలైన చార్జిషీట్‌ను కొట్టివేసింది. చార్జిషీట్, సాక్షుల వాంగ్మూలాలు సహా రికార్డులో ఉన్న పత్రాలన్నింటినీ పరిశీలించినప్పటికీ.. మహిళకు వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యం కూడా లేదని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. ఐపిసి సెక్షన్ 306 కింద నేరం చేయడానికి చాలా దూరంగా, పరోక్షంగా అప్పీలుదారు చర్యలు ఉన్నాయని గుర్తించామని పేర్కొంది. యువతి ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా అప్పీలుదారు చేసినట్లు సాక్ష్యం లేదని తెలిపింది. వాస్తవానికి, ఈ సంబంధం పట్ల మృతురాలి కుటుంబసభ్యులు అసంతృప్తితో ఉన్నారని పేర్కొంది. తన కుమారుడు, యువతి వివాహం పట్ల అప్పీలు దారు తన అసమ్మతిని వ్యక్తం చేసినప్పటికీ, అది ఆత్మహత్యకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రేరేపించే స్థాయిలో లేదని పేర్కొంది. మృతురాలికి, ఆమెను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించిన మహిళ కుమారుడికి మధ్య తలెత్తిన వివాదాలతో ఈ ఆరోపణలు వచ్చాయి. ఆ మహిళ వివాహాన్ని వ్యతిరేకిస్తున్నారని, మృతురాలిపై అవమానకర వ్యాఖ్యలు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## లెబనాన్ పౌరులపై విరుచుకుపడ్డ ఇజ్రాయిల్ సైన్యం

- 15 మంది మృతి
- 80 మందికిగా పైగా గాయాలు

**బీరుట్ :** దక్షిణ లెబనాన్‌లో స్థానిక ప్రజలపై ఇజ్రాయిల్ సైన్యం నిర్ధాక్ష్యంగా విరుచుకుపడింది. ఇజ్రాయిల్ సైన్యం ఆదివారం జరిపిన కాల్పుల్లో 15 మంది మరణించారు. 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయిల్ సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని ఆదివారం సరిహద్దు గ్రామాల్లోని స్థానిక ప్రజలు శాంతియుతంగా నిరసనలకు దిగారు. వివిధ గ్రామాల్లో ఈ నిరసనలు జరిగాయి. హెజ్బుల్లా-ఇజ్రాయిల్ మధ్య నవంబర్‌లో కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని, 60 రోజుల్లోగా దక్షిణ లెబనాన్ నుంచి సైన్యం ఉపసంహరించుకుంటామని ఇజ్రాయిల్ హామీ ఇచ్చిందని నిరసనకారులు తెలిపారు. హామీ నెరవేర్చడంలో ఇజ్రాయిల్ విఫలం చెందిందని విమర్శించారు. నిరసనకారుల్లో కొంత మంది హిజ్బుల్లా జెండాలను ధరించారు. ఈ నిరసనలపై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పుల్లో 15 మంది మరణించారని లెబనాన్ ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. అయితే ఈ కాల్పులపై ఇజ్రాయిల్ సైన్యం ఇంకా స్పందించలేదు.

## హిందూత్వ, కార్పొరేట్‌పైనే బిజెపి మనుగడ

(మొదటి పేజీ తరువాయి)

శోచనీయమన్నారు. ఇప్పుడు అమెరికాలో అధికారాన్ని చేపట్టిన ట్రంప్ ‘అమెరికా ఫస్ట్’ అనే నినాదాన్ని ఇవ్వడం ద్వారా ఆర్థికంగా, రాజకీయంగా, వాణిజ్యపరంగా ఇతర దేశాలపై ఆధిపత్యాన్ని చెలాయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పలు దేశాల్లో మితవాద శక్తులు అధికారంలోకి వస్తున్న క్రమంలో శ్రీలంకలో మాత్రం అనూర కుమార దిసనాయకే అధికారంలోకి వచ్చారని అన్నారు. బ్రెజిల్, కొలంబియా, ఈక్వెడార్, మెక్సికోల్లో వామపక్ష శక్తులు అధికారంలోకి వచ్చాయని గుర్తు చేశారు. ఇదే సమయంలో అమెరికాకు సాగిలబడుతున్న మోడీ ప్రభుత్వ విదేశాంగ విధానం ఆ దేశానికి అనుకూలంగా ఉంటోందని తెలిపారు. అంతకుముందుతో పోలిస్తే గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి 63 సీట్లు తక్కువగా వచ్చినప్పటికీ మోడీ పరిపాలనలోగాని, హిందూత్వ ఎజెండాలోగాని ఎలాంటి మార్పూ లేదన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకున్న ప్రస్తుత తరుణంలో రాజ్యాంగంలో పేర్కొన్న ప్రజాస్వామ్య, లౌకిక, సమాఖ్య విలువలకు మోడీ సర్కారు తిలోదకాలిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ, అధికార యంత్రాంగాలను ఇందుకోసం పూర్తిగా దుర్వినియోగం చేస్తోందని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో లవ్ జిహాద్, ఘర్ వాపసీ లాంటి నినాదాలను మైనారిటీలపై ప్రయోగిస్తోందన్నారు. వ్యవసాయ నల్లచట్టాలను వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ ఫ్రేం వర్క్ రూపంలో దొడ్డిదారిన తిరిగి తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూత్వ అజెండాగా పని చేస్తోన్న బిజెపి సనాతన ధర్మం కోసం పాకులాడుతోందని, తద్వారా దేశంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలను తీవ్ర వివక్ష, అణచివేతకు గురి చేస్తోందని వివరించారు. బిజెపిపై రాజకీయంగా, సామాజికంగా, సైద్ధాంతికంగా పోరాడాలని కరత్ పిలుపునిచ్చారు. ప్రజల దైనందిన సమస్యలతోపాటు కార్మికులు, కర్షకుల వర్గ సమస్యలపైనా దృష్టి కేంద్రీకరించి ఉద్యమాలకు రూపకల్పన చేయాలని దిశా నిర్దేశం చేశారు.

## నానో యూరియాతో చేటు

- పంట దిగుబడి తగ్గుదల
- పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్యయనంలో వెల్లడి

**న్యూఢిల్లీ :** నానో యూరియా వాడకంతో దిగుబడితో పాటు పదార్థాల్లో పోషక విలువలపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యయనం తెల్చింది. కేంద్ర ప్రభుత్వం ఎరువుల కంపెనీ (ఇఫ్కో)తో విస్తృతంగా ప్రచారం చేయించిన నానో యూరియాపై అతిపెద్ద, నిరంతర పరిశోధన ఈ విషయాన్ని స్పష్టం చేసింది. భారతదేశ వార్షిక ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 70 శాతంగా ఉండే వరి, గోధుమల దిగుబడి నానో యూరియా వాడకంతో తగ్గుతోందని తెలిపింది. నానో యూరియాను వినియోగించడంతో వరి, గోధుమ గింజల్లో ప్రోటీన్ కంటెంట్ వరుసగా 35 శాతం, 24 శాతం తగ్గిందని అధ్యయనం స్పష్టం చేసింది. దీర్ఘకాలంగా నత్రజని వాడకంతో వరి, గోధుమల్లో ప్రోటీన్ తగ్గడంతో పాటు దిగుబడి నష్టాలకు దారితీయవచ్చని లూథియానాలోని పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ నిపుణులు ఈ నెల ప్రచురితమైన ‘ప్లాంట్ సాయిల్ ’ జర్నల్‌లో అధ్యయనంలో పేర్కొన్నారు. దీర్ఘకాలిక ప్రభావాలపై హేతుబద్ధమైన అవగాహన అవసరమని, లేకుంటే వ్యవసాయదారుల ఆర్థిక ప్రయోజనాలు, జీవనోపాధికి హాని కలిగించవచ్చని పేర్కొంది.

యూరియా (నత్రజని) భారత దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు కీలకం. దేశవ్యాప్తంగా ఏటా సుమారు 350 లక్షల టన్నుల యూరియా అవసరమౌతోంది. దీనిలో 40 లక్షల టన్నుల యూరియాను దిగుమతి చేసుకుంటోంది. భారత్‌లో యూరియాకు భారీగా సబ్సిడీ ఇస్తోంది. 45 కిలోల యూరియా బస్తాకు భారీ సబ్సిడీనిచ్చి రైతులకు రూ.242కి విక్రయిస్తోంది. 2023-24లో యూరియాపై ప్రభుత్వం రూ.1.3 లక్షల కోట్లు ఖర్చు చేసింది. ఒక బస్తా యూరియాతో పంటకు సుమారు 20 కిలోల నైట్రోజన్‌ను అందిస్తోంది. 2022లో నానో యూరియా అందుబాటులోకి వచ్చినప్పటి నుండి యూరియాకు ప్రత్యామ్నాయంగా వినియోగించడానికి తక్కువ అధారాలు ఉన్నట్లు తేలింది. ఇఫ్కో నిర్వహించిన ట్రయల్స్‌లో మునుపటి సానుకూల ఫలితాలు ఉన్నప్పటికీ, మిశ్రమ ఫలితాలు ఉన్నాయి. అంటే జాగ్రత్తగా పరిశోధన చేపట్టడం అవసరమని తాము భావించామని పంజాబ్ వ్యవసాయ యూనివర్శిటీలో సీనియర్ సాయిల్ కెమిస్ట్, అధ్యయనానికి నేతృత్వం అధ్యయనానికి ఇఫ్కో నిధులు సమకూర్చింది. వారి అధ్యయనం ధాన్యం మూల గుణం (పొడవు, పొడి బరువు), పోషక పదార్థాలలో తగ్గింపు ఉన్నట్లు నిర్ధారించింది. 2021-22 అధ్యయనంలో మొక్కలు నానోయూరియాను స్వీకరించలేకపోయాయని, మట్టి నుండి సహజంగా అందించే నత్రజనితోనే దిగుబడి పెరుగుతోందని తేలిందని, నానోయూరియాతో దిగుబడిని తగ్గిస్తోందని ప్రొఫెసర్ సిక్కా స్పష్టం చేశారు. 8 శాతం ఎన్ మరియు 20 శాతం ఎన్ కలిగి ఉన్న నానో యూరియా కొత్త పార్ములాను కంపెనీ తీసుకువచ్చింది. ఇది కూడా దిగుబడిని పెంచడంలో విఫలమైందని సిక్కా పేర్కొన్నారు. కానీ వాటికి సంబంధించిన తుది ఫలితాలు అధికారికంగా ప్రచురించాల్సి వుంది.

## రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఒంటరి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఏదో రూపంలో కొనసాగడానికి కారణం రాజ్యాంగం, అందులోని నిబంధనలు అని చెప్పారు. ప్రస్తుతం దేశ రాజ్యాంగానికే ప్రమాదం వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందులోని ప్రాథమిక హక్కులను హరించేస్తున్నారని, సామాజిక న్యాయానికి గండికొడుతున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి ఆ స్థానంలో మనుధర్మాన్ని తీసుకురావాలనే ప్రయత్నం తీవ్రంగా జరుగుతుందని చెప్పారు. ఈ చర్యను అడ్డుకోకపోతే అభివృద్ధిలో ముందుకెళ్లలేమని అన్నారు. సనాతన ధర్మం పేరుతో నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను బలపరుస్తున్నారని విమర్శించారు. దళితులు, ఆదివాసీలతోపాటు కూలీలు, కార్మికుల హక్కులను హరింపజేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల ఉమ్మడి కృషితో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఎఎస్ శ్రీనివాస్, కెవిపిఎస్ నాయకులు దడాల సుబ్బారావు, క్రాంతి కిరణ్, ఆలిండియా రైల్వే ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల జోనల్ ప్రధాన కార్యదర్శి పాపారావు, డివైఎఫ్ఐ కార్యదర్శి జి రామన్న, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కె ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అడ్డుకున్న పోలీసులు**

రాజ్యాంగ పీఠిక పఠనం కార్యక్రమాన్ని ముందు స్వరాజ్ మైదానంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ నిర్వహించేందుకు పిలుపునిచ్చింది. అయితే ఈ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతం హై సెక్యూరిటీ జోన్‌లో ఉందనే పేరుతో అనుమతి ఇవ్వలేదు. కెవిపిఎస్ నాయకులు జి నటరాజ్‌ను గృహ నిర్బంధం చేయడంతోపాటు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, నాయకులు క్రాంతి కిరణ్‌లను అడ్డుకున్నారు. దళితులు, గిరిజనుల సమస్యల కోసం పనిచేసే సంఘాలను తీవ్రంగా అవమానించడమేనని అండ్ర మాల్యాద్రి ఈ సందర్భంగా విమర్శించారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఖండించిన సిపిఎం**

గణతంత్ర దినోత్సవం రోజు దళిత ఉద్యమ నాయకులపై పోలీసుల నిర్బంధాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పిస్తామంటే నిర్బంధించడం సిగ్గుచేటని ఆదివారం ఒక ప్రటకనలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించడమేనని తెలిపింది. ప్రజాస్వామిక హక్కుల్ని గౌరవిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రకటించి ఆరు నెలలు కాకుండానే దాన్ని హరించడం మాట తప్పడమేనని పేర్కొంది. చట్ట విరుద్ధంగా అరెస్టులు చేసిన పోలీస్ అధికారులపై చర్య తీసుకోవాలని, ఇటువంటి అప్రజాస్వామిక చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరింది.

### మీ కోసం

గ్లాసులు ఒకదానిలో ఒకటి ఇరుక్కుపోతే ఒక రాత్రంతా వాటిని ఫ్రిజ్‌లో ఉంచితే సులభంగా విడిపోతాయి.

### జీవన సౌరభం

వృథా చేసే ప్రతి క్షణం, లక్ష్యాన్ని తారుమారు చేస్తుంది.



## రైతే రాజు

రామాపురం అనే ఊరిలో రమేష్, సురేష్ అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వారు అదే ఊరిలో ఏడవ తరగతి చదువుతున్నారు. సురేష్ నాన్న గారికి ట్రాక్టర్ ఉన్నది. ట్రాక్టర్ ట్రాలీ వెనుక 'రైతే రాజు' అని వ్రాసి ఉంది. ఒకరోజు రమేష్ అది చూసి 'సురేష్, అందరూ తమ బండ్ల పైన పిల్లల పేర్లు రాసుకుంటారు. కానీ మీ నాన్న ట్రాక్టర్‌కు 'రైతే రాజు' అని ఎందుకు రాసాడు' అని అడిగాడు. సురేష్ తనకు తెలియదని చెప్పి, ఆ విషయాన్ని వారి నాన్న గోపాలం దగ్గరికి వెళ్లి అడిగాడు. అతను సురేష్‌ను ట్రాక్టర్‌పై పొలం దగ్గరికి తీసుకెళ్ళి, అందులో పని చేస్తున్న రైతులను చూపించాడు. 'మనందరి ఆహారం కోసం నిరంతరం శ్రమించేది రైతు. ఈ రైతులు లేకుంటే దేశమే లేదు. అందరికంటే ఎక్కువ కష్టపడేది రైతులే. అందుకే రైతే రాజు. అదే ట్రాలీపై రాయించాను' అన్నాడు గోపాలం. ఆ రోజంతా సురేష్ రైతుల కష్టాన్ని దగ్గర నుండి చూసాడు. రైతుల గొప్పదనం తెలిసింది. తిరిగి వచ్చేటప్పుడు రైతులకు నమస్కరించాడు. మరుసటి రోజు సురేష్ రమేష్‌కు రైతుల గొప్పదనం గురించి వివరంగా చెప్పాడు. ఆ రోజు నుండి స్నేహితులిద్దరూ రైతుల గురించి స్కూల్లో అందరికి చెప్పడం మొదలు పెట్టారు.

– పి.అవినాష్
ఏడవ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్,
సిద్దిపేట జిల్లా.

### తమాషా లెక్క




| | | | | |
|---|---|---|---|---|
| 30 | 37 | 02 | 07 | =76 |
| 04 | 05 | 32 | 35 | =76 |
| 36 | 31 | 08 | 01 | =76 |
| 06 | 03 | 34 | 33 | =76 |

పిల్లలూ మనం 76వ గణతంత్ర దినోత్సవం జరుపుకున్నాం కదా! ఈ రోజు 76 నంబరుపై ఓ తమాషా లెక్కను చూద్దాం. ఏ వరుసలో ఎటునుంచి కలిపినా మొత్తం 76 సంఖ్య వచ్చే విధంగా అడ్డం, నిలువు నాలుగు వరుసల్లో ఈ గణిత చదరం తయారుచేసుకోండి. తమాషా చూడండి.

– మడ్డు తిరుపతిరావు,
గణిత అవధాని, టీచర్,
బూరగాం, కంచిలి, శ్రీకాకుళం.

### నేను గీసిన బొమ్మ



జి.రోహిత్,
7వ తరగతి, జి.ప.ఉ.పా.నర్సింహుల పల్లి, పెద్దపల్లి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# కుష్టు నివారణకు ఉచిత చికిత్స

**ఇంటింటా సర్వేలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో చికిత్స అందించటంతోపాటుగా, వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కృషిచేస్తోంది. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 2వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమం కొనసాగుతుంది. కేంద్ర, రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, జాతీయ ఆరోగ్యమిషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నాయి. కుష్టువ్యాధిపై ప్రచురించిన అవగాహనా పోస్టర్లు, కరపత్రాలను జిల్లాస్థాయిల్లో ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు.**

కుష్టు అన్ని వ్యాధుల మాదిరిగానే ఇదొక వ్యాధి. మైక్రో బాక్టీరియం లేప్రే అనే బాక్టీరియా వల్ల వ్యాపిస్తుంది. ఈ బాక్టీరియాని 'సర్ జె ఏ హన్సన్' అనే శాస్త్రవేత్త కనిపెట్టడం వల్ల దీనిని 'హన్సన్' డిసీస్ అని కూడా అంటారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యాక్రమం రాష్ట్రవ్యాప్తంగా జనవరి 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2 వ తేదీవరకు రెండోసారి లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సిడిసి)లో భాగంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాలన్నింటిలోనూ ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికీ ఆశా కార్యకర్త, ఎఎన్‌ఎం సందర్శించి ప్రతి ఒక్కరినీ పరీక్షిస్తారు. అనుమానిత కేసులన్నింటినీ దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) వైద్యాధికారికి నిర్ధారణకు ప్రతిపాదిస్తారు. ఆయన నిర్ధారించిన తర్వాత ఉచితంగా ఎండిటి మందులు పంపిణీ చేస్తారు. ఇది నరాలు, చర్మానికి సంబంధించిన వ్యాధి.

**లక్షణాలు ఇవీ...**

– చర్మంపై స్పర్శలేని, రంగుమారిన మచ్చలు
– కళ్లు, కాళ్ళు, చేతులు అంగవైకల్యం కలిగి ఉండటం.
–అరచేతులు, అరికాళ్ళు పుండ్లు

ఈ వ్యాధి తుమ్మినా , దగ్గినా తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

జిల్లా కుష్టునివారణ అధికారి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి పై అవగాహన కల్పిస్తారు. ఆశా కార్యకర్త, ఎఎన్‌ఎం ఇంటింటికీ వెళ్లి పరీక్ష చేసే విధానాన్ని డిస్ట్రిక్ట్ న్యూక్లీర్స్ మెడికల్ ఆఫీసర్ లేదా టెంపరరీ హాస్పిటల్ వార్డ్ మెడికల్ ఆఫీసర్ లేదా ప్రాథమిక వైద్య అధికారి లేదా సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తారు. కుష్టు నొప్పి లేని వ్యాధి కావడంతో రోగులను గుర్తించిన వెంటనే చికిత్స అందించటం ద్వారా వారి అంగవైకల్యాన్ని అరికట్టొచ్చు. లెప్రసీ మందులతో పూర్తిగా నయం అవుతుంది.

ఈ వ్యాధి రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది శరీరంపై ఐదు మచ్చల కన్నా తక్కువ ఉంటే దానిని పాసీ బాసిలే (పిబి) అని అంటారు, దీనిని ఆరు నెలల కాల వ్యవధిలో పూర్తిగా నయం చేయొచ్చు. రెండోది శరీరంపై ఐదు మచ్చల కన్నా ఎక్కువ ఉంటే దానిని మల్టీ బాసిలే (ఎంబి) అని అంటారు, దీనిని 12 నెలల కాల వ్యవధిలో పూర్తిగా నయం చేయొచ్చు. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించడం ద్వారా ఎండిటి మందులతో పూర్తిగా నయమవుతుంది. ఈ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష పాటించకూడదు.

రాష్ట్రంలో ప్రతినెలా 10న పిహెచ్‌సిల్లో, 11న లెప్రసీ కాలనీల్లో డిజెబిలిటీ ప్రివెన్షన్ అండ్ మెడికల్ రిహాబిలిటేషన్ (డిపిఎంఆర్) క్యాంప్ నిర్వహించబడుతుంది. ఈ క్యాంపులో వ్యాధిగ్రస్తులకు ట్రీట్మెంట్ అందించడం, వ్యక్తిగత సంరక్షణ శుభ్రత కంటికి, చేతులకు, కాలికి ఏ విధంగా చేసుకోవాలో నేర్పించడం, వారికి సెల్ఫ్ కేర్ కిట్లను ఉచితంగా అందచేస్తున్నారు. ఈ క్యాంపు ద్వారా అంగవైకల్యం ఉన్నవారికి ఫిజియో థెరపీ చేయిస్తే కొంతమేరకు నయం చేయొచ్చు. నయం చేయడానికి వీలుపడని సమస్యని రి కంస్ట్రక్టీవ్ సర్జరీ (ఆర్‌సిఎస్) ద్వారా సరిచేయబడుతుంది. అర్హులైన వారికి సర్జరీ చేసి వారికి రూ.12 వేలు ఆర్థిక సహాయంగా అందజేస్తున్నాం. చికిత్సల సమయంలో రూ.6000, ఫస్ట్ ఫాలో అప్‌కు రూ.3000, రెండోసారికి రూ.3000 వేతన నష్టం కింద అందజేస్తున్నాం. రి కంస్ట్రక్టీవ్ సర్జరీ (ఆర్‌సిఎస్) చేయటానికి రెండు ప్రభుత్వాసుపత్రులు, ఆరు స్వచ్ఛంధ సంస్థలు పనిచేస్తున్నాయి.

రాష్ట్రంలో టెంపరరీ హాస్పిటల్ వార్డు ఆరోగ్య కేంద్రాలు 16 వరకూ ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఒక మెడికల్ ఆఫీసర్, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ఎంఎన్‌ఒ ఫనో, ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్టులు ఉన్నారు. లెప్రసీ వ్యాధిగ్రస్తులకు ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ సేవలు, అల్సర్ ట్రీట్మెంట్, లెప్ర రియాక్షన్ ట్రీట్‌మెంట్, డ్రెస్సింగ్, సెల్ఫ్‌కేర్ శిక్షణ, ఫిజియోథెరపీ, శిక్షణ, ల్యాబ్‌టెస్ట్‌లు ఉచితంగా నిర్వహిస్తారు.

**అంగవైకల్యం కల్గిన వారికి...**

అంగవైకల్యం కలిగిన లెప్రసీ వ్యాధిగ్రస్తులకు సంవత్సరానికి రెండు జతల మైక్రో సెల్యూలర్ రబ్బర్‌తో చేయబడిన చెప్పులను ఉచితంగా అందచేస్తున్నాం. ఒక్కో జతకు రూ.400 కేటాయిస్తున్నాం. నిపుణులతో కొలతలు స్వీకరించి ఆ మేరకు చెప్పులను చేయించి వారికి పంపిణీ చేయిస్తున్నాం.

**14 రోజుల పాటు అవగాహనా కార్యక్రమాలు**

మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఏటేటా జనవరి 30న యాంటీ లెప్రసీ డేగా పరిగణిస్తున్నారు. ఆరోజు నుంచి ఫిబ్రవరి 13 వరకూ జరిగే కార్యక్రమాన్ని 'స్పర్శ్' లెప్రసీ అవగాహన కార్యక్రమం అంటారు. ఈ కార్యక్రమం 14 రోజులపాటు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా మెజిస్ట్రేట్ జిల్లాను కుష్టు రహితంగా మార్చేందుకు అన్ని రకాల వనరులను ఉపయోగిస్తూ కొత్త కేసులు గుర్తించడానికి ప్రయత్నాలు చేస్తారు. వారిపై వివక్ష చూపించకుండా, చూపించిన వారి పైన చర్యలు తీసుకుంటూ వివక్షత లేని జిల్లాగా ప్రతిఒక్కరూ కృషిచేయాలని సందేశం ఇస్తూ ప్రతిజ్ఞ చేయిస్తారు.

**గ్రామస్థాయిలో ఇలా ...**

గ్రామ స్థాయిలో గ్రామ సర్పంచ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలు, వార్డు మెంబర్లు, అధికారులు గ్రామాన్ని కుష్టువ్యాధి రహితంగా మార్చేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తారు. వ్యాధికి సంబంధించిన వైదసేవలు, ఉచిత మందుల గురించి వివరిస్తారు. వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా చూస్తారు. కుష్టు రహిత గ్రామాలకు తమ వంతుగా కృషి చేస్తారు. ఈమేరకు గ్రామాల్లో సందేశాలు ఇస్తూ ప్రతిజ్ఞ సైతం చేస్తారు.

కె.పద్మావతి, అదనపు సంచాలకులు,
జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమం,
గొల్లపూడి, విజయవాడ

# ముందుగానే వేసవి తెర వినోదం

**సంక్రాంతి బరిలో నిలిచిన సినిమాల్లో 'సంక్రాంతికి వస్తున్నాం', 'డాకు మహారాజ్' సినిమాలు ప్రేక్షకాదరణ పొందగా, 'గేమ్ ఛేంజర్' డిజాస్టర్‌గానే మిగిలిపోయింది. ఈనెలాఖరులో చెప్పుకోదగిన పెద్ద చిత్రాలేమీ లేవు. పండుగ చిత్రాల జోరు మరో వారంరోజులపాటు కొనసాగే సూచనలు కన్పిస్తున్నాయి. ఆ తర్వాత నుంచి వెండితెరపై మరో నయా వినోదాల సీజన్ ప్రారంభం కానుంది. సంక్రాంతి తర్వాత అందరి చూపు వేసవి వైపే మళ్లుతుంటుంది. ఫిబ్రవరి నుంచి మార్చి వరకూ విద్యార్థులకు పరీక్షల కాలం కావటంతో.. థియేటర్ల ముందు ప్రేక్షకుల సందడి తగ్గుముఖం పడుతుంది. అందుకే ఈ నాలుగైదు వారాలు చిన్న చిత్రాలకు దారిచ్చేసి.. మార్చి నుంచి బాక్సాఫీస్ ముందు జోరు చూపించే ప్రయత్నాలను అగ్రతారలు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ పండుగ సీజన్లను తలపించేలా అదిరే వినోదాలు సినీ ప్రియుల్ని అలరించనున్నాయి. నెల ముందు నుంచే బాక్సాఫీస్‌కు వేసవి వినోదాన్ని పంచనున్నాయి.**

**గతంలో ఫిబ్రవరిలోనూ హిట్లు...**

తెలుగు చిత్ర పరిశ్రమలో బాక్సాఫీసుకు ఫిబ్రవరి నెలను అన్‌సీజన్‌గా పిలుస్తుంటారు. కొన్నాళ్లుగా ఈ నెల విజయాలకు సైతం చిరునామాగా నిలుస్తూ వస్తోంది. గతంలో వచ్చిన ఉప్పెన, నాంది, డీజే టిల్లు, భీమ్లానాయక్, ఊరుపేరు భైరవకోన... ఇలా గడిచిన మూడేళ్లకాలంలో ఫిబ్రవరి నెలలో బాక్సాఫీస్‌కు దక్కిన విజయాలు చాలా ఉన్నాయి. వీటిని గుర్తు చేసుకుంటూనే చిత్ర నిర్మాతలు, దర్శకులు కొన్ని కొత్త సినిమాలను అన్ సీజన్‌లో విడుదలచేస్తే కలెక్షన్లు రాబట్టుకోవచ్చునని భావిస్తున్నారు. ఈ క్రమంలో నిర్మితమైన కొన్ని సినిమాల విడుదలకు రంగం సిద్ధమైంది. 'గాంధీ తాత చెట్టు, ఐడెంటిటీ సినిమాలతో జనవరి ముగియనుంది. అజిత్ 'పట్టుదల'తో, నాగచైతన్య 'తండేల్'తో ఫిబ్రవరికి స్వాగతం పలకనున్నారు. వీటిలో తొలుత థియేటర్లలో వచ్చేది అజిత్ అనువాద చిత్రమే. మగిళ్ తిరుమేని రూపొందించిన ఈ సినిమా లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. యాక్షన్ థ్రిల్లర్‌గా ఇప్పటికే ప్రచార కార్యక్రమాలతో ఈ సినిమా దూసుకుపోతోంది. అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఫిబ్రవరి 6న విడుదల కానుండగా టాలీవుడ్‌లోనూ చర్చ జరుగుతోంది. ఆ మరుసటి రోజు నాగచైతన్య 'తండేల్' విడుదల కానుంది. గ్రామీణ మత్స్యకారుల జీవన విధానం పైన తెరకెక్కిన ఈ చిత్రంపైనా భారీ అంచనాలే ఉన్నాయి. ఉత్తరాంధ్ర యాసలోనూ, మత్స్యకారుల జీవితాలతో పెనువేసుకున్న ఈ చిత్రంపై కూడా నిర్మాతలు మంచి ఆసక్తితో ఉన్నారు. నాగచైతన్య సరసన సాయిపల్లవి నటిస్తున్నారు. వీరిద్దరి కలయికలో వచ్చిన 'లవ్‌స్టోరీ' బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. కార్తికేయ 2 విజయం తర్వాత చందూ మొండేటి తెరకెక్కించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా అల్లుకున్న ప్రేమకథతో రూపొందింది. దేశభక్తి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లుగా మేకర్లు చెబుతున్నారు.

**ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ...**

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న మూడు కొత్త చిత్రాలు విడుదల కానున్నాయి. విశ్వక్‌సేన్ 'లైలా', కిరణ్ అబ్బవరం 'దిల్ రూబా', రాజా గౌతమ్– బ్రహ్మానందం కలిసి నటించిన 'బ్రహ్మ ఆనందం'. ఈ మూడు సినిమాలపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలే ఉన్నాయి. వీటిలో వినూత్నమైన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైన 'లైలా'లో విశ్వక్‌సేన్ అమ్మాయిగా కనిపించటం ఆసక్తి రేకెత్తించే అంశం. బ్రహ్మ ఆనందం'లోనూ ఇలాంటి విశేషమే ఉంది. హాస్యనటుడు బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజాగౌతమ్ ఇందులో తాత– మనవడిగా నటిస్తూ అలరించనున్నారు. ఇక 'దిల్ రూబా' విషయానికొస్తే 'క' సినిమా విజయం తర్వాత కిరణ్ అబ్బవరం నుంచి వస్తున్న సినిమా కావటంతో సినీ ప్రేక్షకుల నుంచి మంచి అంచనాలు ఏర్పడ్డాయి.

**శివరాత్రికి వినోద జాతర**

గతేడాది ఫిబ్రవరిలో 'ఊరు భైరవ కోన' సినిమాతో బాక్సాఫీస్ బరిలో విజయాన్ని సందీప్ కిషన్ అందుకున్నారు. ఇప్పుడు 'మజాకా' పేరుతో మళ్లీ సినీ ప్రియుల్ని నవ్వించేందుకు సిద్ధమవుతున్నారు. 'ధమాకా' విజయం తర్వాత త్రినాథరావు నక్కిన తెరకెక్కించిన చిత్రమిది. నాన్న సెంటిమెంట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 21న విడుదల కానుంది. అదే రోజు 'జాబిలమ్మ నీకు అంత కోపమా? అనే చిత్రం కూడా విడుదల కానుంది. తమిళ కథానాయకుడు ధనుడు స్వీయదర్శకత్వం వహించారు. పవీష్, అనిఖ సురేంద్రన్, ప్రియా ప్రకాష్ వారియర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. 'రాయన్' లాంటి విజయం తర్వాత ధనుష్ దర్శకత్వంలో వస్తున్న సినిమా ఇదే కావటంతో తమిళ, తెలుగు పరిశ్రమలోనూ ఆసక్తి నెలకొంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'భైరవం' కూడా శివరాత్రి సందర్భంగా రానుంది. ఆది పినిశెట్టి నటించిన సినిమా 'శబ్దం'. ఫిబ్రవరి ఆఖరులో ఈ సినిమా విడుదల కానుంది. అరివళగన్ వెంకటాచలం తెరకెక్కించారు. తెలుగు, తమిళంలో ఫిబ్రవరి 28న విడుదల కానుంది. తమిళ కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్, అనుపమ పరమేశ్వరన్ నటించిన 'లవ్‌టుడే' సినిమా ఫిబ్రవరి 21న విడుదల కానుంది.

## జ్యోతి యర్రాజికి స్వర్ణం

- 60మీ. హార్డిల్స్‌లో జాతీయ రికార్డు బ్రేక్

**పారిస్:** ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఎలైట్ ఇండోర్ మీట్‌లో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి రికార్డు స్వర్ణంతో మెరిసింది. ఆదివారం జరిగిన 60మీ. హార్డిల్స్ ఫైనల్లో జ్యోతి 8.04సెకన్లలో గమ్యానికి చేరి బంగారు పతకాన్ని చేజిక్కించుకుంది. తొలి రేసును 8.12సెకన్లలో ముగించి ఫైనల్‌కు చేరిన యర్రాజి 24గంటలు తిరగకుండానే తన రికార్డును బ్రేక్ చేసింది. అంతకుముందు ప్రపంచ అథ్లెటిక్స్ ఇండోర్ టూర్ ఛాంపియన్‌షిప్‌లో 8.07సెకన్లతో తొలుత జ్యోతి జాతీయ రికార్డును నెలకొల్పగా.. తాజాగా ఆ రికార్డును బ్రేక్ చేసింది. ఆసియా క్రీడల్లో ఛాంపియన్ అయిన జ్యోతికి ఇటీవల భారత ప్రభుత్వం అర్జున అవార్డుతో సత్కరించింది.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సిన్నర్

- ఫైనల్లో జ్వెరెవ్‌పై వరుససెట్లలో గెలుపు

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో సిన్నర్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను, టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జన్నిక్ సిన్నర్ చేజిక్కించుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో సిన్నర్ వరుససెట్లలో 2వ సీడ్, జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరేవ్‌ను చిత్తుచేశాడు. ఏకపక్షంగా సాగిన టైటిల్ పోరులో ఇటలీకి చెందిన సిన్నర్ 6-3, 7-6(7-4), 6-3తో జ్వెరెవ్‌ను ఓడించాడు. జ్వెరెవ్ ఫైనల్లో 12 ఏస్‌లు సంధించగా.. సిన్నర్ 25ఏస్‌లకు కొట్టాడు. జ్వెరెవ్ 45 అనవసర తప్పిదాలు అతని ఓటమికి కారణాలయ్యాయి. ఈ ఓటమితో జ్వెరెవ్ మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోనూ రన్నరప్‌కే పరిమితమయ్యాడు. జ్వెరెవ్ రెండో సెట్‌లో మాత్రం కాస్తంత పోటీ ఇచ్చినా, టైబ్రేకర్‌లో ఆ సెట్‌ను చేజార్చుకున్నాడు. కాగా, సిన్నర్‌కు ఇది వరుసగా రెండో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్. గతేడాది కూడా ఇక్కడ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సిన్నరే గెలిచాడు. అంతేకాదు, అమెరికా లెజెండ్ జిమ్ కొరియర్ తర్వాత వరుసగా రెండు పర్యాయాలు ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన పిన్న వయస్కుడిగా 23ఏళ్ల సిన్నర్ ఘనత నమోదు చేశాడు. ఓవరాల్‌కు సిన్నర్‌కు ఇది మూడో గ్రాండ్ స్లామ్ టైటిల్. గతేడాది యుఎస్ ఓపెన్ లోనూ సిన్నర్ విజేతగా నిలిచాడు. సిన్నర్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ చరిత్రలో 2000 తర్వాత ఒక్క బ్రేక్ పాయింట్ కూడా కోల్పోకుండా టైటిల్ నెగ్గిన మూడో ప్లేయర్‌గా నిలిచాడు. ఇక జ్వెరెవ్ 2020 యుఎస్ ఓపెన్ ఫైనల్లో డొమినిక్ థీమ్, 2024 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో కార్లోస్ అల్కరాజ్ చేతిలో ఓటమిపాలై రన్నరప్‌కే పరిమితమయ్యాడు. ఫైనల్లో ఓటమితో 1996లో బోరిస్ బేకర్ తర్వాత గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన తొలి జర్మన్ ప్లేయర్‌గా నిలవాలన్న 27ఏళ్ల జ్వెరెవ్ ఆశలు అడియాశలయ్యాయి.

రన్నరప్‌గా నిలిచిన జ్వెరేవ్

## సూపర్-6లోనూ భారత్ అదే జోరు

బంగ్లాపై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు

**కౌలాలంపూర్:** ఐసిసి మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్‌లో భారతజట్టు జైత్రయాత్రను కొనసాగిస్తోంది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ గెలిచి గ్రూప్ టాపర్‌గా నిలిచింది. ఆదివారం సూపర్ సిక్స్ గ్రూప్–1లో భారత మహిళలజట్టు 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టును భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 64 పరుగుల వద్ద కట్టడి చేసింది. బంగ్లా బ్యాటర్లలో సుమైయా అక్తర్(21 నాటౌట్) మాత్రమే టాప్ స్కోరర్‌గా నిలిచింది. స్వల్ప లక్ష్య ఛేదన కోసం బ్యాటింగ్‌కు దిగిన ఇండియా కేవలం 7.1 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. తెలుగమ్మాయి గొంగడి త్రిష 31 బంతులను ఎదుర్కొని 8 ఫోర్లతో 40 పరుగులు చేసి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించింది. జట్టు విజయానికి చేరువైన దశలో త్రిష ఔటయ్యింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నిక్కీ ప్రసాద్ (5 నాటౌట్) విన్నింగ్ షాట్ కొట్టింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో తలపడనుంది. భారత బౌలర్లలో వైష్ణవీ శర్మ 3 వికెట్లు, షబ్నమ్, జోషిత, త్రిష తలా ఒక వికెట్ పడగొట్టారు.

## ఆంధ్ర-పాండిచ్చేరి మ్యాచ్ డ్రా

ఇన్నింగ్స్ తేడాతో నెగ్గిన హైదరాబాద్ • రంజీట్రోఫీ

**పాండిచ్చేరి:** రంజీట్రోఫీలో ఆంధ్రప్రదేశ్ జట్టు మరో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. పాండిచ్చేరితో గ్రూప్–బి లీగ్ మ్యాచ్‌ను ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో డ్రాగా ముగించింది. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్లేమీ నష్టపోకుండా 29 పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాండిచ్చేరి జట్టు నాల్గోరోజు ఆట నిలిచే సమయానికి వికెట్లేమీ నష్టపోకుండా 152 పరుగులు చేసింది. ఓపెనర్ గంగ(75), జై పాండే(59) పాండిచ్చేరిని ఆదుకున్నారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 303పరుగులు చేయగా.. పాండిచ్చేరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 260పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 8వికెట్ల నష్టానికి 319పరుగులకు ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసినా.. పాండిచ్చేరి వికెట్లను పడగొట్టడంలో నిరాశపరిచారు. దీంతో ఆంధ్ర జట్టుకు మూడు, పాండిచ్చేరి జట్టుకు ఒక పాయింట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శశికాంత్‌కు దక్కింది.

**ఇన్నింగ్స్ తేడాతో నెగ్గిన హైదరాబాద్..**

గ్రూప్–సి ఎలైట్ గ్రూప్‌లో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 43పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హిమాచల్‌ప్రదేశ్‌ను రెండో ఇన్నింగ్స్‌లో 247పరుగులకే ఆలౌట్ చేయడంతో హైదరాబాద్ జట్టు విజయం ఖాయమైంది. హైదరాబాద్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 565పరుగులు చేయగా.. హిమాచల్‌ప్రదేశ్ 275, 247పరుగులే చేయగల్గింది.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68